రాయదుర్గంలో ఎకరం ధర రూ.269 కోట్లు..

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో భూముల ధరలు మరోసారి రికార్డు సృష్టించాయి. రాయదుర్గంలో ఎకరం భూమి ధర ఏకంగా రూ.269 కోట్లు పలికింది. వారం క్రితం ఇక్కడే ఎకరం ధర రూ.264 కోట్లు పలకగా, తాజాగా దాని పక్కనే ఉన్న ప్లాట్‌లో ఎకరానికి రూ.269 కోట్లు పలకడం విశేషం. రాయదుర్గం సర్వే నంబరు 83/1లోని 5.38 ఎకరాలకు తాజాగా టీజీఐఐసీ వేలం నిర్వహించింది. కనీస ధర రూ.175 కోట్లుగా నిర్ణయించింది. రూ.10 కోట్లు ముందస్తుగా చెల్లించిన వారికి ఆన్‌లైన్ వేలంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. దీంతో పలు రియల్ ఎస్టేట్ సంస్థలు వేలంలో పోటీపడ్డాయి. చివరికి వంశీరాం బిల్డర్స్ ఎకరానికి రూ.269 కోట్ల చొప్పున 5.38 ఎకరాలను కొనుగోలు చేసింది. దీంతో టీజీఐఐసీ కాసుల పంట పండినట్లైంది. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.1,447 కోట్లు సమకూరాయి.

కేసీఆర్‌కు రాఖీ కట్టిన సునీత, తుల ఉమ

హైదరాబాద్ పెన్ పవర్: భారాస అధినేత కేసీఆర్‌కి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ తుల ఉమలు రాఖీ కట్టి హారతి ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. మహిళా నేతలిద్దరినీ కేసీఆర్ దంపతులు చీరసారెతో సత్కరించి దీవించారు. హరీశ్‌రావు నివాసానికి పలువురు భారాస మహిళా నేతలు, ఆయన సోదరీమణులు వచ్చి రాఖీ కట్టారు.

తెలంగాణలో అంగన్‌వాడీ ఉద్యోగాల జాతర.. ఇంటర్ అర్హతతో 15,982 పోస్టుల భర్తీ

- సెప్టెంబర్ నాటికి నియామకాలు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశం
- ఇంటర్ పాసైన వారు అర్హులు, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక
- ఎంపికలో ఇంటర్ మార్కులకు 70 శాతం వెయిటేజీ
- రెండు జోన్ల పరిధిలో టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీ

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం 15,982 పోస్టులను సెప్టెంబర్ నెలలోగా భర్తీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ నియామకాలు జిల్లా స్థాయిలో జరగనున్నాయి. మొత్తం ఖాళీలలో జోన్-1 పరిధిలో 1,853 టీచర్ పోస్టులు, 7,737 ఆయా పోస్టులు ఉన్నాయి. జోన్-2 పరిధిలో 1,247 టీచర్ పోస్టులు, 5,145 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ (ఇంటర్) ఉత్తీర్ణులై ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూ ద్వారా జరగనుంది. ఎంపికలో భాగంగా అభ్యర్థుల ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులకు 70 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇంటర్వ్యూకు 10 శాతం మార్కులు కేటాయించారు. అలాగే, ప్రత్యేక కేటగిరీల కింద వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పించనున్నారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసి, సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.



ఫ్యాక్టరీ జోన్‌పై ప్రభుత్వ నిర్ణయం సరైనదే: హైకోర్టు

హైదరాబాద్ పెన్ పవర్: సూర్యాపేట జిల్లాలో పతంజలి ఫుడ్స్‌కు కేటాయించిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ జోన్‌ను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనదేనని హైకోర్టు తెలిపింది. జోన్ రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై ఆ సంస్థ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనానికి అప్పీలు చేయగా.. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్ని సమర్థించింది. 2012లో నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగు, ప్రాసెసింగ్ కోసం ఫ్యాక్టరీ జోన్లు కేటాయించగా.. ఒప్పందం ప్రకారం 24 నెలల్లో ప్రాసెసింగ్ మిల్లు ప్రారంభం చేయాలన్న షరతు అమలు చేయలేదు. నిబంధన అమల్లో విఫలమైనందున గతేడాది మార్చిలో ఫ్యాక్టరీ జోన్ కేటాయింపును ప్రభుత్వం రద్దు చేసింది.



గవర్నర్‌కు ప్రముఖుల పరామర్శ

హైదరాబాద్ పెన్ పవర్: లోక్‌భవన్‌లో శుక్రవారం గవర్నర్ శివప్రతాప్ శుక్లాను పలువురు ప్రముఖులు పరామర్శించారు. కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు గవర్నర్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

తండ్రి పేరు సవరణకు.. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు 'సర్' నోటీసులు

- తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నోటీసులు జారీ
- ఓటర్ల జాబితాలో తండ్రి పేరు తప్పుగా ఉండటమే కారణం
- సర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల అందజేత
- పేరు సవరణ కోసం పత్రాలు సమర్పించిన మంత్రి

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎన్నికల అధికారులు నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా, బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) స్వయంగా మంత్రిని కలిసి ఈ నోటీసును అందజేశారు.ఓటర్ల జాబితాలో మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి సత్తయ్య గౌడ్ పేరు తప్పుగా నమోదైంది. ఈ విషయాన్ని గుర్తించిన బీఎల్ఓ, నిబంధనల ప్రకారం సవరణ నిమిత్తం మంత్రికి నోటీసు జారీ చేశారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా ఇది సాధారణంగా జరిగే ప్రక్రియే.ఈ నోటీసులపై మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే స్పందించారు. తన తండ్రి పేరును సరిచేయడానికి అవసరమైన ధ్రువపత్రాలను ఆయన బీఎల్ఓకు సమర్పించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులను సరిదిద్దేందుకే 'సర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలను సరిచూస్తున్నారు. ఈ క్రమంలోనే మంత్రికి కూడా నోటీసు అందినట్లు స్పష్టమవుతోంది.

తాళం పగలగొట్టి ఇంట్లో చోరీ 8 తులాల బంగారం అపహరణ

చోరీకి గురైన ఇల్లు

చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ సాయికుమార్

గార్ల, పెన్ పవర్, ఆగస్టు 28:ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని అదునుగా చేసుకున్న గుర్తుతెలియని దొంగలు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన గార్ల మండలంలోని ముల్కనూరు గ్రామంలో చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన సిద్ధబోయిన జోగయ్య ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన దుండగులు అర్ధరాత్రి సమయంలో ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి ఇంట్లోని బీరువాను తెరిచి అందులో భద్రపరిచిన సుమారు 8 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.15 వేల నగదును అపహరించారు. చోరీ అనంతరం దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు.ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి లోపల పరిశీలించగా బీరువాలోని బంగారం, నగదు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్సై సాయికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో కారు బీభత్సం కానిస్టేబుల్ మృతి

కానిస్టేబుల్ మృతికి కారణమైన నిందితులు అరెస్టు రిమాండ్ కు తరలింపు

హైదరాబాద్ పెన్ పవర్: మట్వాడా పోలీస్ స్టేషన్ పరిధిలోని హంటర్ రోడ్ వద్ద ఈ నెల 23న రాత్రి జరిగిన తీవ్ర రోడ్డు ప్రమాదంలో, పోలీసు కానిస్టేబుల్ కాసుల శ్రీనివాస్ మృతి చెందిన ఘటనకు సంబంధించి నిందితుడైన కొండపర్తి రాజును మట్వాడా పోలీసులు అరెస్ట్ చేసి గౌరవ న్యాయస్థానంలో హాజరుపరిచారు.

ఎఫ్ ఐ ఆర్ సంఖ్య: 455/2026 (మట్వాడా పి ఎస్ .)

లి చట్టంలోని విభాగాలు: సెక్షన్స్. 105, 125(ఏ) , 281 బి ఎన్ ఎస్. మరియు 185 మోటార్ వెహికల. (ఎం.వి) యాక్ట్

మృతుడు: కాసుల శ్రీనివాస్ (45) (ఇంటెలిజెన్స్ విభాగంలో పోలీసు కానిస్టేబుల్, పి సి నెంబర్. 3922).

లి నిందితుడు: కొండపర్తి రాజు (39), వృత్తి: స్వర్ణకారుడు, నివాసం: బృందావన్ కాలనీ, హంటర్ రోడ్, వరంగల్.

సంఘటన వివరాలు:

తేదీ 23.08.2026 రాత్రి సుమారు 09:45 గంటల సమయంలో, బాధితుడు కాసుల శ్రీనివాస్ తన విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై హంటర్ రోడ్‌లోని సంతోషిమాత దేవాలయం సమీపంలో ఉన్న ఫలూదా బండి వద్ద ఆగి మాట్లాడే క్రమంలో, నిందితుడు కొండపర్తి రాజు తీవ్రంగా మద్యం సేవించి తన కియా. సెల్తోస్ కారు (టీఎస్ 24 జె 3856)ను అత్యంత వేగంగా, నిర్లక్ష్యంగా నడిపాడు. ముందుగా ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి, అనంతరం శ్రీనివాస్ బైక్‌ను ఢీకొడుతూ కొంతదూరం ఈడ్చుకెళ్లాడు. ఆ తర్వాత పక్కనే ఉన్న ఫలూదా బండిని, మరొక బాటసారిని కూడా కారుతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ 25.08.2026న మృతి చెందారు. ఈ ప్రమాదంలో ఫలూదా బండి నిర్వాహకుడు మరియు మరో ఇద్దరు కూడా గాయపడ్డారు.

పోలీసుల తనిఖీ మరియు నిందితుడి అరెస్ట్:

ఘటన తర్వాత మట్వాడా ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎన్. కరుణాకర్ మరియు సిబ్బంది సమగ్ర విచారణ చేపట్టారు. ప్రమాదం తర్వాత నిర్వహించిన బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో నిందితుడి బి ఆర్ సి రీడింగ్ 550 గా నమోదైనట్లు తేలింది. పరారీలో ఉన్న నిందితుడిని 27.08.2026 రాత్రి అరెస్ట్ చేసి, కారులోని మద్యం సీసాతో పాటు రికవరీ సీజర్ పంచనామా నిర్వహించారు. నిందితుడికి 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ మంజూరు చేయవలసిందిగా కోర్టును కోరడం జరిగింది.

పట్టణ ప్రాంతాల్లో రోడ్డు భద్రతా మార్గదర్శకాలు -- హెచ్చరిక

సమాజంలో శాంతిభద్రతలు కాపాడటం మరియు ప్రతి ఒక్కరి ప్రయాణం సురక్షితంగా ఉంచడం పోలీసుల బాధ్యత. పట్టణ ప్రాంతాల రోడ్లపై పెరుగుతున్న ప్రమాదాలను అరికట్టడానికి మట్వాడా పోలీస్ స్టేషన్ (ఎస్ హెచ్ ఓ) తరుపున వాహనదారులకు జారీ చేస్తున్న రోడ్డు భద్రతా నిబంధనలు:

1. డ్రంక్ అండ్ డ్రైవ్ పై శూన్య సహనం

లి మద్యం సేవించి వాహనం నడపడం శిక్షార్హమైన నేరం. దీనికి మోటారు వాహనాల చట్టం 185 నిబంధనతో పాటు బి ఎన్ ఎస్. చట్టం కింద కఠిన శిక్షలు, జైలు శిక్ష విధించబడుతుంది.

లి మద్యం సేవించినట్లయితే క్యాబ్, ఆటో లేదా మద్యం సేవించని వేరే డ్రైవర్‌ను ఏర్పాటు చేసుకోండి.

2. వేగ పరిమితి దాటవద్దు (స్పీడు లిమిట్):

లి పట్టణ పరిధిలోని రహదారులపై నిర్ణీత వేగ పరిమితిలోనే వాహనాలు నడపాలి.

లి ముఖ్యంగా రద్దీ ప్రాంతాలు, యూ-టర్న్‌లు, ఫుట్‌పాత్‌లు, జంక్షన్ల వద్ద వేగాన్ని తగ్గించాలి.

3. హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి:

లి ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలి.

లి ఫోర్ వీలర్ డ్రైవర్లు మరియు ముందు సీటులో కూర్చునేవారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలి. “ఎయిర్‌బ్యాగ్‌లు ఉన్నాయి” అనే ధీమాతో నిర్లక్ష్యంగా వాహనం నడపకూడదు.

4. రోడ్డు పక్కన మరియు నో-పార్కింగ్ జోన్లలో ఆపవద్దు:

లి రహదారుల పక్కన, రద్దీ ప్రదేశాలలో మరియు సరైన వెలుతురు లేని ప్రాంతాలలో వాహనాలను అసౌకర్యంగా నిలిపివేయవద్దు.

5. ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు సీసీటీవీ నిఘా:

లి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ సిగ్నల్లను పాటించాలి. పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ సీసీటీవీల (. ఈ. శిక్ష.) పర్యవేక్షణలో ఉన్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే ఈ-చలాన్లు మరియు చట్టపరమైన చర్యలు తప్పవు.

ఘనంగా భద్రకాళి అమ్మవారి పవిత్రోత్సవాలు మహా పూర్ణాహుతి కార్యక్రమం

హైదరాబాద్ పెన్ పవర్:వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో గత మూడు రోజులుగా జరుపబడుతున్న పవిత్రోత్సవాలు నేటితో ముగిశాయి. ఈ రోజు పవిత్రోత్సవక్రతు మహాపూర్ణాహుతి జరుపబడిన అనంతరం అమ్మవారికి పవిత్ర ధారణం జరిపి భక్తులను దర్శనానికి అనుమతించారు. వందలాది మంది భక్తులు పవిత్రలు అలంకరింపబడిన అమ్మవారిని దర్శించి తన్మయత్వంతో పులకించిపోయారు. భద్రకాళీ శరణం మమ అనే నామస్మరణతో దేవస్థానం మారుమ్రోగింది.సంవత్సరం మొత్తంలో అమ్మవారికి జరుపవలసిన పూజారాధనలలో అర్చకులవల్లగానీ, భక్తుల వల్లగానీ, అధికారుల వల్లగాని సంభవించిన లోటుపాట్లు తెలిసీతెలియక జరిగిన అపచారములవల్ల సంక్రమించిన పాపము తొలగిపోయి శుద్ధిసంపాదనంతో పాటు అమ్మవారికి జరుపబడిన సంవత్సర ఆరాధనా సంపూర్ణ ఫలప్రాప్తి జరిగి లోకకళ్యాణం కోసం ఈ పవిత్రోత్సవాలను దేవాలయాలలో జరుపుతారు. దేశం మొత్తంలో శ్రీ భద్రకాళీ అమ్మవారి ఆలయం వైదికాగమ శాస్త్రానుసారం జరుపబడే పూజావిధానానికి అథారిటీగా ప్రజలు చెప్పుకుంటారు. ఇక్కడ జరిగే ఏ క్రతువైనా, ఉత్సవమైనా, ఆరాధనకైనా శాస్త్రాధారం తప్పకుండా ఉండితీరుతుంది. కాబట్టి వైదిక ఆగమ అనుయాయులు భద్రకాళీ గుడి సంప్రదాయాన్నే ఆచరణలో పెట్టుకుంటారు.ఈ రోజు శ్రావణ పౌర్ణమి, రక్షాబంధన కార్యక్రమాన్ని వేలాదిమంది భక్తులకు పురోహితులు రక్షాబంధాన్ని జరిపారు. శ్రావణ పౌర్ణమి రోజున పురోహితుడు ప్రజలకు రక్షాబంధనాన్ని జరపాలని భవష్య పురాణంలో ఉన్నట్లు ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ఇంట్లో ఆడపచులతో ఆచారం ప్రకారం జరుపుకున్ననూ శాస్త్ర పద్ధతిని అనుసరించి మంత్రోచ్చారణతో పురోహితుడి చేత రక్షాబంధనం జరుపుకోవడం భక్తులు అదృష్టంగా భావించారు. ఈరోజు శుక్రవారం కూడా కావడంతో ఉదయం నుండే అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

మహిళా సాధికారతకు కట్టుబడిన మోదీ ప్రభుత్వం

హైదరాబాద్ పెన్ పవర్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మహిళా సాధికారతకు కట్టుబడి ఉందని, కాంగ్రెస్, ‘ఇండియా’ కూటములు మహిళా వ్యతిరేక పార్టీలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఆరోపించారు. శుక్రవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో ‘రక్షాబంధన్’ వేడుకలు జరిగాయి. మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి, మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి తదితరులు రామచందర్‌రావుతోపాటు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి తదితర నేతలకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామచందర్‌రావు మాట్లాడుతూ.. ‘మోదీ సర్కారు మహిళా సంక్షేమం కోసం అనేక నిర్ణయాలు తీసుకొంది. 33% మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొస్తే కాంగ్రెస్సే అడ్డుకొంది’ అని ఆరోపించారు.

చెరువు నీటిని ప్రస్తుత పంటలకు విడుదల చేయాలని కోరిన రైతులు, నీటిని విడుదల చేయటం సాధ్యం కాదు ఇరిగేషన్ శాఖ

హైదరాబాద్ పెన్ పవర్: మహబూబాబాద్ జిల్లా బయ్యారం:...బయ్యారం పెద్ద చెరువు గతంలో మునుపెన్నడూ లేని విధంగా ఎల్నినో ప్రభావంతో వర్షాలు లేక చెరువు నిండలేదని రాబోయే నీటి కష్టాలను అధిగమించేందుకు బయ్యారం చెరువు నీటిని పంటలకు విడుదల చేయడం సాధ్యంకాదని మండల రైతులకు ఇరిగేషన్ శాఖ డీఈ నాగార్జునసాగర్ తెలిపారు.శుక్రవారం మండల రైతులు బయ్యారం చెరువు నీటిని ప్రస్తుత పంటలకు విడుదల చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను కోరారు.ఈ సందర్భంగా డిఈ నాగార్జున సాగర్ మాట్లాడుతూ అరుతడి పంటలకు కూడా ఈ ఖరీఫ్,రబీ పంట కాలంలో నీరు విడుదల సాధ్యంకాదని తెలిపారు.తొందరపడి రైతులు ఎవరు చెరువు నీరుపై ఆధారపడి పంటలు సాగు చేయవద్దని సూచించారు.సాగు చేసి రైతులు నష్టపోవద్దని తెలిపారు. సూపర్ ఎల్నినో ప్రభావంతో మండలంలోని తాగునీటి ఇబ్బందులు అధిగమించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుమల ప్రభాకర్ రెడ్డి,ఏఈ పృథ్వి,మండల రైతులు నంబూరి మధు,కలింగ రెడ్డి,రామకృష్ణారెడ్డి, భూషయ్య తదితరులు పాల్గొన్నారు.

రాఖీ కట్టిన అక్కాచెల్లెళ్లు... ప్రేమానుబంధంలో మునిగిన కుమ్మరి యాదగిరి కుటుంబం

రక్షాబంధన్ సందర్భంగా పిట్లం మండల కేంద్రంలో ఘన వేడుకలు

హైదరాబాద్ పెన్ పవర్: పిట్లం మండల కేంద్రంలో రక్షాబంధన్ పండుగను పురస్కరించుకొని అక్కాచెల్లెళ్లు--అన్నదమ్ముల మధ్య ప్రేమానుబంధాలు వెల్లివిరిశాయి. జిల్లా బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు కుమ్మరి యాదగిరి తన అక్కాచెల్లెళ్లతో కలిసి రక్షాబంధన్ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు.

ఈ సందర్భంగా అక్కాచెల్లెళ్లు కుమ్మరి యాదగిరి చేతికి ప్రేమతో రాఖీలు కట్టి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నదమ్ముల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఉన్నత స్థాయి విజయాలు కలగాలని ఆకాంక్షిస్తూ సోదరభావాన్ని చాటిచెప్పారు. అనంతరం కుటుంబ సభ్యులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొని మిఠాయిలు పంచుకుంటూ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

రక్షాబంధన్ కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అక్కాచెల్లెళ్ల ప్రేమకు, అన్నదమ్ముల ఆప్యాయతకు, కుటుంబ బంధాల మాధుర్యానికి ప్రతీక అని కుమ్మరి యాదగిరి తెలిపారు. ఎన్ని దూరాలు ఉన్నా, ఎన్ని కష్టాలు ఎదురైనా తోబుట్టువుల అనుబంధం ఎప్పటికీ చెదరదనే సందేశాన్ని రాఖీ పండుగ అందిస్తుందన్నారు.

తెలంగాణ వ్యాప్తంగా రాఖీ సందడి

రక్షాబంధన్ సందర్భంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. గ్రామాలు, పట్టణాల్లో అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ముల చేతులకు రాఖీలు కట్టి ప్రేమాభిమానాలను చాటుకున్నారు. సోదరుల క్షేమం, రక్షణ కోసం ప్రార్థిస్తూ రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు.

అక్కాచెల్లెళ్ల అనురాగం... అన్నదమ్ముల ఆప్యాయత... కుటుంబ బంధాల మాధుర్యం... ఇలా రక్షాబంధన్ పండుగ పిట్లం మండల కేంద్రంతో పాటు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆనందోత్సాహాల మధ్య ఘనంగా సాగింది.

రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె వ్యాఖ్యలతో తీవ్ర వివాదం

హైదరాబాద్ పెన్ పవర్: రక్షా బంధన్ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో పండుగ వాతావరణం నెలకొంది. మంత్రులు కొండా సురేఖ, సీతక్క కలిసి సీఎం నివాసానికి వెళ్లి ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా, ఇటీవల పరకాల నియోజకవర్గం కేంద్రంగా చెలరేగిన తీవ్ర రాజకీయ వివాదం, కుమార్తె సుస్మిత వ్యాఖ్యల దుమారం తర్వాత మంత్రి కొండా సురేఖ నేరుగా ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లడం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ వివాదానికి ప్రధాన కారణం ములుగు, పరకాల ప్రాంతాల్లో ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్న అధికారిక కార్యక్రమాలకు వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ హాజరుకాకపోవడమే. స్థానిక పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డితో సురేఖ వర్గానికి తీవ్ర విభేదాలు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో రేవూరిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం కోరడంతో, ఆయనకే మళ్లీ టికెట్ అనే సంకేతాలు వెళ్లాయి. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కొండా సురేఖ కుమార్తె సుస్మిత గీసుకొండలో ప్రత్యేక సభ పెట్టి సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరిలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేయడంతో పాటు రాబోయే ఎన్నికల్లో తాను పరకాల నుంచే పోటీ చేస్తానని ప్రకటించారు.సీఎంపై నేరుగా జరిగిన ఈ విమర్శలను కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించి పీసీసీ క్రమశిక్షణ కమిటీ ద్వారా కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. అయితే తన కుమార్తె చేసిన కామెంట్లకు తాను బాధ్యురాలిని కానని సురేఖ వివరణ ఇచ్చినప్పటికీ, ఆమెపై కేబినెట్ నుంచి వేటు పడే అవకాశం ఉందనే ఊహాగానాలు జోరుగా సాగాయి. ఇలాంటి తీవ్ర ఉత్కంఠ వాతావరణంలో, రాఖీ పండుగ సందర్భంగా కొండా సురేఖ నేరుగా సీఎం నివాసానికి వచ్చి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టడం ద్వారా వివాదాలకు స్వస్తి చెప్పి రాజీ మార్గాన్ని ఎంచుకున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

రాఖీతో రాజీ అయినట్లేనా

సాధారణంగా కేబినెట్‌లో ఉన్న మహిళా మంత్రులు ముఖ్యమంత్రికి రాఖీ కట్టడం అనేది ఏటా జరిగే ఆనవాయితీయే. అయితే ప్రస్తుత కాంగ్రెస్ పార్టీలోనూ, ప్రభుత్వం లోపల నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలలో మంత్రి కొండా సురేఖ, సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్ళి రాఖీ కట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఒకవేళ సురేఖ .. సీఎంకు రాఖీ కట్టకుండా ఉంటే ఇప్పటికే వారిద్దరి మధ్య నడుస్తున్నట్లు ప్రచారంలో ఉన్న విభేదాలకు అది మరింత బలాన్ని చేకూర్చేది. మరింత " రం పెరిగింది అనే ఊహాగానాలు పతాక స్థాయికి చేరేవి.ఒకవేళ సురేఖ రాఖీ కట్టేందుకు వచ్చినసమయంలో రేవంత్ రెడ్డి ఆసక్తి చూపించకపోతే అది పార్టీలో పెద్ద సంచలనంగా మారేది. అయితే రేవంత్ రెడ్డి లాంటి రాజకీయ నేత, అంతిమంగా నష్టం చేకూర్చే ఇలాంటి నిర్ణయాలు ఎప్పటికీ తీసుకోరు. పార్టీ ప్రతిష్ఠ దెబ్బతినకుండా, అంతర్గత విభేదాలు రచ్చకెక్కకుండా ఉండేలా చూసుకోవడంపైనే ఆయన దృష్టి ఉంటుంది. అందుకే ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా, ప్రోటోకాల్, సాంప్రదాయాన్ని గౌరవిస్తూ ఆత్మీయంగా రాఖీ కట్టించుకునేందుకే రేవంత్ సుముఖత చూపారుఅయితే ఇక్కడ అసలైన ప్రశ్న ఏమిటంటే.. ఈ ఒక్క రాఖీ వేడుక ఇప్పటివరకు వారిద్దరి మధ్య చోటుచేసుకున్న రాజకీయ విభేదాలను, అంతర్గత అసంతృప్తులను పూర్తిగా తుడిచిపెట్టేస్తుందా? అనేదే. పైకి చిరునవ్వులతో ఫోటోలకు ఫోజులిచ్చి, స్వీట్లు తినిపించుకున్నప్పటికీ.. ఇప్పటి వరకూ జరిగినవి మరుగున పడే అవకాశం ఉండదు. నాయకత్వ స్థాయిల్లో ఉత్పన్నమైన అభిప్రాయ భేదాలు అంత సులభంగా మాయమవుతాయని చెప్పడం కష్టమే. రాజకీయాల్లో పైకి కనిపించే ఆత్మీయత వేరు, లోపల ఉండే వ్యూహాత్మక పూతలు వేరు.అంతిమంగా ఈ రాఖీ కట్టే ఘట్టం తాత్కాలికంగా ముఖంపై రంగు పూసి పొలిటికల్ డ్యామేజ్ కంట్రోల్ చేయడానికి బాగా ఉపయోగపడింది. పబ్లిక్ డొమైన్‌లో పరిస్థితి సాధారణంగా ఉందనే సంకేతాన్ని క్యాడర్‌కు పంపడంలో ఈ వేడుక సఫలమైనప్పటికీ.. కొండా సురేఖ క్రమశిక్షణ ఉల్లంఘన అసలు సమీకరణాలు రాబోయే రోజుల్లో కీలక మలుపులు తిరగడానికి అవకాశం ఉంది.

02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు'

'పొ. 12 సెం.మీ. వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి'

93948 55244

వరకులు వర్తిస్తాయి

మహిళలకు సీఎం రేవంత్ రెడ్డి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

హైదరాబాద్ పెన్ పవర్: రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అక్కచెల్లెళ్లకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకైన ఈ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం వెల్లివిరియాలని అన్నారు.

హట్టి గోల్డ్ మైన్స్‌ను సందర్శించిన ఉప ముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్ పెన్ పవర్: కర్ణాటకలోని హట్టి గోల్డ్ మైన్స్‌ను తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సందర్శించారు. ఇందులో భాగంగా, అక్కడ ఉన్న యూటీ (ఖీఅ) ఓపెన్ కాస్ట్ గోల్డ్ మైనింగ్‌ను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మైన్ వ్యూ పాయింట్ నుండి బంగారం ముడి మట్టి వెలికితీత ప్రక్రియను డిప్యూటీ సీఎం ప్రత్యక్షంగా వీక్షించారు. గనిలో ఎంత లోతు నుంచి బంగారం ముడి సరుకును సేకరిస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం, బంగారం ఖనిజ గనికి సంబంధించిన సమగ్ర మ్యాప్‌లను ఆయన లోతుగా పరిశీలించారు. ఈ సందర్భంగా గడిచిన ఐదేళ్ల బంగారు ఉత్పత్తి వివరాలను మైనింగ్ అధికారులు డిప్యూటీ సీఎంకు నివేదించారు. యూటీ ఓపెన్ కాస్ట్‌తో పాటు, ప్రధాన భూగర్భ (అండర్‌గ్రౌండ్) గని ఉత్పత్తుల వివరాలపై కూడా ఆయన ఆరా తీశారు. ఈ పర్యటనలో డిప్యూటీ సీఎం వెంట సింగరేణి సీఎండీ బుద్ద ప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో పోలీసుల దౌర్జన్యంపై మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం

హైదరాబాద్ పెన్ పవర్: సూర్యాపేటలో జరిగిన కూల్చివేతల సమయంలో పోలీసులు దౌర్జన్యంగా ప్రవర్తించారని మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. మొన్న మహబూబాబాద్లో ఓ పోలీసు అధికారి పాలిటెక్నిక్ విద్యార్థి గొంతు పిసికి క్రూరంగా ప్రవర్తించాడు. నిన్న నాగర్కర్నూల్ జిల్లా తిమ్మాజీపేటలో తన కుమార్తెకు జరిగిన అవమానంపై ఫిర్యాదు చేయడానికి వచ్చిన వ్యక్తిని బూటుకాళ్లతో తన్ని, మూత్రం తాగించారనే ఆరోపణలు వచ్చాయి.

నేడు సూర్యాపేటలో సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడని కేసులు.. కోదాడలో బేడీ కొట్టు తొలగింపు.. నిరసన తెలిపిన వారిపై సిఐ దౌర్జన్యం చేసాడు. అసలు తెలంగాణలో ఉన్నది ప్రభుత్వమా? లేక పోలీసు పాలనా అని ప్రశ్నించారు.

ప్రతిపక్షాలపై పోలీసులతో జులుం..ప్రజలపై పోలీసులతో జులుం..ప్రశ్నిస్తే కేసులు..నిరసిస్తే అరెస్టులు.. హక్కులు అడిగితే దౌర్జన్యాలు.ఇదేనా మీరు చెప్పుకున్న ప్రజాపాలన అని నిలదీసారు.

డీజీపీ గారు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి, కారకులైన పోలీసులపై విచారణ జరిపి తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

రేవంత్ రెడ్డి 4 నెలల తుగ్లక్ పాలనను బట్టబయలు చేసిన కాగ్ (CAG) రిపోర్ట్

అప్పుల సునామీలో తెలంగాణ.. బడ్జెట్ పేరుతో పచ్చి మోసం: దాసోజు శ్రవణ్ ధ్వజం

హైదరాబాద్ పెన్ పవర్: 'కష్టపడే తత్వమే ఆయుధమైతే సంపద సృష్టించడం సాధ్యమవుతది.. కానీ బూతులు, డైవర్షన్ రాజకీయాలు, అడ్డగోలు అప్పులే ఆయుధాలైతే రాష్ట్రం దివాళా తీయడం ఖాయం' అని బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జూలై 2026 నాటి కాగ్ (జూలై+) అధికారిక లెక్కలను విడుదల చేస్తూ.. రేవంత్ సర్కార్ చెప్తున్న 'తెలంగాణ రైజింగ్', '3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ' ముచ్చట్లన్నీ ఒట్టి బూటకమని తేల్చిచెప్పారు.

బడ్జెట్ లెక్కల్లో పచ్చి మోసం -- మిగులు పోయి లోటు మిగిలింది:

అసెంబ్లీలో రూ. 6,857 కోట్ల రెవెన్యూ మిగులు ఉంటుందని అబద్ధాలు చెప్పారు. తీరా చూస్తే కేవలం 120 రోజుల్లోనే రూ. 19,266 కోట్ల రెవెన్యూ లోటు తేలింది.

రోజువారీ పాలన నడవడానికే ఖజానా నుంచి నెలకు ఏకంగా రూ. 4,816 కోట్లు ఆవిరైపోతున్నాయి.

ప్రాథమిక లోటు (గ్రాస్అమితీఎ ఇవటఅఎ) రూ. 23,197 కోట్లకు (ఏడాది టార్గెట్‌లో 62.44%) చేరిందంటే.. అప్పు పుట్టకపోతే పూట గడవని పరిస్థితికి రాష్ట్రాన్ని తెచ్చారు.

4 నెలల్లోనే 58% అప్పులు స్వాహా -- 'అప్పుల రేవంత్':

ఏడాది మొత్తానికి ఉన్న నికర అప్పుల పరిమితి రూ. 58,458 కోట్లు అయితే.. జూలై నాటికే రూ. 33,730 కోట్లు (57.70%) ఊడ్చేశారు.

చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికే రూ. 10,532 కోట్లు పోయాయి. అంటే ఏడాది వడ్డీ బడ్జెట్‌లో సగం (49.44%) నాలుగు నెలల్లోనే ఖర్చయిపోయింది.

బడ్జెట్‌లో పెన్షన్ల కోసం పెట్టిన దాంట్లో ఇప్పటికే 71.20% (రూ. 10,492 కోట్లు) ఖర్చయిపోయింది.

జీతాలు, నిర్వహణ ఖర్చులేమో రూ. 78,909 కోట్లకు (33.66%) ఎగబాకాయి..

కానీ రాష్ట్రానికి ఆస్తులు సృష్టించే మూలధన వ్యయం (క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్) మాత్రం రూ. 9,272 కోట్లతో (19.62%) కునారిల్లుతోంది.

ఆదాయాలన్నీ ఢమాల్ - లీకేజీలు, అవినీతికి నిదర్శనం:

1. పన్నేతర ఆదాయం : రావాల్సిన రూ. 35,730 కోట్లలో వచ్చింది కేవలం రూ. 4,274 కోట్లు (11.96%). ఇసుక, మైనింగ్, రాయల్టీలలో భారీగా దోపిడీ జరుగుతోంది.

2. కేంద్ర గ్రాంట్లు: 78 సార్లు ఢిల్లీ చక్కర్లు కొట్టినా తెచ్చింది కేవలం రూ. 2,363 కోట్లు (9.78%). బడ్జెట్ టార్గెట్ రూ. 24,166 కోట్లలో పదో వంతు కూడా రాలేదు.

3. ఎక్సైజ్ / మద్యం ఆదాయం:

ఊరూరా మద్యం ఏరులై పారుతున్నా వచ్చింది రూ. 6,965 కోట్లే (25.18%). ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన పైసలు మధ్యం సిండికేట్ల జేబుల్లోకి పోతున్నాయి.

4. రిజిస్ట్రేషన్లు ఽ స్టాంపులు: రియల్ ఎస్టేట్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టడంతో రూ. 6,144 కోట్లే (31.45%) వచ్చాయి.

5. జీఎస్టీ: మార్కెట్లో కొనుగోలు శక్తి పడిపోయి రూ. 19,103 కోట్లకు (31.03%) పరిమితమైంది.

హామీలు గాలికి - ప్రజలకు తీరని ద్రోహం:

ఖజానా ఖాళీ చేసి.. రైతు భరోసా, రుణమాఫీ, రూ. 4,000 పెన్షన్లు, నిరుద్యోగ భృతి వంటి హామీలకు పైసలు ఎక్కడి నుంచి తెస్తారు?

విద్య, వైద్య రంగాలకు పైసలేవు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు రూ. 10,000 కోట్లకు చేరి ఆసుపత్రులు, కాలేజీలు బంద్ అయ్యే పరిస్థితి వచ్చింది.

మూసీ ప్రాజెక్ట్, మెట్రో ఫేజ్-2, ఫ్యూచర్ సిటీ అంటూ బడ్జెట్ కేటాయింపులు లేకుండా కాగితాల మీద కలరింగ్ ఇస్తున్నారు.

బీఆర్ఎస్ డిమాండ్లు:

1. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులు, లీకేజీలపై తక్షణమే అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేయాలి.

2. ఇచ్చిన హామీలను ఏ పైసలతో నెరవేరుస్తారో స్పష్టమైన ఆర్థిక రోడ్‌మ్యాప్ బయటపెట్టాలి.

3. ప్రజాధనాన్ని వృథా చేస్తూ చేస్తున్న పీఆర్ ప్రచారాలు ఆపి, దివాళా అంచున ఉన్న రాష్ట్రాన్ని కాపాడాలి.

గృహనిర్మాణ, ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష

హైదరాబాద్ పెన్ పవర్: రెండుపడక గదులు నిర్మాణ ప్రక్రియ గురించి గృహనిర్మాణ మరియు ఇంజనీరింగ్ అధికారులతోజిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష నిర్వహించారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయా మండలాల వారిగా నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణాలను సమీక్షిస్తూ, నిర్మాణంలో ఉన్న ఇండ్లను కాంట్రాక్టర్ తో చర్చించి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే కాంట్రాక్టర్ పేమెంట్ సైతం సకాలంలో అందించాలని తెలిపారు. నిర్మాణం పూర్తైన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అసలైన లబ్దిదారులకు అందించి ఆ ఇండ్లను ప్రారంభానికి సిద్ధం చెయ్యాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో రెండు పడక గదులను లబ్దిదారులకు అందించిన ఇండ్లకు ఎలక్ట్రిసిటీ, తాగునీటి వసతి, సిసి రోడ్లు, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణాలు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రెండు పడక గదులు గృహాలు పూర్తి చేసేందుకు గృహ నిర్మాణ శాఖ, ఆయా ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పిడి భగవంత్ రావు, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, ఈడబ్ల్యూఐడిసి ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి, డిఈ లు, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

దుద్యాలలోనేత్రదానఅవగాహన వైద్య శిబిరం

హైదరాబాద్ పెన్ పవర్: శుక్రవారము జాతీయ నేత్రదానపక్షోత్సవాలసందర్భంగా కొత్తపల్లి మండలంలోని దుద్యాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేత్రదాన అవగాహన వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్యులుషేక్‌షావలికార్యక్రమంలో విద్యార్థులకు నేత్రదానం ప్రాధాన్యతపైఅవగాహన కల్పించారు.ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో నేత్రదానంద్వారామరణానంతరం ఇద్దరు అంధులకు చూపు కల్పించే అవకాశం ఉందని వైద్యులువివరించారు.మరణించినవ్యక్తి నుంచి వీలైనంతత్వరగా, సాధారణంగా ఆరు గంటల్లోపు కార్నియాను సేకరించడం ద్వారా చూపులేని వారికి వెలుగును అందించవచ్చని తెలిపారు.

నేత్రదానం చేయడం వల్ల దాత కుటుంబ సభ్యులకు ఎలాంటి ఆర్థిక భారంఉండదని,నేత్రాలను సేకరించే ప్రక్రియ తక్కువ సమయంలోనే పూర్తవుతుందని చెప్పారు. వయస్సుతో సంబంధం లేకుండా అనేక సందర్భాల్లోనేత్రదానంచేయవచ్చని, ప్రజలు అపోహలను వీడి నేత్రదానానికిముందుకురావాలని వైద్యులు సూచించారు.కంటి చూపు కోల్పోయిన వారికి వెలుగునుఅందించడంద్వారామరణానంతరం కూడా మరొకరి జీవితంలోవెలుగులునింపవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపైఅవగాహనపెంచుకుని, తమకుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులకు కూడా నేత్రదాన ప్రాధాన్యతను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానఉపాధ్యాయులు సుబ్బారెడ్డి ఉపాధ్యాయులు పి. ఇద్రుస్ ఆరోగ్యకార్యకర్తలు త్రివేణి, విమలజ్యోతి మరియు ఆశా కార్యకర్తలు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

56 సెల్ఫ్ టికెటింగ్

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) ప్రయాణికుల సౌకర్యార్థం మరో కీలక నిర్ణయం తీసుకుంది. నాన్‌స్టాప్ బస్సు సర్వీసుల్లో 'సెల్ఫ్ టికెటింగ్' విధానాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. బస్సు ఎక్కే ముందు టికెట్ కోసం వేచి చూసే అవసరం లేకుండా, ప్రయాణికులే స్వయంగా టికెట్ కొనుగోలు చేసేలా ఈ కొత్త విధానాన్ని రూపొందించింది.ఈ విధానంలో భాగంగా ప్రయాణికులు బస్సు ఎక్కే ముందు డోర్ వద్ద ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను తమ స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేయాలి. అనంతరం తాము ఎక్కే, దిగే స్టాప్‌ల వివరాలను నమోదు చేసి, ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించగానే టికెట్ జనరేట్ అవుతుంది. ఆ డిజిటల్ టికెట్‌ను డ్రైవర్‌కు చూపిస్తే సరిపోతుంది.ప్రయోగాత్మకంగా ఈ స్మార్ట్ టికెట్ విధానాన్ని తొలుత నల్గొండ-హైదరాబాద్ మార్గంలో అమలు చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఈ రూట్‌లో ప్రస్తుతం 45 డీలక్స్ నాన్‌స్టాప్ బస్సులు నడుస్తున్నాయి. ఇక్కడ ఈ విధానం విజయవంతమైతే, సెప్టెంబర్ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని మిగతా అన్ని నాన్‌స్టాప్ రూట్లలోనూ విస్తరించాలని భావిస్తున్నారు.ఈ కొత్త విధానం వల్ల ప్రయాణికులకు చిల్లర సమస్య తీరడంతో పాటు సమయం ఆదా అవుతుందని ఆర్టీసీ భావిస్తోంది. అదే సమయంలో డ్రైవర్లపై టికెట్లు జారీ చేసే పనిభారం కూడా తగ్గుతుంది. అయితే, స్మార్ట్‌ఫోన్లు లేనివారు, డిజిటల్ చెల్లింపులపై అవగాహన లేని ప్రయాణికులు యథావిధిగా డ్రైవర్ వద్దే టికెట్ కొనుగోలు చేయవచ్చని అధికారులు స్పష్టం చేశారు. ఈ సెల్ఫ్ టికెటింగ్ విధానం కోసం 'మీ సేవ'కు చెందిన 'మీ టికెట్'తో ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకుంది.

తిరుపతి విమానాశ్రయంలో ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడి కి ఘన స్వాగతం పలికిన తుడా చైర్మన్ డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి.

హైదరాబాద్ పెన్ పవర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం తిరుపతి విమానాశ్రయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్,తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్, తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి విమానాశ్రయంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు కి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి స్పీకర్ అయ్యన్న పాత్రుడు ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా ఘనంగా సత్కరించి,ఆత్మీయంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు పరస్పరం అభివాదం చేసుకుని,అభివృద్ధి, ప్రజా సంక్షేమం తదితర అంశాలపై ఆత్మీయంగా ముచ్చటించారు.

ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదవ కార్పొరేషన్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, తెదేపా తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి జేబీ శ్రీనివాస్, మక్కి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో అధిక దిగుబడులు

పత్తి తోటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రామారావు

గార్ల, పెన్ పవర్, ఆగస్టు 28: జీవన ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు అన్నారు. గార్ల మండలం లోని పూమ్య తండా లో శుక్రవారం రైతులతో కలిసి ప్రత్తి మిర్చి పంటల క్షేత్ర సందర్శన చేపట్టి రైతులకు ప్రస్తుత పంట దశలో తీసుకోవలసిన జాగ్రత్తలు యాజమాన్య పద్ధతుల పై సూచనలు సలహాలు చేశారు అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధికంగా రసాయన ఎరువులను వేయకుండా సేంద్రియ జీవన ఎరువులు వాడినప్పుడే అధిక దిగుబడులు సాధించ వచ్చునని

అధికంగా యూరియా కాంప్లెక్స్ ఎరువులను వినియోగించడం ద్వారా భూమి భౌతిక స్థితి ని కోల్పోయి చౌడు బారి పంటలకు ప్రతికూలంగా మారె అవకాశం ఉన్నదని నేలలో సేంద్రియ కార్బనం చాలా తక్కువ గా ఉన్నదని కాబట్టి రైతులు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు అవలంభించాలని రసాయన ఎరువుల మోతదు తగ్గించి పశువుల పెంట వర్మి కంపోస్ట్ పచ్చి రొట్ట ఎరువులు జీవన ఎరువులను విరివిగా వినియోగించాలని తద్వారా నేలలో సేంద్రియ కార్బనం మెరుగు పడుతుందని సూచించారు. ప్రత్తి లో రసం పీల్చే పురుగులయిన తెల్ల దోమ పచ్చ దోమ పెనుబంక తామర పురుగులను గమనిస్తూ సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూక్ష్మ పోషక లోపాలనునివారించాలని పూత దశలో నేలలో తగినంత తేమ ఉండేలా చూసి నీటి ఏద్దడిని నివారించాలని పొటాష్ ఎరువును ఎకరాకు 25 కేజీ లు వేయడం ద్వారా కాయల అభివృద్ధి కి సహాయ పడుతుందన్నారు ప్రస్తుతం మిర్చి నాటు పెట్టే రైతులు ఆఖరి దుక్కిలో ట్రైకో డెర్మా సూడోమోనస్ లను వేయడం ద్వారా వేరుకుళ్ళు కాండం కుళ్ళు ఎండు తెగులు రాకుండా నివారించ వచ్చునని తెలిపారు. రైతులు మేలైన యాజమాన్య పద్ధతుల కొరకు వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ క్షేత్ర సందర్శన లో రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మల హైస్కూల్ లో రక్షాబంధన్ వేడుకలు

రాఖీలు కట్టుకున్న ఉపాధ్యాయులు

రక్షాబంధన్ వేడుకల్లో విద్యార్థులు

గార్ల, పెన్ పవర్, ఆగస్టు 28 :రాఖీ పండుగ సోదరీ సోదరుల ప్రేమానురాగాలకు ప్రతీకఅని నిర్మల హై స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ జీన్సీ అన్నారు గార్ల మండల కేంద్రంలోని స్థానిక నిర్మల హైస్కూల్లో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని పరస్పర రక్షణ సోదర భావాన్ని చాటుకున్నారు. అనంతరంఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ జీన్సీ మాట్లాడుతూ రక్షాబంధన్ కేవలం అన్నాచెల్లెళ్ల బంధానికి పరిమితం కాకుండా సమాజంలో పరస్పర ప్రేమ సామరస్యం రక్షణ భావాలను పెంపొందించే పండుగ అని అన్నారు. విద్యార్థి దశ నుంచే భారతీయ సంస్కృతి నైతిక విలువలను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ ఆన్సులిన్ కొచ్చు తెరిసా , సిస్టర్ సెలైన్ జార్జ్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు , సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేటు ఖాయం...

హైదరాబాద్, ఆగస్టు 28, పెన్ పవర్:
తెలంగాణ మంత్రి కొండా సురేఖ వ్యవహారంలో కాంగ్రెస్ హైకమాండ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఆమెపై కఠిన చర్యలు తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఈ వివాదానికి సంబంధించి తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించిన అధిష్ఠానం, తుది నిర్ణయాన్ని తీసుకునేందుకు సిద్ధమవుతోంది. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అందుబాటులో లేకపోవడంతో సెప్టంబరు రెండో తేదీ వరకూ ఎలాంటి నిర్ణయం వెలువడకపోవచ్చు. ప్రస్తుతం ఆయన ఢిల్లీలో లేరు. ఆయన వచ్చిన తర్వాత మాత్రమే కొండా సురేఖ, చిన్నారెడ్డిపై చర్యల గురించి ఒక నిర్ణయానికి పార్టీ నాయకత్వం వచ్చే అవకాశముంది. క్రమశిక్షణ చర్యలు తీసుకోకుంటే పార్టీలో నేతలు మరింత గాడి తప్పుతారన్న భావన నెలకొంది. అయితే కేసీ వేణుగోపాల్ విదేశాల నుంచి ఢిల్లీ వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో సమావేశమై వారితో చర్చించిన అనంతరమే అధికారికంగా ఏ విషయాన్ని పార్టీ నాయకత్వం ప్రకటిస్తుందని కూడా సమాచారం అందుతుంది. అయితే ఎటువంటి చర్యలుంటాయి? కొండా సురేఖకు ప్రత్యామ్నాయంగా మరొక బీసీ నేత పేరును కూడా ఇప్పటికే ఇక్కడి నాయకత్వం సిద్ధమయినట్లు సమాచారం. హైకమాండ్ కోరితే వెంటనే రెండు నుంచి మూడు బీసీ నేతల పేర్లను నాయకత్వానికి ఇవ్వాలన్న యోచనలో ఉన్నారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించినప్పటికీ మరొక బీసీ నేతకు కేబినెట్ లో అవకాశం ఇవ్వడం ద్వారా బీసీల్లో వ్యతిరేకత రాకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశముంది. హైకమాండ్ ఆలోచనలివీ... 1. పదవికి రాజీనామా: కొండా సురేఖను గౌరవప్రదంగా తన మంత్రి పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని అధిష్ఠానం కోరే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. 2. మంత్రివర్గం నుండి బర్తరఫ్: ఒకవేళ ఆమె రాజీనామాకు నిరాకరిస్తే, మంత్రివర్గం నుంచి నేరుగా తొలగించే (బర్తరఫ్) అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. సస్పెన్షన్ లేదా క్రమశిక్షణా చర్యలు... పార్టీ ప్రతిష్ఠ దెబ్బతినకుండా ఉండేందుకు ఆమెపై సస్పెన్షన్ లేదా తీవ్రమైన క్రమశిక్షణా చర్యలు ఉండేలా తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవి నివేదికను ఏఐసీసీకి పంపారు. ప్రత్యామ్నాయంపై కసరత్తుకొండా సురేఖ స్థానంలో మరో మహిళా నేతకు మంత్రి పదవి ఇవ్వాలని హైకమాండ్ భావిస్తోంది. ఇందులో భాగంగానే బీసీ సమీకరణాలు దెబ్బతినకుండా ఎమ్మెల్సీ విజయశాంతి లేదా ఇతర మహిళా ఎమ్మెల్యేల పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ విషయంలో కొండా సురేఖపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రస్తుతం విదేశాల్లో ఉన్నారు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత, సెప్టెంబర్ మొదటి వారంలో కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలతో రాష్ట్ర నేతలు భేటీ అయి తుది నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

కలకలం రేపుతున్న అనిరుధ్ రెడ్డి కామెంట్స్

కొండా సురేఖ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతున్న వేళ కాంగ్రెస్ నేత, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. మహిళలను తాను ఎంతో గౌరవిస్తానని పేర్కొన్న అనిరుధ్ రెడ్డి.. వారి గురించి బహిరంగంగా ప్రెస్‌మీట్లు పెట్టి మాట్లాడే ఉద్దేశం తనకు లేదని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా మహిళల పట్ల తన వైఖరిని వివరిస్తూ అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. మహిళలు తనను తిట్టినా వాటిని ఆశీర్వాదాలుగానే భావిస్తానని పేర్కొన్నారు. తన తల్లి తనను మందలించినా ఎదురు మాట్లాడకుండా అక్కడి నుంచి వెళ్లిపోతానని చెప్పారు. మహిళలు కన్నీళ్లు పెట్టుకుంటే ఆ భావోద్వేగాన్ని తేలిగ్గా తీసుకోకూడదని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఒక మహిళ కన్నీరు ఒక్క చుక్క నేలపై పడినా అది సునామీగా మారుతుంది.. ఆ సునామీలో మనమే కొట్టుకుపోతాం అని పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖకు సంబంధించిన వివాదంపై ఎవరూ బహిరంగంగా మాట్లాడవద్దని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే సూచించారని అనిరుధ్ రెడ్డి తేల్చి చెప్పారు.

ఈ వ్యవహారం ప్రస్తుతం కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ పరిశీలనలో ఉందని చెప్పారు. ఏఐసీసీ, పీసీసీ, ముఖ్యమంత్రి స్థాయిలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి తాము కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. ఎవరు తప్పు చేశారనేది దేవుడికి తెలుసని చెప్పిన అనిరుధ్ రెడ్డి.. క్రమశిక్షణ కమిటీ నివేదిక ఎలా ఉన్నా దాన్ని గౌరవిస్తామని అనిరుధ్ రెడ్డి తేల్చి చెప్పారు. పార్టీ అంతర్గత వ్యవహారంపై తాను మరింతగా స్పందించను అనే సంకేతాలు ఇచ్చారు. ఇదే సమయంలో తన నియోజకవర్గ సమస్యలపై మాత్రం వెనక్కి తగ్గేది లేదని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. జడ్చర్లలో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు నిలిచిపోయాయని.. బిల్లుల చెల్లింపుల కోసం ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. తన నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడితే ఎవరినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అవసరమైతే మంత్రులను కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరుతానని.. నిధులు రాకపోతే దీక్షకు కూడా కూర్చుంటానని వ్యాఖ్యానించారు. 'మహిళ కన్నీరు నేలపై పడితే సునామీనే'.. కొండా సురేఖ వివాదంపై అనిరుధ్ రెడ్డిప్రజల సమస్యల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో తప్పేమీ లేదని ఈ సందర్భంగా అనిరుధ్ రెడ్డి అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రజలకు ప్రశ్నించే హక్కును కల్పించిందని.. తమ నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. మొత్తంగా కొండా సురేఖ వ్యవహారంపై సంయమనం పాటిస్తూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పిన అనిరుధ్ రెడ్డి.. మరోవైపు జడ్చర్ల అభివృద్ధి విషయంలో మాత్రం ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో వెనుకడుగు వేయబోనని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది.

వికలాంగుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

జెండా ఆవిష్కరిస్తున్న వి హెచ్ పి ఎస్ ఇంచార్జ్ వెంకటేశ్వర్లు

గార్ల, పెన్ పవర్ , ఆగస్టు 28: వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గార్ల మండల కేంద్రంలోని స్థానిక నెహ్రూ సెంటర్‌లో శుక్రవారం ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి దేశపాక మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు తొలుత
వికలాంగుల హక్కుల పోరాట సమితి గార్ల మండల ఇన్‌చార్జి కొండ వెంకటేశ్వర్లు జెండాను ఆవిష్కరించారు అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందేలా కృషి చేయాలని, వారి హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 2007 ఆగస్టు 28న పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ వికలాంగుల హక్కుల పోరాట సమితిని ఏర్పాటు చేశారని తెలిపారు. వికలాంగుల సమస్యల పరిష్కారం, సంక్షేమం, సమాజంలో సమాన గౌరవం కోసం ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తోందన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గిన్నారపు మురళీ, తారక రామారావు, కమటం నరసయ్య, శ్రీను నాయక్ ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాఖీ పండుగ పేరుతో ఆర్టీసీ స్పెషల్ బస్సుల్లో చార్జీల బాదుడు

హైదరాబాద్ పెన్ పవర్: ఆర్టీసీ స్పేషల్ బస్సులలో ప్రయాణికుల జేబులకు చిల్లు పడుతున్నాయి. పండుగల పేరుతో ఇష్టానుసారంగా చార్జీలు పెంచుతున్నారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్ కు నార్మల్ ఛార్జ్ 290. పండుగ పేరుతో 1:50 రూల్ పేరుతో అదనంగా 100 నుంచి 150 చార్జీలు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్ కు మెట్రో డిలక్స్ స్పెషల్‌బస్ లో 400 వసూలు చేస్తారు. సూపర్ లగ్జరీ బస్సులు లో అదనపు చార్జీల బాదుడు కొనసాగింది. ప్రయాణికులు లబో దిబో అంటున్నారు. స్పెషల్ బస్సుల్లో ప్రయాణికులు ఎక్కిన తర్వాత మార్గ మధ్యంలో ఎక్కువ చార్జీలు ఆర్టీసీ కండక్టర్ లు వసూలు చేస్తున్నారు. అధికారులు ఆర్టీసీ ఉద్యోగుల నిర్లక్ష్యంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడంలేదు.

మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

హైదరాబాద్ పెన్ పవర్: రాఖీ పౌర్ణమి సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారిక నివాసంలో కుటుంబ సభ్యుల మధ్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కి ఆయన సోదరీమణులు రాణి,విమల రాఖీ కట్టి, ప్రేమాభిమానాలను చాటుకున్నారు. అలాగే మంత్రి సోదరులు పొన్నం అశోక్ గౌడ్, పొన్నం రవిచంద్రలకు కూడా సోదరీమణులు రాఖీలు కట్టారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్,
పొన్నం అశోక్ గౌడ్, పొన్నం రవిచంద్రలు తమ అక్కాచెల్లెళ్ల ఆశీర్వాదాలు తీసుకున్నారు. కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయంగా రాఖీ పౌర్ణమి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా సోదర ,
సోదరీమణుల మధ్య ఉన్న ప్రేమ, అనుబంధం, ఆప్యాయతలకు రాఖీ పౌర్ణమి ప్రతీకగా నిలుస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

ప్రముఖ నటుడు, నిర్మాత జి.వి. నారాయణరావు పార్థివ దేహానికి నివాళులు అర్పించిన మెగాస్టార్ చిరంజీవి

హైదరాబాద్ పెన్ పవర్:
ప్రముఖ నటుడు, నిర్మాత జి.వి. నారాయణరావు పార్థివ దేహానికి మెగాస్టార్ చిరంజీవి నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో జరిగిన అంత్యక్రియలకు హాజరైన చిరంజీవి , నారాయణరావు తోతనకున్న అనుబంధాన్ని, ఆత్మీయ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. ఫిలిం ఇన్స్టిట్యూట్ రోజుల నుంచి మా ఇద్దరి పరిచయం. తను అప్పటికే ఇన్స్టిట్యూట్లో సీనియర్. మేము ట్రైనింగ్ అవుతున్నప్పుడు తను వచ్చి తన
అనుభవాలను పంచుకునేవారు. అలా మాకు దగ్గరయ్యారు. ఇండస్ట్రీలో ఎవరికి వాళ్లం ఎదిగినప్పుడు, నాకు ఒక స్టార్ ఇమేజ్ వచ్చినప్పుడు "నేను నిర్మాతగా నిలబడాలనుకుంటున్నాను. నువ్వుసినిమాలు చేయాలని" అడిగారు. అలా ఆయన నిర్మాణంలో రెండు చిత్రాలు చేయడం జరిగింది. నా సినిమాల్లో తనకు నటుడిగా కూడా అవకాశాలు వచ్చేలా చేయడం జరిగింది. అలా మా అనుబంధంకొనసాగుతూ వచ్చింది. యాదృచ్ఛికంగా ఒక పది రోజుల క్రితం "నేను ఒక సినిమా చేశాను. మంచు పల్లకి ఇన్స్పిరేషన్తో ఐదుగురు కుర్రవాళ్లు.. పెద్దవాళ్లు అయితే ఎలా ఉంటారో అనే కథతో ఒక సినిమాచేశాను. ట్రైలర్ లాంచ్ చేయాలి. మీ సహకారం ఉంటే అందరికీ బాగుంటుంది" అని అన్నారు. కచ్చితంగా చేస్తానని చెప్పాను. ఆ క్షణంలో ఇద్దరం కలిసి ఒక ఫోటో దిగుదాం రమ్మని అడిగారు. బహుశాతన ఆఖరి చిత్రం అదేనేమో. ఆ సమయంలో చాలా సేపు మాట్లాడుకున్నాము. ఆరోగ్యం గురించి జాగ్రత్త తీసుకోవాలని చెప్పాను. ఆ క్షణంలో తనకి ఆల్ ది బెస్ట్ చెప్పాను. కానీ అదే మాట శాశ్వతంగా గుడ్బైఅవుతుందని అనుకోలేదు. ఎక్కడున్నా సరే నారాయణరావు ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులు కూడా నా కుటుంబ సభ్యులే.. వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

రక్షా బంధన్ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ కి రాఖీలు కట్టిన మహిళా సోదరీమణులు

హైదరాబాద్ పెన్ పవర్: రక్షా బంధన్ పర్వదినం సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన మహిళా సోదరీమణులు ఎమ్మెల్యే శ్రీగణేష్ గారిని వారి నివాసంలో కలిసి రాఖీలు కట్టి ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలిపారు.
ఈసందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ రక్షా బంధన్ అన్నాచెల్లెళ్ల ఆత్మీయ, అనుబంధానికి ప్రతీక అని అన్నారు. మహిళా సోదరీమణులు చూపించిన ప్రేమాభిమానాలు తనకు ఎంతో సంతోషాన్ని
కలిగించాయని తెలిపారు.
మహిళల భద్రత, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. మహిళలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు
కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
రాఖీలు కట్టిన మహిళా సోదరీమణులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరికీ రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

మాట్లాడితే వివాదం.. మౌనం పాటిస్తే వ్యూహం.

వరంగల్, ఆగస్టు 28, పెన్ పవర్: :తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ, సొంత శాఖలోనూ తీవ్రమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న మంత్రి కొండా సురేఖ ప్రస్తుతం పూర్తిస్థాయి మౌనం పాటిస్తున్నారు. బెంగళూరు వెళ్లి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు తన వైఖరిని, ఎదురవుతున్న పరిణామాలను పూసగుచ్చినట్లు వివరించి వచ్చిన తర్వాత ఆమె వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపించింది. ఇకపై మీడియాతో మాట్లాడేది లేదని తెగేసి చెప్పడం, క్రమశిక్షణా కమిటీ అధిష్టానానికి నివేదిక సమర్పించిన తర్వాత కూడా ఎటువంటి బహిరంగ వ్యాఖ్యలు చేయకపోవడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహమే దాగి ఉందనే చర్చ గాంధీ భవన్ వర్గాల్లో నడుస్తోంది.తన శాఖలోని అధికారులను తనకు తెలీకుండానే మాతృశాఖలకు పంపడం, ఓఎస్డీ సెటిల్మెంట్ల వ్యవహారంలో చట్టపరమైన విచారణలు వేగవంతం కావడం వంటి అంశాలపై సురేఖ తన అసంతృప్తిని ఇప్పటికే హైకమాండ్ ముందు ఉంచారు. అధిష్టానానికి పరిస్థితిని వివరించిన తర్వాత, తన బాధ్యత ముగిసిందన్నట్లుగా ఓ రోజు సెక్రటేరియట్‌లో విధులు నిర్వహించిన ఆమె.. ఇప్పుడు వెయిట్ అండ్ సీ ధోరణిని అవలంబిస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోంది? తనను కేబినెట్ నుంచి తప్పిస్తుందా లేక నష్ట నివారణ చర్యలు చేపడుతుందా అనే అంశం ఆధారంగానే సురేఖ దంపతులు తమ తదుపరి అడుగులు వేయనున్నారు. కొండా సురేఖ ప్రస్తుత సైలెన్స్ కేవలం నిశ్శబ్దం కాదు, అధిష్టానం నిర్ణయం ఆధారంగా రాజకీయ దారి మార్చుకోవడానికి వేస్తున్న ముందస్తు ప్రణాళికగా అనుకోవచ్చు. ఒకవేళ అధిష్టానం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలకే మొగ్గు చూపి, ఆమెతో బలవంతంగా మంత్రి పదవికి రాజీనామా చేయిస్తే పరిస్థితి ఏంటి అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గత చరిత్రను పరిశీలిస్తే కొండా సురేఖ దంపతులు ఏ పార్టీలో ఉన్నా తమ స్వయంప్రతిపత్తిని, ఆత్మగౌరవాన్ని వదులుకునేందుకు సిద్ధపడలేదు. కేవలం మంత్రి పదవి ఊడిపోవడమే కాకుండా పార్టీలో ప్రాధాన్యత తగ్గితే.. ఆమె కేవలం కాంగ్రెస్‌లోనే ఉండిపోతారా లేక ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసి తమ సొంత నియోజకవర్గం వరంగల్ తూర్పులో సవాలు విసురుతారా అనేది కీలక ప్రశ్న.మంత్రి పదవిని కోల్పోతే ఎమ్మెల్యే పదవికి సైతం రాజీనామా చేసి బై-ఎలక్షన్ కు వెళ్లే సాహసం కొండా మురళి, సురేఖ దంపతులు చేయవచ్చనే టాక్ వరంగల్ రాజకీయాల్లో గట్టిగా వినిపిస్తోంది. తమకున్న బలమైన బిసి కేడర్, వ్యక్తిగత ఇమేజ్‌ను నమ్ముకుని ఉపఎన్నికకు వెళ్లడం ద్వారా సీఎం రేవంత్ రెడ్డికి , కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి రాజకీయ సవాలు విసిరే అవకాశం ఉంది. ఒకవేళ కాంగ్రెస్ తమపై కఠిన చర్యలు తీసుకుంటే, బిసి సెంటిమెంట్‌ను క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లేందుకు ఈ ఉపఎన్నిక మార్గాన్ని ఎంచుకోవచ్చు. తెలంగాణలో బలపడేందుకు చూస్తున్న భారతీయ జనతా పార్టీ.. ఉత్తర తెలంగాణలో, ముఖ్యంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో సామాజిక సమీకరణాల దృష్ట్యా బలమైన బిసి నాయకత్వం కోసం వెతుకుతోంది. కొండా సురేఖ దంపతులకు బీజేపీ నుంచి ఆఫర్లు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఒకవేళ కాంగ్రెస్ నుంచి వైదొలిగితే బిజెపి తీర్థం పుచ్చుకుని, ఆ పార్టీ అభ్యర్థిగా సార్వత్రిక లేదా ఉపఎన్నికల బరిలోకి దిగడం సురేఖ దంపతులకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుంది. కొండా సురేఖ మౌనం అనేది తుఫానుకు ముందు ఉండే నిశ్శబ్దం లాంటిది. అధిష్టానం ఇచ్చే ఫైనల్ రిపోర్టు లేదా తీసుకునే నిర్ణయమే తెలంగాణ కాంగ్రెస్‌లో మరో రాజకీయ ఆధిపత్య రగడకు దారితీస్తుందా లేదా అనేది తేల్చనుంది. కొండా దంపతుల తదుపరి అడుగు కాంగ్రెస్ పార్టీకి వరంగల్ రీజియన్‌లో మునుపటి కంటే పెద్ద సవాలుగా మారే ప్రమాదం ఉందని అనుకోవచ్చు.

రోడెక్కిన పాలిటెక్నిక్ విద్యార్థులు

హైదరాబాద్, ఆగస్టు 28, పెన్ పవర్: : తెలంగాణలోని పాలిటెక్నిక్ కాలేజీలను కొత్తగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీకి సంబంధించిన శక్తి శాఖ పరిధిలోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97 పై రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి లోకం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది. పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు తరగతులను బహిష్కరించి వీధుల్లోకి వస్తున్నారు. ఈ ప్రతిపాదిత విలీనం వల్ల దశాబ్దాలుగా నడుస్తున్న సాంకేతిక విద్యా వ్యవస్థ దెబ్బతింటుందని, డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు లభించే ప్రయోజనాలు తుడిచిపెట్టుకుపోతాయని విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.విలీన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న విద్యార్థుల ప్రధాన డిమాండ్ జీవో 97ను తక్షణమే రద్దు చేయడమే. పాలిటెక్నిక్ కోర్సులను స్కిల్ యూనివర్సిటీ కిందకు తీసుకువస్తే, ఈసీఈటీ ద్వారా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో నేరుగా చేరే లేటరల్ ఎంట్రీ' అవకాశాన్ని కోల్పోతామని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కేవలం వృత్తి నైపుణ్య శిక్షణకే పరిమితం చేస్తే తమ ఉన్నత విద్య కలలు కల్లలవుతాయని, పాలిటెక్నిక్ విద్యా మండలి స్వయంప్రతిపత్తితో పాటు ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలు కూడా ప్రమాదంలో పడతాయని నిరసనకారులు వాపోతున్నారు.ఈ విద్యార్థుల ఆందోళనలకు ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బిజెపిలు పూర్తి స్థాయిలో మద్దతుగా నిలిచాయి. బీఆర్ఎస్వీ , విద్యార్థి పరిషత్ నాయకులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తూ పోరాటాన్ని హోరాహోరీగా మార్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో బంతిలా ఆడుకుంటోందని, కార్పొరేట్ రంగానికి లబ్ధి చేకూర్చేందుకే పాలిటెక్నిక్ వ్యవస్థను ఉనికి లేకుండా చేస్తున్నారని బిఆర్ఎస్, బిజెపి అగ్రనేతలు మండిపడుతున్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు నిరసనగా పలు చోట్ల మంత్రుల కాన్వాయ్‌లను కూడా అడ్డుకుంటూ విపక్షాలు నిరసన సెగ పెంచుతున్నాయి.మరోవైపు ఈ వివాదంపై ప్రభుత్వం స్పందిస్తూ విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు పెంచడానికే ఈ సమగ్ర మార్పులు చేస్తున్నామని, పాలిటెక్నిక్ విద్యార్థులకు బి.టెక్ లో చేరే లేటరల్ ఎంట్రీ విధానం యథాతథంగా కొనసాగుతుందని కార్మిక , శిక్షణ శాఖ మంత్రి హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వ ప్రకటనలను నమ్మని విద్యార్థులు, ప్రతిపక్షాలు జీవో 97 ను పూర్తిగా వెనక్కి తీసుకునే వరకు తమ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేస్తున్నారు. వారి కోసం బీజేపీ, బీఆర్ఎస్ ఉద్యమాలు ప్రారంభిస్తున్నాయి.

ఫ్యూచర్‌సిటీ రియల్ ఎస్టేట్ జోరు

హైదరాబాద్, ఆగస్టు 28, పెన్ పవర్: భారత్ ఫ్యూచర్‌సిటీలో రియల్ ఎస్టేట్ భూం నడుస్తోంది. ముఖ్యంగా భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం కేటాయించిన 121 చదరపు గజాల ప్లాట్లకు డిమాండ్ పెరుగుతోంది. గతంలో సుమారు రూ.5 లక్షలకు అమ్ముడైన ప్లాట్లు ప్రస్తుతం రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పలుకుతున్నాయి. ఫ్యూచర్‌సిటీ కార్యాలయం ప్రారంభం, పరిసరాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రియల్ ఎస్టేట్ కార్యకలాపాల పెరుగుదలతో ధరలు పెరిగినట్లు తెలుస్తోంది.తెలంగాణ ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. మీర్‌ఖాన్‌పేట-ముచ్చర్ల గ్రామాల మధ్యలో దాదాపు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణమవుతోంది. దీంతో ఆ ఏరియాలో భూముల ధరలకు రెక్కలు వస్తున్నాయి. ప్రస్తుతం ఫ్యూచర్‌సిటీలో భూ నిర్వాసితుల కోసం ప్రభుత్వం కేటాయించిన లే-అవుట్లు, స్థలాలకు గిరాకీ పెరుగుతోంది. ఫ్యూచర్ సిటీకి భూమిలిచ్చిన 6 వేల మంది రైతులకు ప్రభుత్వం అభివృద్ధి చేసిన లేఅవుట్లను కేటాయించింది. నిర్వాసితులకు ఎకరాకు రూ.8 లక్షల పరిహారంతో పాటు 121 చదరపు గజాల ఓపెన్ ప్లాట్లు ఇచ్చింది.మీర్‌ఖాన్‌పేట్, పంజాగూడ, కుర్మిద్ద, తాటిపర్తి, మేడిపల్లి, నానక్‌నగర్, ముచ్చర్ల గ్రామాల్లో నివసిస్తున్న రైతుల నుంచి భారత్ ఫ్యూచర్‌సిటీ కోసం ప్రభుత్వం రెండు దశల్లో భూములను తీసుకుంది. ఆయా గ్రామాల ప్రజలకు పంజాగూడ రెవెన్యూ పరిధిలో లేఅవుట్లు డెవలప్ చేసింది. దాదాపు 6 వేల మంది రైతులకు ఓపెన్ ప్లాట్లు కేటాయించింది. రైతుల పిల్లలు చదువుకునేందుకు వీలుగా యంగ్ ఇండియా సమీకృత గురుకుల స్కూల్ సైతం ప్రభుత్వం నిర్మిస్తోంది. అయితే అక్కడి లే-అవుట్‌లో ఇళ్లు కట్టుకునేందుకు కొందరు సుముఖంగా లేరు. ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం, ప్లాట్ అమ్మితే వచ్చే డబ్బుతో హైదరాబాద్ దగ్గర్లో భూములు కొనాలని నిర్ణయించారు. ఒకరిద్దరు రైతులు ఏడాది క్రితం విక్రయించగా.. 121 చదరపు గజాల ప్లాటు రూ.5 లక్షలకు అమ్ముడయ్యింది.తాజాగా రియల్ ఎస్టేట్ పుంజుకుంది. ఫ్యూచర్‌సిటీ కార్యాలయం రెండు నెలల క్రితం ప్రారంభమవగానే.. ప్లాట్ల ధరలు అమాంతం పెరిగాయి. ఫ్యూచర్‌సిటీ పరిసర ప్రాంతాల్లో నిన్న మొన్నటి వరకు చదరపు గజం రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకూ ధర పలకగా.. నిర్వాసితులకు ఇచ్చిన ప్లాట్ల ధర అనూహ్యంగా పెరిగింది. రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ ఒక్కో ప్లాటు అమ్ముడవుతోంది. అంటే దాదాపు 10 వేల నుంచి రూ.23 వేల వరకు గజం పలుకుతోంది. జులైలో ఒక రైతు తన ప్లాటును రూ.28 లక్షలకు విక్రయించారు. ఆ ప్లాట్లను కొంటే భవిష్యత్తులో మౌలిక సదుపాయాలు వేగంగా సమకూరుతాయన్న అంచనాతో కొందరు వాటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భూములు కొనే ఆర్థిక స్థోమత లేని వారు భవిష్యత్ పెట్టుబడిగా ఫ్యూచర్ సిటీలో స్థలాలు కొనేందుకు రెడీ అవుతున్నారు

రక్షాబంధన్ వేడుకల్లో పాల్గోన్నబండారు దత్తాత్రేయ

హైదరాబాద్ పెన్ పవర్: మహిళా నాయకులు, కార్యకర్తలు, బ్రహ్మకుమారీలు, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులతో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ రక్షాబంధన్ వేడుకల్లో పాల్గోన్నారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ రక్షాబంధన్ పండుగ సోదర-- సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర రక్షణకు ప్రతీక అన్నారు. మహిళా నాయకులు, కార్యకర్తలు, బ్రహ్మకుమారీలు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి రక్షాబంధన్ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని, ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, శాంతి, ఆరోగ్యం నెలకొనాలని అయన ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హైదరాబాద్ నగర్ మాజీ మేయర్ బండారు కార్తిక రెడ్డి, బిజెపి మహిళా మోర్చా సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు కేతినేని సరళ, మాజీ కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్, బిజెపి జాతీయ నాయకురాలు అరుణ జ్యోతి, మంత్రి కళావతి మాజీ కార్పొరేటర్, భైరి అమరావతి, శోభా, మాధవి, జ్యోతి మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు, బ్రహ్మకుమారీలు, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొనడం జరిగింది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

బీజేపీవైపు మూడ్ ఆఫ్ ది నేషన్...

హైదరాబాద్, ఆగస్టు 28, పెన్ పవర్:
వాస్తవానికి ఇప్పట్లో కేంద్రస్థాయిలో ఎన్నికలు జరిగే అవకాశం లేదు. ఎందుకంటే సంకీర్ణ ప్రభుత్వం అయినప్పటికీ.. భాగస్వామ్య పార్టీలతో ఎటువంటి లుకలుకలు లేకుండా చూసుకుంటున్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. టిడిపి తో.. అటు నితీష్ కుమార్ పార్టీతో.. ఏకకాలంలో ఉభయ కుశలోపరి అనే పాత్రను నరేంద్ర మోడీ పోషిస్తున్నారు.ఇటీవల కాలంలో నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ పురుడు పోసుకుంది. ఏకంగా జంతర్ మంతర్ వద్ద ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఇవి కాస్త సంచలనంగా మారాయి. ఒకరకంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చింది. అంతేకాదు జెన్ జెడ్ ను సంతృప్తి పరచడానికి నరేంద్ర మోడీ ఏకంగా ఇన్ స్టా గ్రామ్ లో వీడియోలు చేయాల్సి వస్తోంది. ఈ పరిణామాలు కేంద్రంలో బిజెపి స్థాయిని తగ్గిస్తున్నాయా.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందా. కాక్రోచ్ జనతా పార్టీ సంచలనం సృష్టిస్తుందా.. ఇలా అనేక అంశాల ఆధారంగా మూడ్ ఆఫ్ దినేషన్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ఆసక్తికరమైన ఫలితాలు వెల్లడయ్యాయి.ఇప్పటికిప్పుడు దేశవ్యాప్తంగా ఎన్నికల జరిగితే బిజెపి మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశం ఉంది. ఎన్డీఏ కూటమి ఏకంగా 326 సీట్లతో అధికారంలోకి వస్తుందని తెలుస్తోంది. మరోవైపు ఇండియా కూటమికి 185 సీట్లు లభిస్తాయని సమాచారం. ధరల స్థాయి పెరగడం.. నిరుద్యోగం.. ఇంకా అనేక సమస్యలు దేశంలో ఉన్నాయి. అయినప్పటికీ జెన్ జెడ్.. మిగతా వర్గాలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నాయి. ఆయన ఆధ్వర్యంలోనే దేశం బలోపేతం

అవుతుందని భావిస్తున్నాయి.ఈ సర్వేలో అనేక ప్రశ్నలను సంధించారు. ప్రధానంగా పరీక్షల నిర్వహణకు సంబంధించి 67 శాతం మంది అసంతృప్తిని వ్యక్తం చేశారు. వ్యవస్థ మీద నమ్మకం లేదని కుండబద్దలు కొట్టారు. మిగతా 14 శాతం మంది పరీక్షలు నిష్పక్షపాతంగా జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని 17 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఎన్నికలలో రిగ్గింగ్.. అవినీతిని అరికట్టే విషయంలో కేంద్రం విఫలమవుతుందని మెజారిటీ యువత అభిప్రాయపడ్డారు. గతంలో ఈ సంఖ్య కొంత మాత్రమే ఉండగా.. ఇప్పుడు చాలామంది యువత జవాబుదారితనాన్ని కోరుకుంటుండడం విశేషం. మరోవైపు ఇటీవల నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం మీద ఆందోళనలు నిర్వహించిన కాక్రోచ్ జనతా పార్టీకి ఓటు వేస్తారని ప్రశ్నిస్తే.. చాలామంది వేయబోమని చెప్పారు. అది కేవలం ప్రశ్నించే గొంతు లాగా మాత్రమే ఉండాలని స్పష్టం చేశా

కమలం పార్టీకి పొలిటికల్ స్పేస్

హైదరాబాద్, ఆగస్టు 28, పెన్ పవర్:
తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం విచిత్రమైన వాతావరణం నెలకొంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోసం కాంగ్రెస్‌కు అధికారమిచ్చారు. అయితే, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో ఎదుర్కొంటున్న సవాళ్లు, అంతర్గత విభేదాలు, పరిపాలనాపరమైన ఇబ్బందులతో ప్రజల్లో కొంత అసంతృప్తి మొదలవుతోంది. ఇటు బిఆర్ఎస్ ప్రాభవం కోల్పోతుండటం, అటు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుండటంతో.. కమలం పార్టీకి స్పష్టమైన పొలిటికల్ స్పేస్ లభించింది. కానీ, ఈ సువర్ణ అవకాశాన్ని ఓటు బ్యాంకుగా మార్చుకోవడంలో తెలంగాణ బీజేపీ తీవ్రంగా తడబడుతోంది .మీరు కేసీఆర్ పదేళ్ల పాలన చూశారు, కాంగ్రెస్ మార్పు పాలననూ చూస్తున్నారు.. ఒక్కసారి కమలానికి అవకాశం ఇవ్వండి అనే బలమైన నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బీజేపీ విఫలమవుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో 8 ఎంపీ స్థానాలు గెలుచుకుని సత్తా చాటినప్పటికీ, ఆ ఉత్సాహాన్ని రాష్ట్ర స్థాయి అధికారం దిశగా మళ్లించే సమిష్టి వ్యూహం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. కేవలం ఢిల్లీ పెద్దల ఇమేజ్, మోదీ చరిష్మాపైనే ఆధారపడటం తప్ప.. స్థానిక నాయకత్వం ప్రజల్లో బలమైన విశ్వాసాన్ని నింపలేకపోతోంది. కేవలం ప్రత్యర్థి పార్టీల వైఫల్యాలను ఎత్తిచూపడం మాత్రమే సరిపోదు. తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామనే ప్రణాళికను దాన్ని నడిపించే ఒక ఫేస్ ను చూపిస్తేనే ప్రజలు జాతీయ పార్టీలకు ప్రాంతీయ స్థాయిలో ఓటేస్తారని రాజకీయవర్గాలు చెబుతున్నాయి.

తెలంగాణ బీజేపీకి ఉన్న ప్రధాన లోపం.. స్పష్టమైన సీఎం ఫేస్ లేదా తిరుగులేని ఒకరిద్దరు బలమైన నాయకులు లేకపోవడం . గతంలో బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అగ్రెసివ్ హిందూత్వ, నిరసనలతో కేడర్‌లో పీక్ లెవెల్ జోష్ ఉండేది. ఆ తర్వాత జి. కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్ వంటి అగ్రనేతలు ఉన్నప్పటికీ.. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా గ్రూపు రాజకీయాలు సాగుతున్నాయనే భావన ప్రజల్లోకి వెళ్తోంది. నాయకుల మధ్య సమన్వయ లోపం వల్ల అధికార కాంగ్రెస్‌పై లేదా ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై ఒక్కటిగా దాడి చేయలేకపోతున్నారు.పశ్చిమ బెంగాల్‌లోని దీదీ కోటను బద్దలు కొట్టడానికి బీజేపీ ఎలాగైతే అగ్రెసివ్ కేడర్ పాలిటిక్స్ చేసిందో, తెలంగాణలోనూ అలాంటి బెంగాల్ తరహా పోరాట వ్యూహం అవసరమనేది పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయం. అక్కడ కమలం పార్టీ ప్రతీ పంచాయతీ, ప్రతీ వార్డు స్థాయి వరకు వెళ్లి కేడర్‌ను నిర్మించి, అధికార పార్టీ దాష్టీకాలను ధైర్యంగా ఎదుర్కొంది.

తెలంగాణలో ప్రెస్ మీట్లు, కరపత్రాల పంపిణీ, ఢిల్లీ పర్యటనలకే పరిమితమవుతున్నారు తప్ప.. ప్రజల తరఫున సుదీర్ఘకాలం పాటు రోడ్డెక్కి పోరాడే పాదయాత్రలు, ధర్నాలు కరువయ్యాయి. బీజేపీ పై సామాన్య ప్రజల్లో ఉన్న మరో అనుమానం.. బీఆర్ఎస్ - బీజేపీ ఒకటేనా? అనే పాత ప్రచారం. ఈ నెగెటివ్ ఇంప్రెషన్‌ను పూర్తిస్థాయిలో తుడిచిపెట్టేలా బీజేపీ గ్రౌండ్ లెవెల్‌లో నమ్మకాన్ని కలిగించలేకపోయింది.తెలంగాణలో బీజేపీకి అధికారం దక్కాలంటే తక్షణమే కొన్ని విప్లవాత్మక మార్పులు అవసరం. పార్టీలోని గ్రూపు తత్వాలకు స్వస్తి చెప్పి, ఒక సమర్థవంతమైన, మాస్ ఇమేజ్ ఉన్న నాయకుడిని ముందు పెట్టి నడిపించాలి. ప్రజల నిత్య జీవిత సమస్యలైన రుణమాఫీ, ఉపాధి, రైతు భరోసా, మౌలిక వసతులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ నిరంతరం ప్రజల్లో ఉండేలా కార్యాచరణ రూపొందించుకోవాలి. ఈ అవకాశాన్ని వదులుకుంటే మళ్లీ కోలుకోవడం తెలంగాణ బీజేపీకి సాధ్యం కాకపోవచ్చు=

బొగ్గు నుంచి 'క్రిటికల్ మినరల్స్' దిశగా...

మంచిర్యాల, ఆగస్టు 28, పెన్ పవర్:
బొగ్గే బంగారం అన్నది సింగరేణి నినాదం... విధానం. ఇప్పుడు బొగ్గును బంగారంగా చూడటం కాదు.. నిజమైన బంగార గనుల తవ్వకాన్ని చేపట్టబోతోంది. తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి కాలరీస్ తమ అధీనంలో ఉన్న దేవదుర్గ గోల్డ్ కాపర్ బ్లాక్‌లో బంగారు తవ్వకాలు చేపట్టనుంది. ఇకపై బొగ్గుకే పరిమితం కాకుండా బంగారం, రాగి వంటి కీలక ఖనిజాల అన్వేషణనూ చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.తెలంగాణ డిప్యూటీ, మైనింగ్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్వయంగా ఇవాళ దేవదుర్గ గోల్డ్ బ్లాక్‌ను సందర్శించనున్నారు. సింగేణి ప్రాజెక్టు పురోగతిపై బుధవారం సమీక్ష నిర్వహించిన భట్టి గోల్డ్ మైనింగ్ పై ఫోకస్ పెట్టారు. అందుకే ఆయన దేవదుర్గ ప్రాంతాన్ని స్వయంగా సందర్శించి అక్కడ పరిస్థితులను పరిశీలించబోతున్నారు. దేవదుర్గ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు, ఇతర సహకారాల కోసం కర్ణాటక ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని భట్టి అధికారులకు సూచించారు.సింగరేణికి బొగ్గు గనుల నిర్వహణలో దశాబ్దాల అనుభవం ఉంది. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్థ తన కార్యకలాపాలను విస్తరించడంపై ఇప్పుడు దృష్టి పెట్టింది. ప్రస్తుతం కర్ణాటకలో తమ అధీనంలో దేవదుర్గ బ్లాక్‌లో రాగి బంగారు అన్వేషణ మాత్రమే కాకుండా.. గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల అన్వేషణలోనూ అవకాశాలను వెతకాలని సింగరేణి నిర్ణయించింది. రాబోయే రోజుల్లో విద్యుత్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్, రిన్యూవబుల్ ఎనర్జీ రంగాల్లో క్రిటికల్ మినరల్స్‌కు ప్రాధాన్యం ఉండబోతోంది. ఇప్పటి వరకూ బొగ్గుగే పరిమితం అయిన సింగరేణి కొత్తరంగాలకు విస్తరించగలిగితే.. సంస్థకు కొత్త ఆదాయ మార్గాలు కూడా ఓపెన్ అవుతాయి. కర్ణాటకలోని దేవదుర్గ ప్రాంతంలో బంగారం, రాగి నిక్షేపాల అన్వేషణకు సింగరేణి ఇప్పటికే అడుగు పెట్టింది. 2025లో కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో రాజజూ ఈ బ్లాక్‌కు ూా-1 బిడ్డర్‌గా నిలిచింది. ఈ ప్రాజెక్టును సింగరేణి ఎక్స్‌ప్లోరేషన్ విభాగం పర్యవేక్షణలో ముందుకు తీసుకెళ్లనుంది. ఈ గనిలో తవ్వకాలు ఎంత వరకూ లాభదాయకం, అక్కడ నిక్షేపాల పరిమాణం, నాణ్యత, జియోగ్రాఫికల్ పరిస్థితులు వంటి అంశాలపై ముందుగా అధ్యయనం చేస్తారు. ఒకప్పుడు 'బ్లాక్ గోల్డ్'గా పిలిచే బొగ్గుతో గుర్తింపు పొందిన సింగరేణి... ఇప్పుడు నిజమైన 'గోల్డ్'నే వెలికితీయబోతోంది. ఇది కనుక సక్సెస్ అయితే తెలంగాణ పాలిట ఇదొక గోల్డ్‌మైనే..! దేవదుర్గలో భట్టి విక్రమార్క పర్యటనతో ఈ ప్రాజెక్టుపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అసలు అక్కడ ఎంత బంగారం ఉంది? ఎంత రాగి ఉంది? అన్వేషణ తర్వాత వాణిజ్యపరంగా తవ్వకాలు సాధ్యమవుతాయా? --- ఈ ప్రశ్నలకు రాబోయే అధ్యయనాలే సమాధానం చెప్పనున్నాయి

స్థానికంపై జనసేన వ్యూహమేంటి? 28 జడ్పీల్లో సేన వాటా ఎంత?

విశాఖపట్టణం, ఆగస్టు 28, పెన్ పవర్:రాష్ట్రంలో స్థానిక ఎన్నికల వాతావరణం క్రమంగా అలుముకుంటోంది. అన్నిపార్టీలు ఎన్నికల సన్నాహాక సమావేశాలతో శ్రేణులను సిద్ధం చేస్తున్నారు. అయితే అధికార కూటమిలోని జనసేన వైఖరి ఎలా ఉంటుందనేదే ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీ ఎన్నిస్థానాల్లో పోటీ చేస్తుందనేది ప్రధాన చర్చనీయాంశంగా మారిందని చెబుతున్నారు. తమకు బలం ఉన్న చోట పోటీకి రెడీ అంటూ జనసేన నేతలు సంకేతాలు ఇవ్వడం కూటమి రాజకీయాలను వేడెక్కిస్తోంది. మరోవైపు టీడీపీ కూడా పోటీకి సై అంటుండటంతో స్థానిక ఎన్నికలు హీట్ పుట్టిస్తున్నాయని అంటున్నారు. స్థానిక ఎన్నికల్లో జనసేన ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనే అంశమే ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. గతంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంటు, మంత్రి నారా లోకేశ్ ప్రతిపాదించిన 80:15:5 నిష్పత్రి తమకు అంగీకారం కాదని జనసేన తేల్చిచెప్పడం, ఆ తర్వాత ఏ ప్రాతిపదికన పోటీ చేస్తారనే అంశమై స్పష్టత ఇవ్వకపోవడంతో స్థానిక ఎన్నికల్లో జనసేన పోటీపై కార్యకర్తలే అయోమయ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఇదే సమయంలో కొన్నిచోట్ల కూటమి సర్దుబాట్లపై అవగాహన రాకుండానే పదవుల కోసం జనసేనలో అంతర్గత రాజకీయాలు ఊపందుకోవడం చర్చకు తావిస్తోందని అంటున్నారు.రాష్ట్రంలో 123 మున్సిపాలిటీలు ఉండగా, జనసేన ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనేది అంతుచిక్కని అంశంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. అదేవిధంగా 28 జిల్లా పరిషత్తులలో ఎన్నిస్థానాలను జనసేన తీసుకుంటుంది అనేది ఆసక్తి రేపుతోందని అంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి కోసం తాము కాస్త తగ్గామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెబుతున్నారు. అంటే స్థానిక ఎన్నికల్లో తాము తగ్గే పరిస్థితి లేదని ఆయన పరోక్షంగా చెబుతున్నారా? అని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. జనసేనాని పవన్ వ్యాఖ్యలు, జనసైనికుల అభిప్రాయాలను పరిశీలిస్తే స్థానిక ఎన్నికల్లో కూటమిలో టీడీపీతో సమానంగా పోటీకి సై అంటున్నట్లు కనిపిస్తోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. మరికొందరు మాత్రం తమకు 40 శాతం సీట్లు ఇవ్వాలని జనసేన కోరుకుంటోందని అంటున్నారు. ఈ ప్రచారమే నిజమైతే జనసేన రాష్ట్రంలో 50కి పైగా మున్సిపాలిటీలు, 10 నుంచి 14 జిల్లా పరిషత్తు స్థానాలను కోరుకుంటున్నట్లేనని వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఈ స్థాయిలో జనసేనకు కేటాయించేందుకు టీడీపీ సమ్మతిస్తుందా? అన్నదే చూడాల్సివుందని అంటున్నారు. మరోవైపు స్థానిక ఎన్నికల్లో బలం ఉన్న అన్నిస్థానాల్లో పోటీ చేస్తామని జనసేన ప్రకటించడాన్ని టీడీపీ సీనియర్లు తప్పుపడుతున్నారని ప్రచారం జరుగుతోంది. పొత్తులో ఉన్నప్పుడు ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ఇలాంటి మాటలు ఆడటం సరికాదని వ్యాఖ్యానిస్తున్నారు. పొత్తులపై మూడు పార్టీల సమన్వయ సమావేశం ముగిసిన తర్వాతే ఎవరైనా పోటీపై ప్రకటన చేయాలని అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో పోటీపై జనసేన వ్యూహం ఎలా ఉంటుందనేది ఆసక్తి రేపుతోందని చెబుతున్నారు.

నాగబాబు ఆన్ డ్యూటీ.. ఏపీ గ్రీన్ చైర్మన్ గా బాధ్యతల స్వీకరణ

విశాఖపట్టణం, ఆగస్టు 28, పెన్ పవర్:జనసేన ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ నిమిత్తం ఏర్పాటు చేసిన ఈ కమిటీ చైర్మనుగా కేబినెట్ హోదాలో నాగబాబు సేవలు అందించనున్నారు. ఏపీ గ్రీన్ చైర్మన్ గా నాగబాబును నియమిస్తూ దాదాపు 20 రోజుల క్రితమే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే మంచి ముహూర్తం కోసం ఇన్నాళ్లు ఎదురుచూసిన నాగబాబు శ్రావణ శుక్రవారం సందర్భంగా పండితుల వేది మంత్రోచ్చారణల మధ్య బాధ్యతలు స్వీకరించారు.

మంగళగిరిలోని అరణ్య భవన్ లో ఏపీ గ్రీన్ చైర్మనుగా నాగబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సమయంలో నాగబాబు పక్కనే ఆయన భార్య పద్మజ ఉన్నారు. పలువురు జనసేన నాయకులు, అటవీశాఖ అధికారుల సమక్షంలో నాగబాబు బాధ్యతల స్వీకరణ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అటవీ, వృక్ష సంపదను విస్తరించి 2047 నాటికి మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా పని చేస్తానని నాగబాబు తెలిపారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజలందరూ భాగస్వామ్యమయ్యే మహోద్యమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

50 శాతం పచ్చదనం పెంచుతా..

ప్రస్తుతం రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం 22.96 శాతంగా ఉందని, 2047 నాటికి పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే మా ప్రధాన లక్ష్యమని నాగబాబు స్పష్టం చేశ్శ. ఇది కేవలం గణాంకాల కోసం పెట్టుకున్న లక్ష్యం కాదని, భావి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణం, మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమమని ఆయన అభివర్ణించారు. వాతావరణ మార్పులు

ప్రపంచానికి సవాలుగా మారుతున్న ఈ సమయంలో పర్యావరణ పరిరక్షణ అనేది మనందరి బాధ్యతగా నాగబాబు వ్యాఖ్యానించారు. కాగా, ఏపీ గ్రీన్ కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా మాత్రమే కాకుండా ప్రతి పౌరుడిని భాగస్వాములను చేసేలా పనిచేస్తామన్నారు.

నాగబాబు కాదు నాగేంద్రరరావు

ఏపీ గ్రీన్ చైర్మనుగా నాగబాబు ప్రమాణస్వీకారం చేసిన సమయంలో ఆయన టేబుల్ పై ఏర్పాటు చేసిన నేమ్ బోర్డు చర్చకు తావిచ్చింది. సినీ రంగంలో నాగబాబుగా అందరికీ తెలిసిన నాగబాబు అసలు పేరు నాగేంద్రరావు అన్న విషయం శుక్రవారమే స్పష్టమైంది. ఎమ్మెల్సీగా నాగబాబు ఎన్నికైన అప్పటికీ అందరూ ఆయనను నాగబాబు అనే వ్యవహారిక నామంతోనే పిలుస్తున్నారు. కానీ, అధికారికంగా నాగబాబు అసలు పేరు నాగేంద్రరరావు అని సూచిస్తూ నేమ్ బోర్డు ఏర్పాటు చేశారు. "కొణిదెల నాగేంద్రరరావు, చైర్మన్, ఎగ్జిక్యూటివ్ కమిటీ, ఏపీ గ్రీన్ అంటూ బోర్డుపై స్పష్టంగా రాశారు. కాగా, చైర్మనుగా బాధ్యతలు స్వీకరించిన నాగబాబుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ట్విటర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

డీలిమిటేషన్ వార్... బీజేపీ స్టెప్ ఏంటి ?

విశాఖపట్టణం, ఆగస్టు 28, పెన్ పవర్:డీలిమిటేషన్ బిల్లుని ఎలా అయినా ఆమోదించుకోవాలన్నది బీజేపీ ఆలోచన. ఒక విధంగా చెప్పాలీ అంటే పట్టుదల కూడా. బీజేపీ 2014 నుంచి చూస్తే తాను అనుకున్న బిల్లులను పార్లమెంట్ లో నెగ్గించుకుంది. ఆఖరికి కాశ్మీర్ ని రెండు ముక్కలు చేసి అసాధ్యం అనుకున్న 370 ఆర్టికల్ ని కూడా రద్దు చేసింది. ఇలా చెప్పుకుంటే అనేకం బీజేపీ చేయగలిగింది. కానీ డీలిమిటేషన్ బిల్లు మాత్రం బీజేపీకి మింగుడు పడడం లేదు. ఒకసారి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి మరీ భంగపడింది. దాంతో మరింతగా కసి కమలనాధులలో పెరిగిపోతోంది. మరోసారి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అయినా డీలిమిటేషన్ బిల్లుకి ఆమోదముద్ర వేయించుకోవాలని బీజేపీ చూస్తోంది. సరిగ్గా ఇక్కడే కాంగ్రెస్ మోకాలడ్డుతోంది. ఈ తరహా ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరిస్తోంది.

కేంద్ర మంత్రి వ్యాఖ్యలతో :

ఇదిలా ఉంటే తాజాగా కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రోరోగ్ చేయలేదని గుర్తు చేశారు. అంటే అవసరమైతే మరోసారి పార్లమెంట్ ని పిలిచి సమావేశ పరచే అవకాశాలు ఉన్నాయని కేంద్ర మంత్రి చెబుతున్నారు. ఇదంతా ఎందుకు అంటే డీలిమిటేషన్ బిల్లు కోసమే అని అంటున్నారు. ఈ విధంగా కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలు

అయితే విపక్షాలకు మంట పుట్టిస్తున్నాయి. డీలిమిటేషన్ ఎపిసోడ్ ఏప్రిల్ 16, 17 ప్రత్యేక సమావేశాలలో వీగిపోవడంతోనే అయిపోయిందని కాంగ్రెస్ అంటోంది. మరోసారి అలాంటి ప్రయత్నం చేయవద్దు అని కోరుతోంది. దీని మీద కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ కూడా రాశారు.

ఆ సీట్లు చాలు అంటూ :

ఇక లేటెస్ట్ గా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోడీకి రాసిన లేఖలో పలు డిమాండ్లు పెట్టారు. డీలిమిటేషన్ బిల్లు ఆమోదం ద్వారా లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్న ఆలోచనలు విరమించుకోవాలని కోరారు. అంతే కాదు డీలిమిటేషన్ అంశంపై ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ఈ విషయం మీద కేంద్రం ఏమైనా ఆలోచన చేయాలని అనుకుంటే ముందుగా అన్ని రాజకీయ పార్టీలతో తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఖర్గే కోరారు. అదే సమయంలో ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను మరో 25 ఏళ్లపాటు ఇదే తీరున మార్చకుండా అలాగే కొనసాగించాలని కూడా ఖర్గే డిమాండ్ చేశారు. ఈ 543 లోక్ సభ సీట్లతోనే 2029 లోక్‌సభ ఎన్నికలను నిర్వహిస్తూ వీటి నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని ఖర్గే స్పష్టం చేశారు.

పూర్తిగా రాజకీయ ఆధిపత్యం :

ఇంత క్లియర్ కట్ గా కాంగ్రెస్ నుంచి లేఖ రావడంతో ఇపుడు బీజేపీ ఏమి చేస్తుంది అన్నది అంతా ఆలోచిస్తున్నారు. నిజానికి ప్రతిపక్షం దాని సూచనలు డిమాండ్లు పెడుతోంది కానీ వాటిని పరిగణనలోకి తీసుకోవాలని ఎక్కడా లేదు కదా అంటున్నారు. బీజేపీకి డీలిమిటేషన్ చాలా ముఖ్యమని అంటున్నారు. ఇపుడు ఉన్న సెటప్ లో 2029 ఎన్నికలకు వెళ్ళాలని బీజేపీ అనుకోవడం లేదు, సీట్లను విడగొట్టాలి, అలాగే మహిళా రిజర్వేషన్లు కూడా ఇస్తూ ఇపుడు దేశంలో ఉన్న రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేయాలని బీజేపీ భావిస్తోంది. అలా చేస్తేనే తమకు పూర్తిగా రాజకీయ ఆధిపత్యం ఉండడమే కాకుండా విజయావకాశాలు ఉంటాయని కూడా భావిస్తోంది. మరి కాంగ్రెస్ సహా విపక్ష శిబిరం డీలిమిటేషన్ కి సహకరిస్తుందా అంటే లేదనే చెప్పాలి. ఈ నంబర్ గేం లో గెలిచేది ఎవరూ అన్నదే పెద్ద ప్రశ్నగా ఉంది.

ఫినిషింగ్ దశకు కడప స్టార్టప్ హబ్

కడప, ఆగస్టు 28, పెన్ పవర్: : రాయలసీమ ప్రాంతంలో ఐటీ, సాంకేతిక రంగాల ముఖచిత్రాన్ని మార్చేందుకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కడప స్టార్టప్ హబ్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇప్పటివరకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలకే పరిమితమైన స్టార్టప్ సంస్కృతిని రాయలసీమ యువతకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఇది రూపుదిద్దుకుంది. స్థానిక నిరుద్యోగ యువత ఉన్నత చదువుల అనంతరం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లే అవసరం లేకుండా, ఇక్కడే కొత్త ఆవిష్కరణలు, వ్యాపారాలు ప్రారంభించేందుకు ఇది అద్భుత వేదికగా నిలవనుంది. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో సిద్ధమైన ఈ భవనాన్ని త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించేందుకు కడప జిల్లా యంత్రాంగం వేగంగా సన్నాహాలు చేస్తోంది.ఉద్యోగాల కోసం ఆశించే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి.. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి" అన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టికి అనుగుణంగా జిల్లా పాలనా యంత్రాంగం ఈ ప్రాజెక్టును ఆకృతి చేసింది. స్టార్టప్ కడప పేరుతో పిలిచే ఈ ప్రతిష్టాత్మక హబ్‌ను ౹ా4 మోడల్‌లో రూపొందించారు. ఐఐటీలు, ఐఐఎంల నిపుణులు, గ్లోబల్ టెక్ కంపెనీల అధిపతులతో విద్యార్థులు , ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మెంటార్‌షిప్ ఇచ్చేలా దీనికి శ్రీకారం చుట్టారు.ఈ స్టార్టప్ హబ్ నిర్మాణాన్ని కడప జిల్లా యంత్రాంగం పర్యవేక్షణలో ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో శరవేగంగా పూర్తి చేశారు. మొత్తం రూ. 12 కోట్ల అంచనా వ్యయంతో 30,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో +ం3 ఆకృతిలో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ ప్రాజెక్టు నిధుల కోసం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నీతి ఆయోగ్ రూ. 3 కోట్లు మంజూరు చేయగా, ప్రముఖ మౌలిక వసతుల సంస్థ షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ తమ జూ= నిధుల కింద రూ. 4 కోట్లు ఆర్థిక సహాయం అందించింది. మిగిలిన నిధులను జిల్లా యంత్రాంగం సేకరించి నిర్మాణాన్ని పూర్తి చేసింది.ఈ భవనంలో ఒకేసారి 400 మందికి పైగా పనిచేసుకునేలా ప్లగ్ అండ్ ప్లే వర్కింగ్ స్పేస్ వసతిని కల్పించారు. సరికొత్త బిజినెస్ ఐడియాతో వచ్చే యువతకు హై-స్పీడ్ ఇంటర్నెట్, ప్రొటోటైపింగ్ ల్యాబ్‌లు, లీగల్, ఫైనాన్షియల్ సలహాలతో పాటు ఫండింగ్ సమకూర్చే గ్లోబల్ వెంచర్ క్యాపిటలిస్టులను కూడా ఇక్కడికి అనుసంధానించనున్నారు. కడపను ఐటీ, ఆవిష్కరణల నిలయంగా మార్చే దిశగా ఈ భవన ప్రారంభోత్సవం సరికొత్త మైలురాయిగా నిలవనుందని స్థానిక పారిశ్రామిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.జగన్ ఎప్పుడూ కడపకు ఐటీ గురించి ఆలోచించలేదు.. ఫిష్ మార్టుల గురించి మాత్రమే గొప్పగా చెప్పేవారు. అందుకే కనీసం క్రెడిట్ తీసుకునేందుకు ఒక్క శాతం కూడా చాయిస్ లేకుండా పోయింది.

అప్పుడు ముద్దు... ఇప్పుడు వద్దా...

విజయవాడ ఆగస్టు 28, పెన్ పవర్: : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గర పడింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలు అసలు వద్దు.. ప్రతీ చోటా పోటీకి దిగి తీరాల్సిందే అంటూ ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎక్కడైనా ఏకగ్రీవాలు అయితే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వనని తేల్చేశారు. ఇదే జగన్ గతంలో అధికారంలో ఉన్న సమయంలో జరిగిన స్థానిక పోరులో సరికొత్త రికార్డు స్థాయిలో ఏకగ్రీవాలు నమోదు కావడం, ఇప్పుడు దానికి భిన్నంగా ఆయన వ్యాఖ్యానించడమే దీనికి ప్రధాన కారణం.వైసీపీ పాలనా కాలంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే ఏకగ్రీవాల హవా ఎంతలా సాగిందో అర్థమవుతుంది. ఆనాడు రాష్ట్రంలో మొత్తం 660 జెడ్పీటీసీ స్థానాలకు గాను ఏకంగా 126 స్థానాలు పోటీ లేకుండానే ఏకగ్రీవమయ్యాయి. ఇక ఎంపీటీసీల విషయానికొస్తే మొత్తం 9,696 స్థానాలకు ఎన్నికలు ప్రకటిస్తే, రికార్డు స్థాయిలో 2,371 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. వీటిలో 2,271కి పైగా స్థానాలను అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయే సొంతం చేసుకుంది. 2021 స్థానిక పోరులో పంచాయతీల నుంచి కార్పొరేషన్ల వరకు వేల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. కానీ నేడు ప్రతిపక్షంలోకి రాగానే జగన్ ఏకగ్రీవాలకు స్వస్తి పలికి ఓటింగ్ జరగాల్సిందే అని పట్టుబట్టడం రాజకీయ శైలిలోని వ్యూహాత్మక మార్పును సూచిస్తోంది.గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు నాటి అధికార పార్టీ ఏకగ్రీవాల దిశగా వేగంగా అడుగులు వేసింది. నాలుగు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 13,097 పంచాయతీలకు గాను 2,196 పంచాయతీలు, అలాగే 1,31,325 వార్డులకు గాను 47,400 కంటే ఎక్కువ వార్డు స్థానాలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఇక పట్టణ స్థానిక సంస్థల్లో చూస్తే.. 11 కార్పొరేషన్లు, 75 మున్సిపాలిటీలు మరియు నగర పంచాయతీల్లోని మొత్తం 2,711 వార్డులలో 590 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ముఖ్యంగా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని 50 డివిజన్లలో 37 డివిజన్లు, కడప కార్పొరేషన్ పరిధిలోనూ సింహభాగం ఏకగ్రీవాలు అయ్యాయి.ఇప్పుడు వైఎస్ జగన్ ఏకగ్రీవాలు వద్దు అని చెప్పడం వెనుక ఉన్న అసలు పొలిటికల్ క్రక్స్ స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా స్థానిక ఎన్నికల్లో అధికారంలో ఉన్న పార్టీకే ఏకగ్రీవాలు చేసుకునేందుకు ఎక్కువ అనుకూల పరిస్థితులు ఉంటాయి. అధికార యంత్రాంగం, పోలీసు వ్యవస్థతో పాటు స్థానిక ప్రభావం కూటమి వైపు ఉండే అవకాశం ఉంది కాబట్టి.. ఈ సమయంలో ఏకగ్రీవాలకు మొగ్గు చూపితే ప్రత్యర్థి పార్టీలే మెజారిటీ స్థానాలను పోటీ లేకుండా కైవసం చేసుకుంటాయనే ముందస్తు అంచనా జగన్‌లో ఉంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు క్షేత్రస్థాయి కేడర్‌ను యాక్టివ్‌గా ఉంచడం అత్యంత ముఖ్యం. ఏకగ్రీవాలకు ఒప్పుకుంటే గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు నిరాశకు గురవుతారు. ఓటింగ్ వరకు వెళ్తేనే అధికార కూటమిని నిలదీసే అవకాశం లభించడమే కాకుండా, రాబోయే రోజుల్లో కేడర్‌లో ఉత్సాహం నింపవచ్చని జగన్ భావిస్తున్నారు. అందుకే ఏకగ్రీవాల ప్రక్రియను నిరోధించడం ద్వారా కూటమికి సులువైన విజయం దక్కకుండా అడ్డుకోవాలనేది వైసీపీ వ్యూహం.ఈ నిర్ణయంలో ఒక రాజకీయ వైరుధ్యం కూడా కనిపిస్తోంది. తమ హయాంలో ఏకగ్రీవాలు జరిగినప్పుడు వాటిని సంక్షేమ పాలనకు ప్రజలు ఇచ్చిన మద్దతు అని సమర్థించుకున్న వైసీపీ నేతలు.. ఇప్పుడు మాత్రం ఏకగ్రీవాలు జరిగితే అది అక్రమమే, బెదిరింపుల వల్లే జరుగుతోంది అనే ప్రచారం చేయడానికి సిద్ధమవ్వాల్సి వస్తోంది. ఏది ఏమైనా.. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రోత్సహించడం, ప్రతిపక్షంలోకి రాగానే వాటిని వ్యతిరేకించడం అనేది ఏపీ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా వస్తున్న అధికార-ప్రతిపక్షాల పాత ఫార్ములానే అని చెప్పవచ్చు.

వైఎస్ఆర్‌సీపీ నేతల మాస్టర్ ప్లాన్లు

విశాఖపట్టణం, ఆగస్టు 28, పెన్ పవర్: ఉత్తరాంధ్ర రాజకీయం ఎప్పుడూ కుల సమీకరణాలు, బలమైన కుటుంబాల ఆధిక్యత చుట్టూనే తిరుగుతుంటుంది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అత్యంత కీలక పాత్ర పోషించిన సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ వంటి దిగ్గజాలు ప్రస్తుతం ఒకే రకమైన రాజకీయ ప్రాధాన్యతతో అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలో పార్టీ ప్రతిపక్షంలో ఉన్న తరుణంలో.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని, తమ వారసులను పూర్తిస్థాయి రాజకీయల్లోకి రంగప్రవేశం చేయించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే వీరి అసలు ఎజెండాగా కనిపిస్తోందనే విశ్లేషణలు ఊపందుకున్నాయి.విజయనగరం జిల్లాలో బొత్స కుటుంబానిది దశాబ్దాల రాజకీయ ప్రస్థానం. బొత్స సత్యనారాయణ భార్య, సోదరులు ఇప్పటికే ప్రజాప్రతినిధులుగా పనిచేసిన అనుభవం ఉంది. అయితే, ఇప్పుడు బొత్స దృష్టి తర్వాతి తరంపై పడిందనే ప్రచారం గట్టిగా సాగుతోంది. తన కుమార్తెను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలోకి దించి, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ పీఠంపై కూర్చోబెట్టాలని బొత్స సత్యనారాయణ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. స్థానిక పోరు ద్వారా సీటు ఖాయం చేసుకుంటే.. భవిష్యత్తులో అసెంబ్లీ లేదా పార్లమెంట్ స్థానాలకు ఆమెను సులువుగా తీసుకురావచ్చనేది బొత్స ప్లాన్. పార్టీ అధికారాన్ని కోల్పోయిన సమయంలో కేడర్‌ను కాపాడుకోవడంతో పాటు, తమ సొంత వారసులకు స్థానిక సంస్థల ద్వారా అధికారిక గుర్తింపు తీసుకురావడం సీనియర్ నేతలకు రెండు రకాలుగా కలిసివచ్చే అంశం. ఇక శ్రీకాకుళం జిల్లా రాజకీయాలను శాసిస్తున్న ధర్మాన సోదరుల రూట్ కూడా ఇంచుమించు ఇదే దారిలో సాగుతోంది. ధర్మాన ప్రసాదరావు తన కుమారుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడిని, కృష్ణదాస్ తన కుమారుడు కృష్ణ చైతన్యను ఇప్పటికే నియోజకవర్గ స్థాయి కార్యక్రమాల్లో చురుగ్గా తిప్పుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమి తర్వాత.. కుమారులను ప్రజల్లోకి నేరుగా తీసుకెళ్లడానికి స్థానిక ఎన్నికల కంటే మంచి అవకాశం మరొకటి ఉండదని ధర్మాన సోదరులు భావిస్తున్నారు. జెడ్పీటీసీ లేదా కార్పొరేషన్ స్థాయి పోటీల ద్వారా వీరిని క్షేత్రస్థాయికి అలవాటు చేయాలని చూస్తున్నారు.ఈ పరిణామాల వెనుక ఉన్న అసలు పొలిటికల్ ట్విస్ట్ ఏమిటంటే.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత పార్టీని నడిపించడం కంటే, తమ కుటుంబ రాజకీయ వారసత్వం చేజారిపోకుండా చూసుకోవడానికే ఈ సీనియర్లు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అధికారం చేతిలో లేని సమయంలో పార్టీ తరపున గట్టిగా పోరాడే కంటే, స్థానిక ఎన్నికల రూపంలో వచ్చిన అవకాశాన్ని వాడుకుని తమ వారసులకు ప్రజాప్రతినిధి ముద్ర వేస్తే, భవిష్యత్తులో అధికార మార్పిడి జరిగినప్పుడు సులువుగా స్థిరపడవచ్చనేది వీరి ఆలోచన. ఈ వారసత్వ రాజకీయాల ఎత్తుగడలకు క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి బలంగా ఉంది. అధికారంలో ఉన్న కూటమి స్థానిక ఎన్నికల్లో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తుంది. ఈ పరిస్థితుల్లో సీనియర్లు తమ ప్రభావంతో వారసులను గెలిపించుకోవడం అనుకున్నంత తేలికైన విషయం కాదు. పైగా వైసీపీలోని ద్వితీయ శ్రేణి నాయకులు, సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకున్న కేడర్ ఈ వారసత్వ నిర్ణయాలను ఎంతవరకు ఆమోదిస్తారనేది ప్రశ్నార్థకమే.ఉత్తరాంధ్ర వైసీపీ సీనియర్లు బొత్స, ధర్మాన సోదరులకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పార్టీ ఉనికిని చాటుకునే పోరాటం మాత్రమే కాదు. తమ రాజకీయ వారసుల భవిష్యత్తును నిర్ణయించే అగ్నిపరీక్ష . తమ బలాన్ని ఉపయోగించి వారసులను స్థానిక పీఠాలపై కూర్చోబెట్టి పొలిటికల్ రీ-లాంచ్ చేస్తారా లేక అధికార కూటమి ధాటికి డిఫెన్స్‌లో పడతారా అనేది వేచి చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

తెగిన టిబెట్ డ్యామ్.. వరదల్లో కొట్టుకొచ్చిన బంగారం..

నేపాల్‌లో వరదలు బీభత్సం సృష్టిస్తున్న వేళ.. ఒకవైపు టిబెట్ వైపున డ్యామ్ తెగిపోయిందన్న సమాచారం కలకలం రేపుతోంది. మరోవైపు వరదల్లో కొట్టుకొచ్చిన కబోర్డులో బంగారం, వెండి, నగదు బయటపడటం ఆసక్తికరంగా మారింది. విపత్కర పరిస్థితుల్లోనూ కొందరు మానవత్వాన్ని చాటుకున్నారు. నేపాల్‌లో భారీ వర్షాలు, వరదలు, కొండచరియల విరిగిపడటంతో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి. ముఖ్యంగా చైనా–నేపాల్ సరిహద్దు ప్రాంతాల్లో ప్రకృతి బీభత్సం కొనసాగుతోంది. ఈ క్రమంలో టిబెట్ వైపున ఓ డ్యామ్ తెగిపోయినట్లు సమాచారం అందిందని నేపాల్ పోలీసులు వెల్లడించారు. ఈ పరిణామంతో సరిహద్దు ప్రాంతాల ప్రజల్లో మరింత భయాందోళనలు నెలకొన్నాయి.

టిబెట్ వైపు డ్యామ్ తెగిపోయినట్లు సమాచారం వచ్చిందని నేపాల్ పోలీసులు సోషల్ మీడియా ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. భద్రతా సిబ్బంది, సహాయక చర్యల్లో పాల్గొంటున్న రెస్క్యూ సిబ్బంది, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు వీలైనంత త్వరగా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని, తమ ఆచూకీని కుటుంబ సభ్యులు, ఇతరులకు తెలియజేయాలని కోరారు.

ఇదిలా ఉండగా.. చైనా–నేపాల్ సరిహద్దుల్లో కొండచరియలు విరిగిపడటంతో భారీగా శిథిలాలు పేరుకుపోయి ఓ సరస్సు ఏర్పడినట్లు చైనా ప్రభుత్వ టీవీ వెల్లడించింది. ఈ సరస్సులో నీటి మట్టం పెరుగుతూ పొంగిపొర్లుతున్నట్లు తెలిపింది. దీంతో దిగువ ప్రాంతాల్లో వరద ముప్పు మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

వరదల్లో కొట్టుకొచ్చిన కబోర్డులో బంగారం

ప్రకృతి విలయంతో ప్రజలు ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీస్తున్న సమయంలో.. నేపాల్‌లో మరో ఆసక్తికర ఘటన వెలుగులోకి వచ్చింది. వరద నీటిలో కొట్టుకొచ్చిన ఓ కబోర్డును ఓ వ్యక్తి గుర్తించాడు. దానిని తెరిచి చూడగా అందులో బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదు కూడా ఉన్నట్లు గుర్తించాడు. అంత విలువైన వస్తువులు కనిపించినప్పటికీ వాటిని తన సొంతం చేసుకోకుండా పోలీసులకు అప్పగించాడు. కబోర్డులో లభించిన వస్తువులకు సంబంధించిన బిల్లును కూడా గుర్తించినట్లు సమాచారం. ఆ బిల్లుపై 'జై శ్రీ మహాలక్ష్మి గోల్డ్ అండ్ సిల్వర్ షాప్' అనే పేరు ఉన్నట్లు ఆ వ్యక్తి తెలిపాడు. కబోర్డు, అందులోని బంగారం, వెండి, నగదును పోలీసులకు అప్పగించినట్లు వెల్లడించాడు. వీటికి సంబంధించిన యజమానులు ఉంటే పోలీసులను లేదా తనను సంప్రదించాలని కోరాడు.ఇప్పటికే వరదల్లో కొట్టుకొచ్చిన ఓ మహిళ మృతదేహం నుంచి బంగారం దోచుకున్న ఘటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో.. అదే విపత్కర సమయంలో విలువైన వస్తువులను పోలీసులకు అప్పగించిన ఈ వ్యక్తి వ్యవహారం మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది.ఒకవైపు ప్రాణాలు, ఆస్తులు వరదల్లో కొట్టుకుపోతుంటే.. మరోవైపు దొరికిన సొమ్మును సొంతం చేసుకోకుండా యజమానులకు చేరేలా చేసిన ఈ చర్య అందరి ప్రశంసలు అందుకుంటోంది.

ఆగస్టు నెల తెచ్చిన షేర్ల ఒత్తిడి.. ఇన్వెస్టర్లు భయపడాల్సిందేనా?



భారతీయ ఈక్విటీ మార్కెట్లలోకి ఈ నెలలో ఊహించని రీతిలో భారీగా షేర్ల సరఫరా వచ్చిపడింది. మార్కెట్ గరిష్ట స్థాయిల వద్ద ట్రేడవుతున్న తరుణంలో కంపెనీల ప్రమోటర్లు, ప్రైవేట్ ఈక్విటీ ఫండ్లు తమ వాటాలను భారీ ఎత్తున విక్రయించి నగదు రూపంలోకి మార్చుకుంటున్నాయి. దీనికి తోడు ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీ ఆఫర్ ఫర్ సేల్ వంటి భారీ ఇష్యూలు తోడవడంతో, కేవలం ఒక్క ఆగస్టు నెలలోనే దాదాపు రూ. 58,000 కోట్ల విలువైన షేర్ల ప్రవాహం మార్కెట్‌ను ముంచెత్తింది. మధ్యప్రాచ్య ఉద్రిక్తతల షాక్ నుంచి నిఫ్టీ 500 సూచీ కోలుకుని వరుసగా మూడో నెల లాభాలను నమోదు చేసినప్పటికీ.. ఈ స్థాయిలో నిరంతరం వస్తున్న షేర్ల విక్రయాలు ఇన్వెస్టర్లలో ఆందోళన కలిగిస్తున్నాయి.

ఆగస్టు 1 నుంచి ఆగస్టు 25 మధ్య కాలంలో నమోదైన విక్రయాల గణాంకాలను పరిశీలిస్తే.. ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ పెట్టుబడిదారులు ఏకంగా రూ. 18,095.72 కోట్ల విలువైన వాటాలను విక్రయించగా, ప్రమోటర్లు రూ. 12,439.77 కోట్ల విలువైన షేర్లను అమ్ముకున్నారు. వీటితో పాటు కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీలో చేపట్టిన ఆఫర్ ఫర్ సేల్ పరిమాణం రూ. 31,445.84 కోట్లుగా నమోదైంది. అల్ట్రాటెక్ సిమెంట్, కెఫిన్ టెక్నాలజీస్ లాంటి లావాదేవీల్లో ప్రమోటర్, పీఈ నిష్క్రమణలు రెండింటి కింద నమోదైన అతివ్యాప్తిని సర్దుబాటు చేసిన తర్వాత కూడా, నెట్ డీ–డూప్లికేటెడ్ షేర్ల విక్రయాల విలువ రూ. 57,685.08 కోట్లుగా తేలింది. ముఖ్యంగా ప్రైవేట్ ఈక్విటీ ఫండ్ల అమ్మకాల జోరు జూలై నెలతో పోలిస్తే ఆగస్టు నాటికి ఐదు రెట్లు పెరగడం గమనార్హం.ఈ భారీ పెట్టుబడుల ఉపసంహరణకు ప్రధాన కారణం ఆకర్షణీయమైన వాల్యుయేషన్లు, లాభాల స్వీకరణ గత కొంతకాలంగా మిడ్–క్యాప్, స్మాల్–క్యాప్ విభాగాలలో స్టాక్స్ మంచి లాభాలను ఆర్జించడంతో, కంపెనీల వాల్యుయేషన్లు గరిష్ట స్థాయికి చేరాయి. ఈ అనుకూల వాతావరణాన్ని సద్వినియోగం చేసుకుని తమ లాభాలను వెనక్కి తీసుకోవడానికి ప్రమోటర్లు, పీఈ ఫండ్లు ఈ సమయాన్ని ఎంచుకున్నాయి. ఈ పీఈ ఎగ్జిట్స్‌లో మీషో సంస్థలో జరిగిన రూ. 2,918.92 కోట్ల లావాదేవీ అగ్రస్థానంలో నిలవగా.. తర్వాతి స్థానాల్లో అల్ట్రాటెక్ సిమెంట్, లెన్స్‌కార్ట్, పేటీఎమ్, డాక్టర్ అగర్వాల్స్ హెల్త్ కేర్ నిలిచాయి. కేవలం ఈ ఐదు కంపెనీల వాటాల విక్రయమే మొత్తం పీఈ నిష్క్రమణల్లో దాదాపు 70 శాతంగా ఉంది.మార్కెట్‌పై ఈ పరిణామాల ప్రభావం గురించి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మ్యూచువల్ ఫండ్లలోకి క్రమం తప్పకుండా వస్తున్న ఎస్ఐపీ (సిప్) నిధులు దేశీయ సంస్థాగత ద్రవ్యతకు బలాన్నిస్తున్నప్పటికీ.. మార్కెట్లోకి ఈ స్థాయిలో నిరంతరం కొత్త షేర్లు వచ్చిపడుతుండటం సెకండరీ మార్కెట్ లిక్విడిటీపై తీవ్ర ఒత్తిడి తెస్తోంది. ఐపీఓలు, ఓఎఫ్ఎస్‌ల ప్రవాహం ఇలాగే కొనసాగిస్తే రిటైల్ ఇన్వెస్టర్ల నిధులు పూర్తిగా ప్రాథమిక మార్కెట్ వైపు మళ్లిపోతాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తిరిగి పెద్ద ఎత్తున మార్కెట్‌లోకి రాకపోతే, ఈ భారీ ఇష్యూల నిరంతర రాక సెకండరీ మార్కెట్ నిలకడను దెబ్బతీసే ప్రమాదం ఉందని సామ్‌కో మ్యూచువల్ ఫండ్ వంటి సంస్థలు హెచ్చరిస్తున్నాయి. మార్కెట్లు గరిష్ట స్థాయిలలో ఉన్నప్పుడు ప్రమోటర్లు, పీఈ ఫండ్లు లాభాలు స్వీకరించి ఎగ్జిట్ అవ్వడం సాధారణ వ్యాపార ప్రక్రియే అయినప్పటికీ.. స్వల్పకాలంలో ఇది సెకండరీ మార్కెట్‌లో షేర్ల సరఫరాను విపరీతంగా పెంచుతుందని అంటున్నారు. కాబట్టి ఇన్వెస్టర్లు ఏదైనా కంపెనీలో పెట్టుబడి పెట్టే ముందు ఆయా స్టాక్స్ వాల్యుయేషన్లు, ఫండమెంటల్స్‌ను క్షుణ్ణంగా బేరీజు వేసుకోవడం ఎంతో అవసరమని సూచిస్తున్నారు.

టిబెట్ వైపు డ్యామ్ తెగిపోయింది.. నేపాల్‌లో హై అలర్ట్!

నేపాల్‌లో మరోసారి వరద ముప్పు ఆందోళన కలిగిస్తోంది. టిబెట్ వైపున డ్యామ్ తెగిపోయినట్లు సమాచారం అందిందని నేపాల్ పోలీసులు ప్రకటించారు. దీంతో సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేస్తూ అత్యవసర హెచ్చరికలు జారీ చేశారు.

టిబెట్ వైపున డ్యామ్ తెగిపోయినట్లు సమాచారం తమకు అందిందని నేపాల్ పోలీసులు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ నేపథ్యంలో భద్రతా సిబ్బంది, సహాయక చర్యల్లో పాల్గొంటున్న రెస్క్యూ సిబ్బంది, స్థానిక ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిస్థితులు మరింత తీవ్రంగా మారే అవకాశం ఉన్నందున నదులు, వాగులు, లోతట్టు ప్రాంతాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు ప్రజలకు సూచించారు. అంతేకాకుండా తాము సురక్షితంగా ఉన్నామనే విషయాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు తెలియజేయాలని కోరారు. ప్రమాదకర ప్రాంతాల్లో ఉన్నవారు అధికారుల సూచనలను పాటించాలని స్పష్టం చేశారు.ఇదిలా ఉంటే.. చైనా ప్రభుత్వ టీవీ సంస్థ కూడా సరిహద్దు ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితిపై కీలక సమాచారాన్ని వెల్లడించింది. చైనా–నేపాల్ సరిహద్దుల్లో కొండచరియలు విరిగిపడటంతో భారీ మొత్తంలో శిథిలాలు పేరుకుపోయి ఒక సరస్సు ఏర్పడినట్లు తెలిపింది. ఆ సరస్సులో నీటి మట్టం పెరుగుతూ పొంగిపొర్లుతున్నట్లు పేర్కొంది.

భారీ వర్షాలు, కొండచరియలు, వరదల కారణంగా ఇప్పటికే నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో టిబెట్ వైపు డ్యామ్ తెగిపోయినట్లు వచ్చిన సమాచారం స్థానికంగా మరింత ఆందోళనకు కారణమవుతోంది. ఒకవేళ భారీగా నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహిస్తే నదీ పరివాహక ప్రాంతాల్లో వరద పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని భావిస్తున్నారు.ప్రస్తుతం అధికార యంత్రాంగం పరిస్థితిని నిశితంగా గమనిస్తోంది. రెస్క్యూ సిబ్బంది, భద్రతా బలగాలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు అందాయి. ప్రజలు వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా సురక్షిత
ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు.

టిబెట్‌లోని పరిస్థితి, డ్యామ్‌కు సంబంధించిన సమాచారం, సరిహద్దు ప్రాంతాల్లో నీటి ప్రవాహంపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. అయితే నేపాల్‌లో అధికారుల తాజా హెచ్చరికల నేపథ్యంలో సరిహద్దు, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

అగ్రరాజ్యానికి భాగవత్.. భగ్గుమంటున్న అమెరికన్లు!

బీజేపీ సైద్ధాంతిక భావజాలానికి ప్రధాన పునాది అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ ఎస్ ఎస్) చీఫ్(సంఘ్ చాలక్) మోహన్ భాగవత్.. అమెరికా పర్యటనకు రెడీ అయ్యారు. ఇప్పటికే ఆయన అమెరికాకు బయలు దేరారు. ఆయన నేరుగా న్యూయార్క్ రాష్ట్రానికి వెళ్తారు. న్యూయార్క్‌లో హిందూ అమెరికన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ మద్దతు దారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించనున్నారు. దీనికి సంబంధించిన ముందస్తు సన్నాహక కార్యక్రమం కూడా ప్రారంభమైంది. భారత కాలమానం ప్రకారం శనివారం భాగవత్ న్యూయార్క్‌లో ప్రసంగించనున్నారు.అయితే.. భాగవత్ పర్యటన పట్ల.. అమెరికన్లు నిప్పులు చెరుగుతున్నారు. లెక్కకు మిక్కిలి సంఘాలు.. ఆయన రాకను వ్యతిరేకిస్తూ బహిరంగ నిరసనలు వ్యక్తం చేస్తుండడం గమనార్హం. హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్, సేవ్ అమెరికా ఫ్రం హిందుత్వ, ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్, దళిత్ సాలిడారిటీ ఫోరం ప్రతినిధులు ఇప్పటికే భాగవత్ రాకను నిరసిస్తూ.. ప్రకటనలు జారీ చేశారు. భాగవత్ కేవలం హిందూ ప్రతినిధి కాదని.. ఆయన మతాల మధ్య, సమాజం పట్ల చిచ్చు పెట్టే ప్రయత్నం చేసే వ్యక్తి అని పేర్కొనడం గమనార్హం.

ఈ మేరకు న్యూయార్క్ గవర్నర్ మమ్దానీకి ఆయా సంస్థల ప్రతినిధులు లేఖలు కూడా సమర్పించారు. ఎట్టి పరిస్థితిలోనూ భాగవత్‌ను న్యూయార్క్‌లో అడుగు పెట్టకుండా చూడాలని కోరారు. అదేసమయంలో భాగవత్ పాల్గొనే కార్యక్రమానికి ప్రతిగా తాము కూడా మరో కార్యక్రమం నిర్వహిస్తామని.. దానికి అనుమతి ఇవ్వాలని వారు కోరారు. అయితే.. ఈ వ్యవహారం.. మత విశ్వాసాలకు ముడి పడి ఉండడంతో మమ్దానీ తీసుకునే నిర్ణయం ఆసక్తిగా మారింది. మరోవైపు.. భాగవత్‌కు అధ్యక్షుడు ట్రంప్ కార్యాలయం దన్నుగా ఉందన్న వార్తలు వస్తున్నాయి.

ఇది సరికాదు: హిందూ అమెరికన్

భాగవత్ వంటి గొప్ప నాయకుడు అమెరికాకు వస్తున్న తరుణంగా ఆయనను వ్యతిరేకించడం సరికాదని హిందూ అమెరికన్ ఫౌండేషన్ సభ్యులు ప్రకటించారు. ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు న్యూయార్క్ ప్రభుత్వం సహకరించాలని కోరారు. అదే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కార్యకర్తలతో ఎలాంటి ఘర్షణలకు దిగవద్దని కోరారు. ఏ చిన్న ఘటన జరిగినా.. కార్యక్రమం రద్దయ్యే అవకాశం ఉందని చెప్పడం గమనార్హం. మరోవైపు... తెలంగాణ సీఎంరేవంత్ రెడ్డి పర్యటనకు అనుమతినివ్వని కేంద్రం మతపరమైన ప్రసంగాలు చేసే భాగవత్‌కు ఎలా అవకాశం ఇచ్చిందని.. పలువురు కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ప్రశ్నించారు.

AI తో ఎంట్రీ లెవల్ జాబ్స్ డైలమా.. ఫ్రెషర్స్ ఏం చేయాలంటే?



ప్రస్తుత డిజిటల్ యుగంలో –ఉద్యోగం రావాలంటే అనుభవం ఉండాలి... కానీ అనుభవం రావాలంటే ముందు ఉద్యోగం రావాలి– అనే పాత సమస్య మరింత సంక్లిష్టంగా మారింది. కృత్రిమ మేధ (AI) వేగంగా పురోగమిస్తుండటంతో ఒకప్పుడు ఫ్రెషర్లు చేసే కోడింగ్, టెస్టింగ్, డాక్యుమెంటేషన్ వంటి రొటీన్ పనులను AI సెకన్ల వ్యవధిలో పూర్తి చేస్తోంది. దీనివల్ల కంపెనీలు ఎంట్రీ–లెవెల్ ఉద్యోగాలను తగ్గించుకుంటుం డటంతో కళాశాలల నుంచి బయటకు వచ్చే కొత్త తరం గ్రాడ్యుయేట్లకు పరిశ్రమలోకి అడుగుపెట్టే మొదటి మెట్టే మాయమవుతున్నట్లు కనిపిస్తోంది.అయితే ఎంట్రీ–లెవెల్ హైరింగ్ తగ్గుముఖం పట్టడం వల్ల భవిష్యత్తులో తీవ్రమైన టాలెంట్ కొరత ఏర్పడే ప్రమాదముంది. ఈ రోజు కంపెనీలు ఫ్రెషర్లను ఉద్యోగాల్లోకి తీసుకుని శిక్షణ ఇవ్వకపోతే.. ఐదేళ్ల తర్వాత ప్రాజెక్టులను నడిపించే సీనియర్ నిపుణులు ఎక్కడి నుంచి వస్తారనేది ఒక పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. ఏఐ కేవలం ప్రస్తుత పనులను ఆటోమేట్ చేయడమే కాకుండా.. ఒక సాధారణ మనిషి బిగినర్ నుంచి నిపుణుడిగా మారే లెర్నింగ్ ప్రాసెస్‌ను కూడా దెబ్బతీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.అయితే ఈ పరిణామం వల్ల ఫ్రెషర్ల అవసరం పూర్తిగా అంతరించిపోలేదు కానీ వారి నుంచి కంపెనీలు ఆశించే నైపుణ్యాల స్థాయి అతిగా పెరిగింది. గతంలో ప్రాథమిక సాంకేతిక పరిజ్ఞానం ఉంటే సరిపోయేది.. కానీ ఇప్పుడు AI టూల్స్‌ను సమర్థవంతంగా ఉపయోగిస్తూ సీనియర్ స్థాయి అవుట్‌పుట్‌ను అందించగల ప్రతిభను పరిశ్రమ ఆశిస్తోంది. ఏఐ ఆధారిత సాధనాలను వాడుకుంటూ సమస్యలను వేగంగా పరిష్కరించగల సామర్థ్యం ఉన్న ఫ్రెషర్లకు.. అనుభవంతో సంబంధం లేకుండా కంపెనీలు ప్రాధాన్యత ఇస్తున్నాయి.సాంప్రదాయ ఎంట్రీ–లెవెల్ ఉద్యోగాలు తగ్గినా.. ఫ్రెషర్లు తమ అనుభవాన్ని నిరూపించుకోవడానికి కొత్త మార్గాలు ఏర్పడ్డాయి. కేవలం రెజ్యూమ్‌లపై ఆధారపడకుండా.. AI సాయంతో సొంతంగా ప్రాజెక్టులు... అప్లికేషన్లు రూపొందించి –ప్రూఫ్ ఆఫ్ వర్క్– చూపించడం ద్వారా అవకాశాలను పొందవచ్చు. ఓపెన్ సోర్స్ కంట్రిబ్యూషన్లు.. ఏఐ ఫ్రీలాన్సింగ్ .. ఇంటర్న్‌షిప్‌ల ద్వారా విద్యార్థులు నేరుగా రియల్ వరల్డ్ అనుభవాన్ని సంపాదిస్తూ.. సాంకేతిక రంగంలో తమ ఉనికిని చాటుకోవచ్చు.

చివరికి AI వల్ల ఎంట్రీ–లెవెల్ పనులు ఆటోమేట్ అయినా ప్రాథమిక అవగాహన– సృజనాత్మకత కలిగిన మానవ మేధస్సుకు ఎప్పటికీ డిమాండ్ ఉంటుంది. –ఉద్యోగం వస్తేనే నేర్చుకుంటాను– అనే పాత ఆలోచనా విధానాన్ని స్వస్తి చెప్పి.. ఏఐ టూల్స్‌ను ఉపయోగించి స్వయంగా అనుభవాన్ని సృష్టించుకోగల విద్యార్థులే రేపటి విజేతలుగా నిలుస్తారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యాసంస్థలు కూడా ప్రాజెక్ట్ ఆధారిత బోధనకు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే ఈ ఎక్స్‌పీరియన్స్ గ్యాప్‌ను భర్తీ చేయడం సాధ్యమవుతుంది.

ఈ నాలుగు చాలా ముఖ్యం:

ఓపెన్ సోర్స్ కంట్రిబ్యూషన్స్ – గ్లోబల్ ప్రాజెక్ట్స్:

గ్లోబల్ ఓపెన్ సోర్స్ ప్రాజెక్ట్‌లలో భాగస్వామి కావడం ద్వారా అనుభవాన్ని పొందే అవకాశం ఉంది. ఇతర డెవలపర్లతో కలిసి పనిచేయడం..సెక్యూరిటీ బగ్స్ సరిచేయడం.. కోడ్ రివ్యూలలో పాల్గొనడం ద్వారా రియల్–టైమ్ ప్రాజెక్ట్ అనుభవం లభిస్తుంది.

ఇంటర్న్‌షిప్‌లు– ఫ్రీలాన్సింగ్ :

నేరుగా పూర్తిస్థాయి ఉద్యోగాలు దొరకనప్పుడు AI ఆధారిత ఇంటర్న్‌షిప్‌లు లేదా అప్రెంటిస్‌షిప్‌లను ఎంచుకోవడం మంచిది. అలాగే అప్‌వర్క్, ఫివెర్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో AIటూల్స్ సాయంతో చిన్న చిన్న క్లయింట్ ప్రాజెక్టులు చేయడం వల్ల బిజినెస్ లాజిక్, కమ్యూనికేషన్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అలవాటవుతాయి.

మారిన ఫ్రెషర్ డెఫినిషన్ :

ఇప్పుడు కంపెనీలు –జీరో స్కిల్– ఉన్న ఫ్రెషర్లను కోరుకోవడం లేదు. AI టూల్స్‌ను వాడుతూ ఒక సీనియర్ డెవలపర్ ఇచ్చే అవుట్‌పుట్‌ను ఇవ్వగల ఫ్రెషర్లకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ప్రాబ్లమ్ సాల్వింగ్.. ప్రాంప్ట్ ఇంజనీరింగ్ .. సిస్టమ్ ఆర్కిటెక్చర్ పట్ల అవగాహన పెంచుకుంటే ఫ్రెషర్‌గా కూడా సీనియర్ స్థాయి గుర్తింపు సాధించవచ్చు.

కోర్ ఫండమెంటల్స్ మర్చిపోకూడదు:

AI షార్ట్‌కట్ రూపంలో కోడ్ లేదా కంటెంట్‌ను అందించినా అది కరెక్టో కాదో చెక్ చేసే నైపుణ్యం ఉండాలి. సబ్జెక్ట్ ప్రాథమిక సూత్రాలు బాగా తెలిసినప్పుడే AI ఇచ్చిన అవుట్‌పుట్‌లోని తప్పులను సవరించగలరు.

హిమానీనద ప్రళయం!

ఒక భారీ మంచు-రాతి హిమపాతానికి కారణమై, నేపాల్, టిబెట్‌లలోని తీర్థయాత్రికులకు, ట్రెక్కర్లకు ప్రసిద్ధి చెందిన ప్రాంతాల్లో అపారమైన వరదలకు దారితీసింది. వేలాది మంది, పలు దేశాలకు చెందిన వ్యక్తుల ప్రాణాలను బలిగొన్న ఈ ఘటన, 2004 సునామీ తర్వాత అతిపెద్ద అంతర్జాతీయ విషాదంగా నిలిచింది. 0.2 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంగల హిమానీనదంలో ఒక భాగం, 5,200 మీటర్ల ఎత్తునుంచి విరిగిపడి, 1,200 మీటర్లు నిట్టనిలువుగా లోయలోకి దూసుకుపోయి, రిక్టర్ స్కేలుపై 5.2 తీవ్రత గల భూకంపానికి సమానమైన ప్రకంపనలను నమోదు చేసింది. బురద, నీరు, శిథిలాలతో కూడిన ఆ ప్రళయ ప్రవాహం కిందకు దూసుకొచ్చినప్పుడు, ఆ మార్గంలో ఉన్నవారికి తప్పించుకునే సమయం చాలా తక్కువగా దొరికింది. త్రిశూలి నది (భోటేకోశీ అని కూడా పిలుస్తారు) కేవలం 30 నిమిషాల్లోనే 9 మీటర్లు పైకి లేచిందని చెబుతున్నారు. దిగువ ప్రాంతాలకు అర్థవంతమైన హెచ్చరిక పంపగలిగే ఎలాంటి ముందస్తు హెచ్చరిక వ్యవస్థా దీన్ని ఎదుర్కోగలిగేది కాదు. రాక్షసాకారంలో ఉప్పొంగుతూ, తన సొంత మట్టాన్ని వెతుక్కుంటూ సాగిన ఆ ప్రవాహం, మార్గంలో వచ్చిన ప్రజలను తీసుకుపోయి, వంతెనలు, జలవిద్యుత్ కేంద్ర పరికరాలు, గ్రామాలతోపాటు మనుషులను కూడా నాశనం చేసింది. తాజా గణాంకాల ప్రకారం, నేపాల్‌లో మృతుల సంఖ్య 469కి చేరగా, చైనావైపు మరో ముగ్గురు మృతిచెందారు. 1,300 మందికిపైగా ఇంకా ఆచూకీ లేకుండా పోయారు. వీరిలో టిబెట్‌లోని గిరోంగ్ కౌంటీలోనే 558 మంది ఉన్నారని, అందులో 260మంది విదేశీయులని చైనా అధికారిక మీడియా సీసీటీవీ వెల్లడించింది. గ్లోబల్ వార్మింగ్ యుగంలో, హిమనీనద విధ్వంసాల గురించి భయానకంగా, ఆకస్మికంగా ఉండే ఒక విషయం ఏమిటంటే -మనుషులు వీలైనంత దూరంగా జీవించడం, ఉండటం తప్ప మరో మార్గం లేకపోవడమే.

హిమనీనద విధ్వంసాలకు, వాతావరణ మార్పులకు మధ్య సంబంధం ఇప్పటికీ ఒక పరికల్పనగానే ఉన్నా, గ్లోబల్ వార్మింగ్ హిమనీనదాలను వెనక్కి తగ్గించడానికి కారణమవుతోందన్నది సుస్థిర శాస్త్రీయ వాస్తవం. హిమాలయాలు ప్రపంచ సగటు కంటే రెండింతలు వేగంగా వేడెక్కుతున్నాయని, గత మూడు దశాబ్దాల్లో నేపాల్ తన మంచులో మూడోవంతు కోల్పోయిందని కూడా గణాంకాలున్నాయి. అంతర్జాతీయ సమీకృత పర్వత అభివృద్ధి కేంద్రం, ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం సంయుక్తంగా నిర్వహించిన ఒక అధ్యయనం, నేపాల్, భారత్, టిబెట్‌లలో మొత్తం 3,624 హిమనీనద సరస్సులను గుర్తించగా, వాటిలో 47 సరస్సులు ప్రమాదకరమైనవిగా వర్గీకరించబడ్డాయి. ఇలాంటి వాస్తవాలే ఈ విషాదాలను వాతావరణంపై మానవ ప్రభావంతో ముడిపెట్టడానికి వీలు కల్పిస్తున్నాయి. హిమాలయ పర్వత ప్రాంతం ఎంత సున్నితమైనదో, మానవ కార్యకలాపాలు దానికి తోడైన భారీ కర్బన పాదముద్ర ఎంత హానికరమో పర్యావరణవేత్తలు ఏళ్లుగా ప్రపంచాన్ని హెచ్చరిస్తూనే వస్తున్నారు. నేపాల్‌లోని నిటారుగా, అందంగా ఉండే లోయలు గొప్ప పర్యాటక మార్గాలుగా కనిపించొచ్చు, కానీ విపత్తు సంభవించినప్పుడు అవి ఉండదగిన ప్రాంతాలు మాత్రం కావు. కంప్యూటర్ గ్రాఫిక్స్ యుగంలో తీసిన హర్రర్ సినిమానుంచి నేరుగా వచ్చినట్టుండే ఆ దృశ్యాలు, ప్రకృతి తిరుగులేని శక్తికి సాక్ష్యంగా నిలిచిన ఒక నిర్జన, భయానక భూభాగాన్ని మిగిల్చాయి. రసువా జిల్లాలో ఎగువ త్రిశూలి జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగంలో చిక్కుకున్న 350మంది కార్మికులను, నివాసితులను నేపాల్ సైన్యం విషమ వాతావరణంలోనూ ధైర్యంగా రక్షించడం ఈ విషాదంలో ఒక ఆశాకిరణంగా నిలిచింది. చైనా ప్రధాని లీ కియాంగ్ స్వయంగా టిబెట్‌లోని విధ్వంస ప్రాంతాన్ని సందర్శించి, అత్యవసర సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరోవైపు, గండక్ నదీ పరీవాహక ప్రాంతానికి వరద ముప్పు పొంచి ఉండటంతో, బిహార్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ సరిహద్దు రాష్ట్రాల నుంచి భారత్ వేలాదిమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. ఇరుగుపొరుగు దేశాలు ఏకతాటిపైకి వచ్చి సహాయక చర్యలు చేపట్టడం గమనార్హం. అయితే, ఆందోళన ఇంకా సద్దుమణగలేదు -అసలు విపత్తు జరిగిన ప్రాంతంలోనే కొత్తగా ఒక సరస్సు ఏర్పడి, నీటిమట్టం పెరుగుతోందని, ఇది పగిలిపోతే దిగువ ప్రాంతాల్లో మరో వరదకు దారితీయవచ్చని నేపాల్ విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. దీనికితోడు, గురువారం రాత్రి టిబెట్‌లోని నాగ్క్సులో 4.7 తీవ్రతతో మరో భూకంపం సంభవించడం, ఇప్పటికే విషాదంలో మునిగిన ఈ ప్రాంతంలో ఆందోళనలను మరింత పెంచింది. సరిహద్దును ఇంతటి తీవ్రతతో తాకిన ఈ విషాదానికి సంబంధించి చైనా వైపునుంచి విశ్వసనీయ సంఖ్యాపరమైన సమాచారం చాలా తక్కువగా వస్తుండటంతో, మృతుల సంఖ్య ఇంకా ఎంత పెరగవచ్చో ఊహించవచ్చు. నేపాల్‌లోని పవిత్ర హిందూ క్షేత్రాలను, అలాగే భారత్-చైనా సంబంధాల్లో మంచు కరగడం అనంతరం గత ఏడాదే భారతీయులకు తిరిగి తెరుచుకున్న చైనాలోని మానససరోవర్ సమీపంలోని కైలాస పర్వతాన్ని ఉత్సాహంగా సందర్శించే భారతీయులకు ఈ విషాదం మరింత హృదయవిదారకంగా అనిపిస్తోంది. మృతుల్లో, గల్లంతైనవారిలో అనేకమంది కైలాస యాత్రికులే ఉన్నారు.

పర్యావరణవేత్తలు, పరిరక్షకులు హిమాలయ పర్వత ప్రాంత పెళుసుదనం, మానవ కార్యకలాపాల హానికర ప్రభావం గురించి ప్రపంచాన్ని హెచ్చరిస్తూనే వచ్చారు. ఈ మహా విషాదానికి కారణం గ్లోబల్ వార్మింగేనని త్వరలోనే స్పష్టంగా నిర్ధారణ అవుతుంది. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ముందుగానే కచ్చితంగా ఊహించడం సాధ్యం కాకపోయినా, దాని పర్యవసానాలకు సన్నద్ధంగా ఉండటం మాత్రం ప్రతి హిమాలయ దేశపు తక్షణ బాధ్యత. హిమాలయ ప్రాంతంలో పర్యాటకాన్ని, తీర్థయాత్రలను జాగ్రత్తగా నియంత్రించడం, హిమానీనద సరస్సుల నిరంతర పర్యవేక్షణను బలోపేతం చేయడం, సరిహద్దు దేశాల మధ్య నిజ-సమయ డేటా పంచుకునే వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటి చర్యలు ఇకపై ఐచ్ఛికం కాదు, అత్యవసరమైనవి. ఈ విషాదం కేవలం నేపాల్, టిబెట్‌లకే పరిమితం కాదు -ప్రపంచవ్యాప్తంగా పర్వత ప్రాంతాల్లో నివసించే, పర్యటించే కోట్లాది మందికి ఇది ఒక తీవ్రమైన హెచ్చరిక. వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో ప్రపంచ దేశాలు మరింత తీవ్రంగా, తక్షణంగా వ్యవహరించకపోతే, ఇలాంటి విషాదాలు మరింత తరచుగా, మరింత తీవ్రంగా పునరావృతమయ్యే ప్రమాదముంది. ఇరుగుపొరుగు దేశాల మధ్య ఇప్పుడు కనిపిస్తున్న సహకార స్ఫూర్తి, భవిష్యత్తులో ఇలాంటి ప్రకృతి విపత్తులను ముందుగానే ఎదుర్కోవడానికి ఒక శాశ్వత ప్రాంతీయ వ్యవస్థగా రూపాంతరం చెందాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పనికొచ్చే పలుకు

ఆలోచనే.. అసలైన ఆర్థిక సూత్రం!

సంపాదన ఒక నైపుణ్యమైతే.. దాన్ని సరిగ్గా ప్రయోగించడం ఒక కళ. సాధారణంగా ఆర్థిక ఇబ్బందులు తక్కువ ఆదాయం వల్ల రావు.. ఆదాయానికి మించిన జీవనశైలిని అలవాటు చేసుకోవడం వల్లే వస్తాయి. జీతం పెరిగినా, వ్యాపారంలో లాభాలొచ్చినా, ఖర్చులు కూడా అదే వేగంతో పెరిగిపోతుంటాయి. ఫలితంగా చేతిలో డబ్బు మిగలదు, మనసులో ప్రశాంతత ఉండదు. నిజానికి ఆర్థిక స్వేచ్ఛకు తొలి అడుగు బ్యాంకు ఖాతాలో కాదు... మన ఆలోచనా విధానంలో పడుతుంది. అందుకే "ఆదాయానికి తగినట్టు జీవించడం" అనేది కేవలం పొదుపు సూత్రం కాదు; మనస్తత్వాన్ని మార్చే జీవన తత్వం!

ప్రస్తుత రోజుల్లో జీవితం.. అవసరాలకంటే ఆకర్షణల చుట్టూ ఎక్కువ తిరుగుతోంది. సోషల్ మీడియాలో కనిపించే విలాసవంతమైన జీవనశైలి, కొత్త గ్యాడ్జెట్లు, బ్రాండెడ్ వస్తువులు, ప్రతి సందర్భాన్ని ఖర్చుతో ముడిపెట్టే అలవాట్లు మనల్ని తెలియకుండానే అప్పులవైపు నడిపిస్తున్నాయి. ఒకప్పుడు "అవసరముందా?" అని ఆలోచించి కొనేవాళ్లు. ఇప్పుడు "అందరికీ ఉంది... నాకూ ఉండాలి" అనే భావనతో ఖర్చు పెడుతున్నారు. ఈ ఆలోచనే ఆర్థిక ఒత్తిడికి కారణం. నిజమైన సంపద అంటే ఎక్కువ వస్తువులు కలిగి ఉండటం కాదు; ఉన్నదానితో ప్రశాంతంగా జీవించగలగడం.

మనస్తత్వం మారితే డబ్బు మీద మన దృష్టి కూడా మారుతుంది. ఉదాహరణకు, నెలకు రూ.50 వేల ఆదాయమున్న ఇద్దరు వ్యక్తులను తీసుకుంటే, ఒకరు వచ్చినంతా ఖర్చు చేసి నెలాఖరుకు అప్పుల్లో పడతారు. మరొకరు అదే ఆదాయంలో అవసరాలను, కోరికలను వేరు చేసి కొంత మొత్తాన్ని పొదుపు చేస్తారు. ఐదేళ్ల తర్వాత ఇద్దరి జీవితాల మధ్య కనిపించే తేడా ఆదాయంలో కాదు, ఆలోచనలో ఉంటుంది. మొదటి వ్యక్తి ఒత్తిడితో జీవిస్తే, రెండో వ్యక్తి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతాడు. అంటే సంపదను నిర్ణయించేది జీతం కాదు, జాగ్రత్త!

ఆర్థిక క్రమశిక్షణ అనేది పెద్ద పెద్ద త్యాగాలతో ప్రారంభం కాదు. చిన్న చిన్న అలవాట్లతో మొదలవుతుంది. అవసరం లేని ఖర్చును ఒక్కసారి ఆపడం, ప్రతి నెల కొంత మొత్తాన్ని ముందుగా పొదుపు చేయడం, ఆకస్మికంగా కొనాలనిపించిన వస్తువు గురించి ఒక రోజు ఆలోచించడం... ఇవన్నీ సాధారణ విషయాలే. కానీ ఈ చిన్న నిర్ణయాలే భవిష్యత్తులో పెద్ద మార్పులకు కారణమవుతాయి. చుక్క చుక్కగా చేరిన నీరు చెరువును నింపినట్టే, రూపాయి రూపాయిగా దాచిన పొదుపు జీవితానికి భరోసా అవుతుంది.

అయితే పొదుపు అంటే జీవితాన్ని ఆస్వాదించకూడదని కాదు. ఆనందాన్ని వాయిదా వేయడం కాదు; ఆనందాన్ని బాధ్యతతో ఆస్వాదించడం. కుటుంబంతో గడిపే సమయం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, మంచి పుస్తకం చదవడం, ప్రకృతిలో నడవడం... ఇవన్నీ పెద్ద ఖర్చు లేకుండానే జీవితానికి విలువను పెంచుతాయి. చివరగా ఒక విషయం గుర్తుంచుకోవాలి... డబ్బు మన జీవితాన్ని నడిపించకూడదు; మనమే డబ్బును నడిపించాలి. అందుకు కావాల్సింది ఖరీదైన కోర్సులు కాదు, కొత్త యాప్‌లు కాదు, ఆర్థిక నిపుణుల సలహాలు మాత్రమే కాదు. మన మనస్తత్వంలో ఒక చిన్న మార్పు. ఆ మార్పు వచ్చినప్పుడు ఖర్చులో హద్దు వస్తుంది, పొదుపులో అలవాటు వస్తుంది, జీవితంలో ప్రశాంతత వస్తుంది. ఎందుకంటే నిజమైన సంపద... బ్యాంకు బ్యాలెన్స్‌లో కాదు, బాధ్యతతో తీసుకున్న నిర్ణయాల్లో ఉంటుంది కనుక.

అప్పుడు.. ప్రపంచ నగరమయ్యేది!

ఒక నగరం రాజధానిగా మారడం పరిపాలనా నిర్ణయం. కానీ అదే నగరం ఆర్థిక శక్తిగా ఎదగడం మాత్రం దూరదృష్టి, సమగ్ర ప్రణాళిక, నిరంతర కృషితోనే సాధ్యం. ప్రభుత్వ భవనాలు, విశాలమైన రహదారులు, కార్యాలయ సముదాయాలతో రాజధాని రూపుదిద్దుకోవచ్చు. కానీ అక్కడ పరిశ్రమలు రావాలి. పెట్టుబడులు పెట్టాలి. ఉద్యోగాలు పుట్టాలి. వ్యాపారాలు విస్తరించాలి. విద్య, వైద్యం, సాంకేతికత, సేవారంగాలు వేళ్లూనుకోవాలి. అప్పుడే అది నిజమైన ఆర్థిక కేంద్రమవుతుంది. ఈ కీలక దశలోనే అమరావతి ఉంది. రాజధాని నిర్మాణానికి ప్రభుత్వం కొత్త ఊపునివ్వడంతో మౌలిక వసతుల పనులు వేగం పుంజుకుంటున్నాయి. రహదారులు, వంతెనలు, ప్రభుత్వ భవనాలు, నీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి కీలక సదుపాయాల నిర్మాణం ముందుకు సాగుతోంది. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సహకారమూ లభిస్తోంది. ఇవన్నీ అవసరమైన పునాదులే. కానీ ఆ పునాదిపై బలమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించడమే అసలు సవాలు.

అమరావతిని కేవలం పరిపాలనా రాజధానిగా పరిమితం చేస్తే దాని సామర్థ్యంలో కొంత భాగమే వినియోగించినట్టు. శాసనసభ, సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాలతోపాటు ప్రైవేటు రంగం కూడా పెద్దఎత్తున అడుగుపెట్టే వాతావరణం ఏర్పడాలి. ఐటీ, ఫిన్‌టెక్, స్టార్టప్‌లు, బ్యాంకింగ్, కన్సల్టింగ్, విద్య, వైద్యం, పరిశోధన, హెల్త్‌టెక్‌వంటి రంగాలకు అమరావతి అనుకూల గమ్యం కావాలి. ఇందుకోసం భూ కేటాయింపులే సరిపోదు. వేగంగా అనుమతులు, స్థిరమైన విధానాలు, నాణ్యమైన విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ, ప్రజా రవాణా, మంచి ఇళ్లు, విద్యా-వైద్య సదుపాయాలు అవసరం.

కనెక్టివిటీ అమరావతి భవిష్యత్తును నిర్ణయించే మరో కీలక అంశం. విజయవాడ, గుంటూరు, తెనాలివంటి సమీప నగరాలతో వేగవంతమైన అనుసంధానం ఉండటంతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచీ సులభంగా చేరుకునే రహదారి, రైలు, ప్రజా రవాణా వ్యవస్థలు అవసరం. రాజధాని చుట్టుపక్కల ప్రాంతాలతో ఎంత బలమైన ఆర్థిక సంబంధాలు ఏర్పడితే అంత వేగంగా దాని ప్రభావ పరిధి విస్తరిస్తుంది. నగరం తన చుట్టూ ఉన్న ప్రాంతాలను వేరుచేయకుండా వాటిని తన ఆర్థిక వ్యవస్థలో భాగం చేసుకున్నప్పుడే అది నిజమైన గ్రోత్ హబ్‌గా ఎదుగుతుంది. అమరావతికి మరో గొప్ప అవకాశం నాలెడ్జ్ ఎకానమీ. భవిష్యత్తులో నగరాల విలువను కేవలం భూములు, భవనాలు నిర్ణయించవు. జ్ఞానం, పరిశోధన, సాంకేతికత, ఆవిష్కరణలే ప్రధాన ఆస్తులుగా మారుతున్నాయి. క్వాంటమ్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, బయోటెక్నాలజీ వంటి భవిష్యత్ రంగాలకు అమరావతిలో స్థానం కల్పించాలి. ప్రముఖ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, ఇన్నోవేషన్ ల్యాబ్‌లు, స్టార్టప్ ఇంక్యుబేటర్లు ఒకే పర్యావరణ వ్యవస్థగా ఏర్పడాలి. 'చదువు ఇక్కడ.. పరిశోధన ఇక్కడ.. స్టార్టప్ ఇక్కడ.. ఉద్యోగం ఇక్కడ' అనే చక్రం తిరిగితేనే అమరావతి యువతకు అవకాశాల నగరమవుతుంది.

రియల్ ఎస్టేట్ అభివృద్ధిని కూడా సమతుల్యంగా నిర్వహించాలి. రాజధాని నిర్మాణంతో భూముల విలువలు పెరగడం సహజమే. కానీ భూముల ధరలు పెరగడాన్నే ఆర్థిక అభివృద్ధిగా భావించడం సరైంది కాదు. నగరంలో ఇళ్లు సాధారణ ఉద్యోగులు, మధ్యతరగతి, యువతకు అందుబాటులో లేకపోతే సామాజిక అసమతుల్యత తప్పదు. అందుకే విలాసవంతమైన నివాస సముదాయాలతోపాటు అందుబాటు ధరల్లో గృహాలు, అద్దె ఇళ్లు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులకు అవసరమైన నివాస సదుపాయాలు కూడా ఉండాలి. నగరం ఎంత పెద్దదోకంటే ఎంతమందికి అందుబాటులో ఉందన్నదే దాని విజయానికి కొలమానం.

రాజధాని కోసం భూములిచ్చిన రైతులు కూడా ఈ ఆర్థిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. రాజధాని అభివృద్ధి వల్ల వారికి కలిగే ప్రయోజనం కేవలం భూమి విలువ పెరగడానికే పరిమితం కాకూడదు. చిన్న వ్యాపారాలు, రిటైల్, హాస్పిటాలిటీ, రవాణా, సేవారంగాల్లో అవకాశాలు కల్పించాలి. యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలి. కొత్త నగరంలో ఏర్పడే ఆర్థిక కార్యకలాపాల్లో స్థానికులకు భాగస్వామ్యం కల్పించినప్పుడే రాజధాని నిర్మాణం సామాజికంగా కూడా విజయవంతమవుతుంది. ఉద్యోగాల సృష్టి అమరావతి విజయాన్ని కొలిచే ప్రధాన ప్రమాణంగా ఉండాలి. భారీ పెట్టుబడులు వచ్చాయని చెప్పడం కంటే వాటి ద్వారా ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి? స్థానిక యువతకు ఎన్ని అవకాశాలు లభించాయి? అనే ప్రశ్నలకు సమాధానముండాలి. ఇండస్ట్రీలకు అవసరమైన నైపుణ్యాలను ముందుగానే గుర్తించి, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు కంపెనీల మధ్య భాగస్వామ్యాలు ఏర్పాటు చేయాలి. నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉంటేనే పెట్టుబడులు నిలుస్తాయి. ఉద్యోగాల కోసం యువత ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితిని మార్చి.. కంపెనీలే అమరావతికి వచ్చే వాతావరణం సృష్టించాలి.

అయితే అమరావతి అభివృద్ధి అంటే మిగతా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని పక్కన పెట్టడం కాదు. విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ, నెల్లూరు, కర్నూలు, అనంతపురం వంటి నగరాలకు ప్రత్యేక ఆర్థిక బలాలున్నాయి. విశాఖ సముద్ర ఆర్థిక వ్యవస్థ, ఐటీ, పరిశ్రమలకు కేంద్రంగా ఎదగవచ్చు. తిరుపతి పర్యాటకం, విద్య, వైద్యం, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో బలపడవచ్చు. రాయలసీమ పునరుత్పాదక ఇంధనం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు కేంద్రంగా మారవచ్చు. అమరావతి పరిపాలన, ఫైనాన్స్, నాలెడ్జ్, సేవారంగాలకు కేంద్రంగా ఎదిగితే.. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు తమ ప్రత్యేక రంగాల్లో అభివృద్ధి చెందేలా 'మల్టీ-సిటీ గ్రోత్ మోడల్'ను రూపొందించాలి. అమరావతి ఎదుగుదల రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అవకాశాలను సృష్టించాలి. ప్రపంచస్థాయి నగరాల అనుభవం ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది. నగరాలను గొప్పగా చేసేది వాటి భవనాల ఎత్తు కాదు.. అక్కడ సృష్టించే అవకాశాల ఎత్తు. అమరావతికి ఇప్పుడు అలాంటి చారిత్రక అవకాశం వచ్చింది. మౌలిక వసతుల నిర్మాణం వేగం పుంజుకోవడం, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సహకారం, పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాలు, సాంకేతిక రంగాలపై దృష్టి.. ఇవన్నీ బలమైన పునాదిని నిర్మిస్తున్నాయి. కానీ ఆ పునాదిపై కాంక్రీట్ నగరం మాత్రమే కాదు.. అవకాశాల నగరం నిర్మించాలి. అందుకే ఇకపై అమరావతి విజయాన్ని 'ఎన్ని భవనాలు పూర్తయ్యాయి?' అనే ప్రశ్నతో కాకుండా.. 'ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి? ఎంత పెట్టుబడి వచ్చింది? ఎన్ని స్టార్టప్‌లు ఏర్పడ్డాయి? ఎన్ని పరిశోధనా సంస్థలు వచ్చాయి? యువతకు ఎన్ని అవకాశాలు లభించాయి? స్థానిక ప్రజల ఆదాయం ఎంత పెరిగింది?' అనే ప్రశ్నలతో కొలవాలి. రాజధాని భవనాలు ప్రభుత్వానికి చిరునామా ఇస్తాయి. కానీ పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, ఉద్యోగాలు, పెట్టుబడులు నగరానికి ఆర్థిక శక్తిని ఇస్తాయి. అదే ఇప్పుడు రాష్ట్రం ముందున్న అసలు లక్ష్యం. ▪



జీవితంలో తిరుగులేని, శాశ్వతమైన స్థిరత్వాన్ని నిర్మించాలంటే.. ప్రయాణంలో ఎదురయ్యే కొన్ని తాత్కాలిక సరదాలు, క్షణికమైన ఆనందాలు వదిలేయాలి. ప్రతి కోరికను వెంటనే తీర్చుకోవడం కన్నా, భవిష్యత్తు కోసం ఈరోజు కొంత నియంత్రణ పాటించడం ముఖ్యం. ఈరోజు మీరు చేసే చిన్న త్యాగాలే, రేపటి మీ స్వేచ్ఛకు, విజయానికి బలమైన పునాదిగా మారతాయి. కష్టాలను ఓర్చుకుని, లక్ష్యంపై దృష్టి నిలిపినప్పుడు మనలో క్రమశిక్షణ పెరుగుతుంది. తాత్కాలిక ఆనందాలను వదులుకున్నప్పుడే దీర్ఘకాలిక సంతృప్తి దక్కుతుంది. గెలుపు ఒక్కరోజులో రాదు. నిరంతర శ్రమ, సహనం, త్యాగం, నమ్మకంతోనే అది సొంతమవుతుంది.

-మహాదేవ

వింతల్లో వింతలు

బిగ్ ఫుట్.. కలకలం!

అమెరికాలోని పెన్సిల్వేనియాలో 'మినీ బిగ్‌ఫుట్' కనిపించిందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. ఇండియానా, వెస్ట్‌మోర్‌లాండ్ కౌంటీల్లో వేర్వేరు సందర్భాల్లో చిన్నగా, మనిషిలా నిటారుగా నడిచే వింత జీవులను చూసినట్టు ఇద్దరు వ్యక్తులు తెలిపారు. వాటి శరీరం గోధుమ, బూడిద రంగు వెంట్రుకలతో కప్పబడి ఉందని చెప్పారు. ఈ ప్రాంతంలో గతంలోనూ బిగ్‌ఫుట్ దర్శనాలకు సంబంధించిన కథనాలు వెలుగుచూశాయి. దీంతో తాజా ఘటనలు మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అయితే, అవి నిజంగా ఏ జీవులో, కేవలం అపోహలో అన్నది ఇప్పటికీ అంతుచిక్కని మిస్టరీగానే మిగిలింది. ఇలాంటి వింత జీవుల ఆనవాళ్లు గతంలోనూ ఈ ప్రాంతంలోని అడవుల్లో కనిపించాయని స్థానికులు చెబుతున్నారు. తాజా దర్శనాలపై సోషల్ మీడియాలోనూ చర్చ మొదలైంది. అయితే, ఈ జీవుల ఉనికిని నిర్ధారించే శాస్త్రీయ ఆధారాలు ఇప్పటివరకు లభించలేదు.

ఫ్యాటీ లివర్ సమస్యను తగ్గించడంలో ఎంతో మేలు చేసే జీలకర్ర.. అధ్యయనంలో వెల్లడి..

కొవ్వు కాలేయం (ఫ్యాటీ లివర్) సమస్య భారత్‌లో వేగంగా పెరుగుతోంది. భారతీయ వైద్య పరిశోధనా మండలి అంచనాల ప్రకారం దేశంలో సుమారు 16 నుంచి 32 శాతం మంది ఫ్యాటీ లివర్ వ్యాధితో బాధపడుతున్నారు. అంటే దాదాపు 12 కోట్ల మందిపై ఈ సమస్య ప్రభావం చూపుతోంది. జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులే దీనికి ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో ఆరోగ్యకరమైన ఆహారం, సహజ పద్ధతులపై ఆసక్తి పెరుగుతోంది. వాటిలో జీలకర్ర నీరు (జీరా వాటర్) కూడా ఒకటి. కొన్ని అధ్యయనాలు జీలకర్రలోని బయోయాక్టివ్ సమ్మేళనాలు కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గించడంలో తోడ్పడతాయని సూచిస్తున్నాయి. అయితే ఇది చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోవాలి. అధ్యయనాల ప్రకారం, జీలకర్రలోని కొన్ని సహజ సమ్మేళనాలు కాలేయ ఎంజైమ్‌ల పనితీరును మెరుగుపరచడం, కొవ్వు జీవక్రియను సమతుల్యం చేయడం, ఫ్యాటీ లివర్ ప్రారంభ దశలో కొంత ప్రయోజనం కలిగించడంలో సహాయపడతాయి. అయితే ఇవి వైద్య చికిత్సతోపాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించినప్పుడే మెరుగైన ఫలితాలు ఇస్తాయి.

షుగర్ లెవల్స్ తగ్గేందుకు..

జీలకర్ర నీరు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. జీలకర్రలోని పదార్థాలు జీర్ణ ఎంజైమ్‌ల పనితీరును ప్రోత్సహించడం ద్వారా కొవ్వులు, ప్రోటీన్లు, కార్బొహైడ్రేట్ల జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. దీంతో కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. కొన్ని పరిశోధనలు జీలకర్ర నీరు రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలో, శరీరంలో కొవ్వు నిల్వలను తగ్గించడంలో సహాయపడుతుందని సూచిస్తున్నాయి. అలాగే ఫాస్టింగ్ షుగర్ స్థాయిలను నియంత్రించడం, బరువు తగ్గడంలో కూడా కొంత మేర ఉపయోగపడుతుందని పరిశోధకులు చెబుతున్నారు. జీలకర్రలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గించి కణాల రక్షణకు తోడ్పడతాయి. అలాగే మెటబాలిక్ సిండ్రోమ్‌కు సంబంధించిన కొన్ని సూచికలను మెరుగుపరచడంలో కూడా పాత్ర పోషిస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. జీలకర్ర నీరు కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గించడంలో కూడా సహాయపడుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. రోజుకు సుమారు 3 గ్రాముల జీలకర్రను మూడు నెలల పాటు తీసుకున్న వారిలో శరీర కొవ్వు, నడుము చుట్టుకొలత, కొలెస్ట్రాల్ స్థాయిల్లో మెరుగుదల కనిపించినట్లు కొన్ని అధ్యయనాలు వెల్లడించాయి.

ఉదయం తాగితే..

ఉదయం ఖాళీ కడుపుతో జీలకర్ర నీరు తాగితే అందులోని ప్రయోజనకర సమ్మేళనాలు శరీరానికి బాగా అందుతాయి. దీంతో పోషకాలు సులభంగా లభించడంతోపాటు జీవక్రియ వేగంగా ప్రారంభమవుతుంది. అలాగే పేగులు, కాలేయం మధ్య సమన్వయం మెరుగుపడటానికి కూడా ఇది తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. జీలకర్ర నీటిని తయారు చేయడం చాలా సులభం.

ఒక టీస్పూన్ జీలకర్రను రాత్రంతా నీటిలో నానబెట్టాలి లేదా నీటిలో మరిగించి ఉదయం గోరువెచ్చగా తాగాలి. ఇందులో చక్కెర కలపకుండా తీసుకోవడం మంచిది. చక్కెర కలిపితే రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉండటంతో ఆశించిన ప్రయోజనాలు తగ్గిపోతాయి.

ఈ సమస్యలు ఉంటే..

అయితే జీలకర్ర నీటిని అధికంగా తీసుకోవడం మంచిది కాదు. మోతాదుకు మించి తీసుకుంటే జీర్ణ సంబంధిత అసౌకర్యాలు తలెత్తే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గర్భిణులు, ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (IBS) ఉన్నవారు వైద్యుల సలహాతో మాత్రమే తీసుకోవాలి. అలాగే ఫ్యాటీ లివర్ తీవ్ర దశల్లో ఉన్నవారికి ఇది చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. ఫ్యాటీ లివర్ ప్రమాదాన్ని తగ్గించాలంటే సమతుల్య ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడం, మద్యం పరిమితం చేయడం వంటి జీవనశైలి మార్పులు తప్పనిసరి. అలాగే శుద్ధి చేసిన చక్కెర, మైదా వంటి రిఫైన్డ్ కార్బొహైడ్రేట్ల వినియోగాన్ని తగ్గించడం కాలేయ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. జీలకర్ర నీరు ఆరోగ్యకరమైన అలవాట్లలో ఒకటిగా ఉపయోగపడుతుంది. అయితే ఇది ఫ్యాటీ లివర్‌ను పూర్తిగా నయం చేసే మందు కాదు. ఇప్పటికే ఫ్యాటీ లివర్ ఉన్నవారు లేదా ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు దీనిని రోజువారీ అలవాటుగా మార్చే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది.

రాత్రిపూట భోజనం చేస్తూ టీవీ లేదా ఫోన్‌ను ఎక్కువ సేపు చూస్తున్నారా.. అయితే జాగ్రత్త..

రాత్రి భోజనం చేస్తూనే మొబైల్ ఫోన్, టీవీ లేదా ట్యాబ్లెట్ చూడటం చాలా మందికి రోజువారీ అలవాటుగా మారిపోయింది. అయితే ఈ అలవాటు జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా స్క్రీన్ల నుంచి వెలువడే బ్లూ లైట్ శరీరంలోని జీవ గడియారాన్ని (సర్కేడియన్ రిథమ్) దెబ్బతీసి, ఆహారం జీర్ణమయ్యే విధానాన్ని ప్రభావితం చేస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. మంచి జీర్ణక్రియ కోసం భోజన సమయంలో స్క్రీన్లకు దూరంగా ఉండటం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. పరిశోధనల ప్రకారం, బ్లూ లైట్ కేవలం నిద్ర నాణ్యతను మాత్రమే కాకుండా జీవక్రియపై కూడా ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా రాత్రి భోజనం సమయంలో స్క్రీన్ చూస్తూ తినడం అలవాటుగా మారితే శరీరంలోని సహజ జీవ గడియారం గందరగోళానికి గురవుతుంది. దీంతో జీర్ణవ్యవస్థ పనితీరు క్రమంగా దెబ్బతినే అవకాశం ఉంటుంది. శరీరంలో జీర్ణక్రియ ఒక నిర్దిష్ట జీవ గడియారం ప్రకారం సాగుతుంది. కానీ భోజనం చేస్తూనే మొబైల్ లేదా టీవీ స్క్రీన్ చూస్తే బ్లూ లైట్ పగలు–రాత్రి సంకేతాలను మెదడుకు తప్పుగా చేరవేస్తుంది. దీనివల్ల శరీరం, మెదడు సమన్వయం దెబ్బతిని జీర్ణక్రియ మందగించే అవకాశం ఉంటుంది.

అనేక సమస్యలు వచ్చే అవకాశం..

స్క్రీన్ చూస్తూ భోజనం చేసే సమయంలో చాలామంది తినే సమయాన్ని కూడా నియంత్రించలేరు. ఇష్టమైన వీడియో లేదా సీరియల్ చూస్తూ ఉండటంతో భోజనం ఎక్కువసేపు సాగుతుంది. దీంతో జీర్ణక్రియ నెమ్మదించి కడుపు ఉబ్బరం, అసౌకర్యం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. బ్లూ లైట్ ప్రభావంతో మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గుతుంది. ఇది నిద్రకు అవసరమైన ముఖ్యమైన హార్మోన్. మెలటోనిన్ తగ్గిపోవడం వల్ల నిద్రతోపాటు ఇన్సులిన్, జీవక్రియకు సంబంధించిన ఇతర హార్మోన్ల సమతుల్యత కూడా దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. పేగులు, మెదడు మధ్య బలమైన సంబంధం ఉంటుంది. దీనిని గట్–బ్రెయిన్ కనెక్షన్ అంటారు. భోజనం సమయంలో స్క్రీన్‌పై దృష్టి కేంద్రీకరించడం వల్ల మెదడు ఆహారంపై పూర్తిగా దృష్టి పెట్టదు. దీంతో జీర్ణక్రియ సమర్థత తగ్గి ఆహారం సరిగా జీర్ణం కాదు. స్క్రీన్ చూస్తూ తినడం వల్ల చాలామంది తాము ఎంత ఆహారం తింటున్నారో గుర్తించలేరు. దీనిని మైండ్‌లెస్ ఈటింగ్ అంటారు. పరిశోధనల ప్రకారం ఇలా తినేవారిలో అవసరానికి మించి ఆహారం తీసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల బరువు పెరగడం, జీర్ణవ్యవస్థపై అదనపు ఒత్తిడి పడటం వంటి సమస్యలు తలెత్తుతాయి. అలాగే ఆహారాన్ని సరిగా నమలకుండా మింగడం కూడా సాధారణంగా కనిపిస్తుంది.

జీర్ణక్రియపై ప్రభావం..

మెదడు పూర్తిగా స్క్రీన్‌పై దృష్టి పెట్టినప్పుడు లాలాజలం ఉత్పత్తి తగ్గుతుంది. దీంతో జీర్ణ ఎంజైమ్‌లు సమర్థంగా పనిచేయలేక ఆహారం జీర్ణమయ్యే ప్రక్రియ మందగిస్తుంది. అధ్యయనాల ప్రకారం బ్లూ లైట్ ప్రభావం జీవక్రియను ఆలస్యం చేయడమే కాకుండా హార్మోన్ల సహజ చక్రాన్ని కూడా దెబ్బతీస్తుంది. అలాగే భోజనం సమయంలో దృష్టి మరలడం వల్ల ఎక్కువ కేలరీలు తీసుకోవడం, జీర్ణక్రియ సరిగా జరగకపోవడం వంటి సమస్యలు పెరిగే అవకాశం ఉంటుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. రాత్రి భోజనం త్వరగా చేయడం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. నిద్రపోయే సమయానికి కనీసం మూడు గంటల ముందు భోజనం ముగిస్తే జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు శరీర జీవ గడియారం సక్రమంగా పనిచేస్తుంది. రాత్రివేళ బ్లూ లైట్ ప్రభావం ఎక్కువగా ఉండటంతో ఆలస్యంగా భోజనం చేయడం, స్క్రీన్ చూస్తూ తినడం వల్ల కొవ్వు నిల్వలు పెరిగే ప్రమాదం కూడా ఉంటుంది.

డిన్నర్ అలవాట్లన మార్చాలి..

భోజనం చేసిన తర్వాత తరచూ కడుపు ఉబ్బరం, యాసిడ్ రిఫ్లక్స్, మల విసర్జనలో అసమానతలు, రాత్రివేళ మళ్లీ ఆకలి వేయడం వంటి సమస్యలు కనిపిస్తే డిన్నర్ అలవాట్లను ఒకసారి పరిశీలించుకోవాలి. జీర్ణక్రియను మెరుగుపరచాలంటే భోజనం సమయంలో మొబైల్, టీవీ వంటి స్క్రీన్లను పూర్తిగా పక్కన పెట్టాలి. ప్రతిరోజూ ఒకే సమయానికి భోజనం చేయడం, ఆహారాన్ని నెమ్మదిగా బాగా నమిలి తినడం అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా రోజుకు కనీసం 20 నుంచి 30 నిమిషాలు స్క్రీన్–ఫ్రీ మీల్ పాటించడం ద్వారా జీర్ణవ్యవస్థపై పడే ప్రతికూల ప్రభావాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు.

నోరు, దంతాల సమస్యలు ఉన్నవారు వీటిని ఉపయోగించండి.. ఎంతో ఉపశమనం లభిస్తుంది..

మన నోటి ఆరోగ్యం మన మొత్తం ఆరోగ్యానికి అద్దం పడుతుంది. దంతాలు బలహీనపడటం, పిప్పి దంతాలు, దంతాలపై మరకలు, దంతాల సున్నితత్వం (టూత్ సెన్సిటివిటీ) వంటి సమస్యలు చాలా మందిలో కనిపిస్తున్నాయి. ముఖ్యంగా చల్లని లేదా వేడి ఆహారం తిన్నప్పుడు దంతాలలో ఒక్కసారిగా నొప్పి లేదా జలదరింపు అనిపించడం దంతాల సున్నితత్వానికి సంకేతం. అయితే కొన్ని సాధారణ జాగ్రత్తలను పాటించడం ద్వారా ఈ సమస్యను తగ్గించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అమ్లం (ఆసిడిటీ) ఎక్కువగా ఉండే ఆహారాలు, పానీయాలను అధికంగా తీసుకోవడం తగ్గించాలి. ఇవి దంతాలపై ఉండే ఎనామెల్‌ను క్రమంగా దెబ్బతీసి సున్నితత్వాన్ని పెంచే అవకాశం ఉంటుంది. అలాగే ఇలాంటి ఆహారం తీసుకున్న వెంటనే కాకుండా కనీసం 20 నిమిషాల తర్వాత దంతాలను తోమడం మంచిది. గ్యాస్ట్రిక్ సమస్యలు లేదా యాసిడ్ రిఫ్లక్స్‌తో బాధపడేవారు వాటికి సరైన చికిత్స తీసుకోవాలి. కడుపులోని ఆమ్లం తరచూ నోటిలోకి రావడం వల్ల దంతాలలోని ఖనిజాలు తగ్గి, ఎనామెల్ దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. దీంతో దంతాల సున్నితత్వం మరింత పెరుగుతుంది.

గ్రీన్ టీ..

గ్రీన్ టీ తాగడం కూడా దంతాల ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం గ్రీన్ టీలో ఉండే కొన్ని సమ్మేళనాలు దంతాల సున్నితత్వాన్ని తగ్గించడంలో సహాయపడే అవకాశం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. ఉప్పు కలిపిన గోరువెచ్చని నీటితో నోరు పుక్కిలించడం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది నోటిలోని పీహెచ్ స్థాయిని సమతుల్యం చేయడంలో సహాయపడి, బ్యాక్టీరియా పెరుగుదలను తగ్గించడంలో తోడ్పడుతుంది. దంతాలను తెల్లగా మార్చే (టీత్ వైటెనింగ్) ఉత్పత్తులు లేదా ఆల్కహాల్ అధికంగా ఉండే మౌత్‌వాష్‌లను తరచూ ఉపయోగించడం తగ్గించాలి. ఇవి కొందరిలో దంతాల సున్నితత్వాన్ని మరింత పెంచే అవకాశం ఉంటుంది. అవసరమైతే సహజ పదార్థాలతో తయారైన ఉత్పత్తులను మాత్రమే ఉపయోగించడం మంచిది.

లవంగాలు..

లవంగం లేదా లవంగ నూనె కూడా దంతాల సున్నితత్వం వల్ల వచ్చే అసౌకర్యాన్ని తాత్కాలికంగా తగ్గించడంలో ఉపయోగపడుతుంది. లవంగంలో ఉండే సహజ సమ్మేళనాలు నొప్పిని తగ్గించే లక్షణాలను కలిగి ఉంటాయి. దంతాల సున్నితత్వం తరచూ వేధిస్తుంటే లేదా నొప్పి ఎక్కువగా ఉంటే ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకుండా దంత వైద్యుడిని సంప్రదించడం అవసరం. సరైన కారణాన్ని గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా సమస్య మరింత తీవ్రమవకుండా నివారించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

దగ్గిన ప్రతిసారి తలనొప్పి వస్తుందా.. అయితే ఈ సమస్యలు ఉన్నాయోమో పరిశీలించండి..

వర్షాకాలంలో జలుబు, దగ్గు వంటి సమస్యలు సాధారణంగా కనిపిస్తాయి. అయితే దగ్గిన ప్రతిసారి తలనొప్పి రావడం మాత్రం సాధారణ విషయం కాదు. చాలా సందర్భాల్లో ఇది తాత్కాలికంగా ఉండి ప్రమాదకరం కాకపోయినా, కొన్నిసార్లు మెదడు లేదా నరాల వ్యవస్థకు సంబంధించిన తీవ్రమైన సమస్యలకు సంకేతంగా ఉండే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా కొత్తగా ప్రారంభమైన లేదా తీవ్రంగా ఉన్న దగ్గుతో కూడిన తలనొప్పిని నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరం. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, గట్టిగా నవ్వినప్పుడు లేదా మలవిసర్జన సమయంలో ఒత్తిడి పెట్టినప్పుడు తలలో అకస్మాత్తుగా నొప్పి రావడాన్ని కఫ్ హెడేక్ అంటారు. ఇది ప్రధానంగా రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి ప్రైమరీ కఫ్ హెడేక్, మరొకటి సెకండరీ కఫ్ హెడేక్. ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించడం చికిత్సలో కీలకంగా ఉంటుంది.

తలనొప్పి వస్తే ఏంటి అర్థం..

గట్టిగా దగ్గినప్పుడు ఛాతీ, పొత్తికడుపు భాగాల్లో ఒత్తిడి ఒక్కసారిగా పెరుగుతుంది. ఈ ఒత్తిడి తాత్కాలికంగా మెదడులో రక్తప్రసరణ, ద్రవాల ప్రవాహంపై ప్రభావం చూపుతుంది. దీంతో అకస్మాత్తుగా తలనొప్పి వస్తుంది. ప్రైమరీ కఫ్ హెడేక్‌కు ఇదే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఈ నొప్పి సాధారణంగా ఒక్కసారిగా మొదలై, పదునుగా లేదా గుచ్చుకున్నట్లుగా అనిపిస్తుంది. కొన్ని సెకన్ల నుంచి కొన్ని నిమిషాల్లోనే తగ్గిపోవడం దీని ప్రత్యేకత. అయితే అన్ని కఫ్ హెడేక్‌లు ప్రమాదరహితమైనవి కావు. కొన్నిసార్లు మెదడులో లేదా దాని చుట్టూ ఉన్న నిర్మాణాల్లో సమస్యలు, సెరెబ్రోస్పైనల్ ద్రవ ప్రవాహంలో లోపాలు, నిర్మాణపరమైన మార్పులు లేదా అరుదుగా మెదడు కణితి వంటి కారణాల వల్ల కూడా సెకండరీ కఫ్ హెడేక్ వస్తుంది. ఈ సందర్భాల్లో దగ్గు అసలు కారణం కాకుండా, ఇప్పటికే ఉన్న సమస్యను బయటపెట్టే ట్రిగ్గర్‌గా పనిచేస్తుంది. సెకండరీ కఫ్ హెడేక్ సాధారణంగా ఎక్కువసేపు కొనసాగుతుంది. దీంతోపాటు ఇతర నరాల సంబంధిత లక్షణాలు కూడా కనిపిస్తాయి. ముఖ్యంగా తల తిరగడం, నడవడంలో సమతుల్యత కోల్పోవడం, చూపు మసకబారడం, చేతులు లేదా కాళ్లలో బలహీనత, తిమ్మిరి, పదేపదే వాంతులు, గందరగోళం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

తీవ్రత ఎక్కువగా ఉంటే..

దగ్గుతో వచ్చే తలనొప్పి మొదటిసారిగా కనిపించినప్పుడు, గతంతో పోలిస్తే తీవ్రంగా ఉన్నప్పుడు, కొన్ని నిమిషాలకంటే ఎక్కువసేపు కొనసాగినప్పుడు లేదా జ్వరంతో పాటు వచ్చినప్పుడు కూడా వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిది. అలాగే స్పృహ తప్పడం, చూపు సమస్యలు, చేతులు లేదా కాళ్లలో బలహీనత వంటి లక్షణాలు ఉంటే ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి వెళ్లాలి. కఫ్ హెడేక్ కారణాన్ని గుర్తించేందుకు వైద్యులు ముందుగా లక్షణాలు, వైద్య చరిత్రను పరిశీలిస్తారు. అవసరమైతే ఎంఆర్ఐ లేదా సీటీ స్కాన్ వంటి ఇమేజింగ్ పరీక్షలు సూచిస్తారు. వీటి ద్వారా మెదడులో నిర్మాణపరమైన మార్పులు, సెరెబ్రోస్పైనల్ ద్రవ ప్రవాహంలో సమస్యలు లేదా ఇతర వ్యాధులను గుర్తించే అవకాశం ఉంటుంది. చికిత్స పూర్తిగా కఫ్ హెడేక్ రకంపై ఆధారపడి ఉంటుంది.



సెకండరీ కఫ్ హెడేక్ ఉంటే..

ప్రైమరీ కఫ్ హెడేక్‌కు తలనొప్పి తీవ్రత, తరచుదనాన్ని తగ్గించే మందులు ఇస్తారు. కొంతమందిలో కాలక్రమేణా ఈ సమస్య స్వయంగా తగ్గిపోతుంది. సెకండరీ కఫ్ హెడేక్‌లో మాత్రం అసలు కారణమైన వ్యాధికి చికిత్స చేయాల్సి ఉంటుంది. సమస్య స్వభావాన్ని బట్టి మందులు, న్యూరాలజీ నిపుణుల చికిత్స లేదా కొన్ని సందర్భాల్లో శస్త్రచికిత్స కూడా అవసరం అవుతుంది. కేవలం నొప్పిని తగ్గించడం కాకుండా, దానికి కారణమైన సమస్యను గుర్తించి చికిత్స చేయడం అత్యంత ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. దగ్గిన ప్రతిసారి తలనొప్పి వస్తే దానిని చిన్న సమస్యగా తీసుకుని స్వయంగా మందులు వాడకూడదు. ముఖ్యంగా కొత్తగా ప్రారంభమైన, తీవ్రమైన లేదా ఇతర నరాల సంబంధిత లక్షణాలతో కూడిన తలనొప్పి ఉంటే వెంటనే వైద్య సలహా తీసుకోవడం ద్వారా తీవ్రమైన సమస్యలను ముందుగానే గుర్తించి సరైన చికిత్స పొందే అవకాశం ఉంటుంది.

సోనల్ దినుష అద్భుతం.. ప్రత్యేకంగా అభినందించిన గౌతమ్ గంభీర్

లంక యువ బ్యాటర్ సోనల్ దినుషపై గంభీర్ ప్రశంసలు

భారత్‌తో రెండో టెస్టును ఒంటిచేత్తో డ్రా చేసిన దినుష

టెస్ట్ సిరీస్‌ను 1-0 తేడాతో గెలుచుకున్న టీమిండియా

హైదరాబాద్ పెన్ పవర్: భారత జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, ప్రత్యర్థి జట్టులోని ఓ యువ ఆటగాడిపై ప్రశంసల వర్షం కురిపించాడు. శ్రీలంక యువ సంచలనం సోనల్ దినుష అసాధారణ పోరాటపటిమను ప్రత్యేకంగా అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. భారత్‌తో రెండో టెస్టును ఒంటిచేత్తో డ్రాగా ముగించిన అతడి ఆటతీరును గంభీర్ మెచ్చుకున్నాడు. ఈ సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకున్నప్పటికీ, దినుష ప్రదర్శన అందరి దృష్టిని ఆకర్షించింది. శుక్రవారం తన 'ఎక్స్' ఖాతాలో గంభీర్ స్పందిస్తూ.. "టెస్ట్ క్రికెట్‌కు పట్టుదల, ఓపిక, మానసిక దృఢత్వం చాలా అవసరం. మన కుర్రాళ్లు దానిని ప్రదర్శించారు! అయితే, సోనల్ దినుష అసాధారణ ప్రదర్శనకు ప్రత్యేక అభినందనలు!" అని పేర్కొన్నాడు. కొలంబోలోని సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో గురువారం ముగిసిన రెండో టెస్టులో, టీమిండియా విజయం అంచున నిలిచింది. అయితే, లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ సోనల్ దినుష అద్భుతమైన సెంచరీతో లంకను ఆదుకున్నాడు. ఫాలో ఆన్ ఆడుతూ కష్టాల్లో పడిన జట్టును తన అజేయమైన 133 పరుగుల (264 బంతుల్లో) ఇన్నింగ్స్‌తో గట్టెక్కించాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఫలితంగా భారత్ 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ చేసే అవకాశాన్ని కోల్పోయింది. అంతకుముందు గాలెలో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే.

రికార్డుల మోత మోగించిన దినుష

ఈ సిరీస్‌లో సోనల్ దినుష అద్భుత ఫామ్‌తో చెలరేగాడు. మొత్తం నాలుగు ఇన్నింగ్స్‌లలో ఏకంగా 420 పరుగులు సాధించాడు. ఇందులో 3 సెంచరీలు, ద

ఒక హాఫ్ సెంచరీ (84) ఉన్నాయి. ఈ క్రమంలో పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఆరో స్థానం లేదా అంతకంటే దిగువన బ్యాటింగ్‌కు వచ్చి ఒకే టెస్టులో రెండు సెంచరీలు చేసిన నాలుగో శ్రీలంక ఆటగాడిగా నిలిచాడు. అలాగే, ఒకే టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌లలోనూ శతకాలు బాదిన ఎనిమిదో శ్రీలంక క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడు. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో మూడు సెంచరీలు నమోదు చేసిన మూడో లంక బ్యాటర్‌గా అరవింద డిసిల్వా, కుమార సంగక్కర సరసన చేరాడు.

టెస్టుల్లో నా సత్తా ఏంటో చూపించా: పడిక్కల్ హ్యాపీ

- టెస్టుల్లో పెద్ద స్కోర్లు చేయగలనని నిరూపించుకున్న పడిక్కల్
- శ్రీలంక సిరీస్‌లో 328 పరుగులతో అదరగొట్టిన బ్యాటర్
- 109.33 సగటుతో రెండు సెంచరీలు చేసిన పడిక్కల్
- స్పిన్‌ను ఎదుర్కొనేందుకు ముందే ప్రత్యేకంగా సిద్ధమైనట్లు వెల్లడి
- శ్రీలంకలో పరిస్థితులు సవాలుగా ఉన్నాయన్న పడిక్కల్

హైదరాబాద్ పెన్ పవర్: టెస్టు క్రికెట్‌లో తాను పెద్ద స్కోర్లు చేయగలనని నిరూపించుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని భారత బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్ అన్నాడు. శ్రీలంకతో 1-0తో సిరీస్ గెలవడంలో తన ప్రదర్శన పట్ల సంతోషం వ్యక్తం చేశాడు. దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఏళ్లుగా సాధించిన నిలకడే టెస్టుల్లోనూ రాణించేందుకు ఉపయోగపడిందని చెప్పాడు. సాయి సుదర్శన్ గాయపడటంతో మూడో స్థానంలో బ్యాటింగ్ చేసిన పడిక్కల్ రెండు టెస్టుల్లో 328 పరుగులు చేశాడు. 109.33 సగటుతో రెండు సెంచరీలు సాధించాడు. ఈ సిరీస్‌లో తనకు అవకాశం వస్తుందని తెలిసినప్పటి నుంచే దాని కోసం ఎదురుచూశానని తెలిపాడు. తన సత్తా ఏంటో చూపించేందుకు ఇదే సరైన అవకాశమని భావించానని చెప్పాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో పెద్ద స్కోర్లు చేసినట్లే టెస్టుల్లోనూ చేయగలిగానని ఆనందం వ్యక్తం చేశాడు. ఈ సిరీస్ ఇచ్చిన నమ్మకంతో కెరీర్‌లో ముందుకు సాగుతానని అన్నాడు. శ్రీలంకలో వేడి, ఉక్కపోత పరిస్థితులు జట్టుకు సవాలుగా నిలిచాయని పడిక్కల్ చెప్పాడు. పరిస్థితులు అంత సులభంగా లేకపోయినా మొత్తం జట్టు వంద శాతం కష్టపడిందని ప్రశంసించాడు. అందరూ ఒకే లక్ష్యంతో ఆడటం మంచి సంకేతమని పేర్కొన్నాడు. శ్రీలంక స్పిన్నర్లను ఎదుర్కోవడంపై సిరీస్‌కు ముందే ప్రత్యేకంగా సిద్ధమయ్యానని పడిక్కల్ వెల్లడించాడు. అక్కడ స్పిన్‌ను ఎదుర్కోవడం పెద్ద సవాలుగా ఉంటుందని ముందే తెలుసని చెప్పాడు. అందుకు తగ్గట్టుగా సాధన చేయడం వల్ల మంచి ఫలితం వచ్చిందని తెలిపాడు. ఇకపైనా స్పిన్‌ను ఎదుర్కొనే విషయంలో మరింత మెరుగవుతానని అన్నాడు.

రెండో టెస్టులో శ్రీలంక బ్యాటర్లు అద్భుతంగా పోరాడారని పడిక్కల్ ప్రశంసించాడు. సోనల్, కేశర బ్యాటింగ్ అసాధారణంగా ఉందన్నాడు. భారత బౌలర్లు తమ శక్తిమేరకు ప్రయత్నించారని చెప్పాడు. అయితే శ్రీలంక ఆటగాళ్లు మంచి క్రికెట్ ఆడి డ్రా చేసుకున్నారని పేర్కొన్నాడు.

కుర్రాళ్ల జోరుకు గిల్ ఫుల్ ఖుషీ.. భారత్‌కు కొత్త బలం!

శ్రీలంకపై 1-0తో సిరీస్ గెలిచిన భారత్

యువ ఆటగాళ్ల ప్రదర్శనపై గిల్ సంతోషం

పడిక్కల్ రెండు సెంచరీలతో 328 పరుగులు

సిరీస్‌లో మానవ్ సుతార్ కు 16 వికెట్లు

గాలే టెస్టులో సుతార్‌కు పది వికెట్ల ఘనత

హైదరాబాద్ పెన్ పవర్: శ్రీలంకపై టెస్టు సిరీస్ గెలిచిన తర్వాత భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సంతోషం వ్యక్తం చేశాడు. రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో విజయం సాధించడం ఆనందంగా ఉందన్నాడు. రెండో టెస్టు డ్రాగా ముగిసినా, ఈ పర్యటనలో జట్టుకు ఎన్నో మంచి అంశాలు కనిపించాయని తెలిపాడు. ముఖ్యంగా యువ ఆటగాళ్లు దేవ్‌దత్ పడిక్కల్, మానవ్ సుతార్ రాణించడం తనను ఆకట్టుకుందని చెప్పాడు. సాయి సుదర్శన్ స్థానంలో మూడో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన పడిక్కల్ సిరీస్‌లో అదరగొట్టాడు. రెండు సెంచరీలతో 328 పరుగులు చేశాడు. క్రీజులో నిలదొక్కుకున్న తర్వాత పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడాలని బ్యాటర్లకు చెబుతుంటామని గిల్ అన్నాడు. పడిక్కల్ అదే చేసి చూపించాడని ప్రశంసించాడు. అతడి ఆట జట్టుకు మంచి సంకేతమని తెలిపాడు. ఎడమచేతి స్పిన్ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్‌పైనా గిల్ ప్రశంసలు కురిపించాడు. సిరీస్‌లో 16 వికెట్లు తీసిన సుతార్ గాలే టెస్టులో పది వికెట్లతో భారత్ 165 పరుగుల విజయానికి కీలకంగా నిలిచాడు. అతడు భవిష్యత్తులో భారత స్పిన్ దాడికి చాలా కాలం నాయకత్వం వహించే ఆటగాడిగా ఎదుగుతాడని గిల్ విశ్వాసం వ్యక్తం చేశాడు. బౌలింగ్‌కు వచ్చిన ప్రతిసారీ వికెట్లు తీసే అవకాశం కల్పిస్తున్నాడని అన్నాడు. రెండో టెస్టు డ్రా కావడం మాత్రం నిరాశ కలిగించిందని గిల్ చెప్పాడు. రెండో రోజు ఆట ముగిసే సరికి గెలుస్తామని భావించామని తెలిపాడు. కానీ చివరి మూడు రోజులు శ్రీలంక అద్భుతంగా పోరాడిందని ప్రశంసించాడు. ప్రత్యర్థి ఆట నుంచి కూడా పాఠాలు నేర్చుకోవాలని అన్నాడు. ఈ సిరీస్ నుంచి మంచి అనుభవం దక్కిందని, న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లో మరింత మెరుగ్గా ఆడతామని గిల్ ధీమా వ్యక్తం చేశాడు.

'ఆయా షేర్' తర్వాత.. ఏం ప్లాన్ చేశారయ్యా

నాని 'ది ప్యారడైజ్' నుంచి ఫస్ట్ వచ్చిన 'ఆయా షేర్' పాట తన పని చేసేసింది. సినిమా ఎలా ఉండబోతోందనే విషయాన్ని పూర్తిగా చెప్పకుండానే, నాని పాత్రను ఒక రేంజ్‌లో పరిచయం చేశారు. అనిరుధ్ మ్యూజిక్, కాసర్ల శ్యామ్ లిరిక్స్ కూడా పాటను జనాల్లోకి తీసుకెళ్లాయి. ఇప్పుడు రెండో సింగిల్ దగ్గరకు వచ్చేసరికి అదే టీమ్ నుంచి మరో చిన్న హింట్ బయటకు వచ్చింది. ఈసారి కాసర్ల శ్యామ్ ముందుగా ఓ క్లారిటీ ఇచ్చాడు. రెండో పాట ఫైనల్ అవుట్‌పుట్ విన్న తర్వాత "DJ Anirudh bolthe.. Lit K Ramp" అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. అనిరుధ్, నాని, శ్రీకాంత్ ఓదెలతో పాటు 'ది ప్యారడైజ్' టీమ్‌ను ట్యాగ్

చేశాడు. పాట పేరు కానీ, ట్యూన్ ఎలా ఉంటుందనే విషయం కానీ చెప్పలేదు. కానీ ఫైనల్ వెర్షన్ రెడీ అయిందనే విషయం మాత్రం ఈ పోస్ట్‌తో బయటకు వచ్చింది. ఇక్కడ మేకర్స్ ఎలాంటి పాటను ఎంచుకున్నారన్నది హాట్ టాపిక్ గా మారింది 'ఆయా షేర్'ను రెగ్యులర్ సినిమా పాటలా వదలకుండా, నాని పాత్ర జడల్ ప్రపంచాన్ని ముందుగా పరిచయం చేసేలా తీసుకొచ్చారు. అందుకే రెండో పాట కూడా కథలో ఏ భాగాన్ని ముందుకు తీసుకొస్తుందన్నది తెలియాల్సి ఉంది. పైగా ఈ పాటకు కూడా కాసర్ల శ్యామ్ పనిచేయడం మరో కామన్ పాయింట్. 'ఆయా షేర్'లో ఆయన వాడిన పదాలు, అనిరుధ్ ఇచ్చిన బీట్ కలిసి ప్రత్యేకమైన స్టైల్‌లో వెళ్లాయి. ఇప్పుడు అదే ఇద్దరూ మరోసా కలవడంతో మొదటి పాట తరహాలోనే వెళ్తారా, లేక పూర్తిగా వ టోన్ పట్టుకుంటారా అన్నది పాట వచ్చాకే తెలుస్తుంది. 'దసరా తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కలిసి చేస్తున్న సినిమా కావడంతో 'ది ప్యారడైజ్' ప్రతి అప్డేట్‌ను మేకర్స్ కాస్త ప్లాన్‌తోనే బయటకు తీసుకొస్తున్నారు. ఒకేసారి ఎక్కువ విషయాలు చెప్పకుండా, ముందు నాని లుక్, తర్వాత 'ఆయా షేర్', ఇప్పుడు రెండో సింగిల్ అంటూ ఒక్కోటి బయటకు వస్తోంది. ప్రస్తుతం రెండో పాటకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా చెప్పలేదు. అయితే ఫైనల్ అవుట్‌పుట్ వరకు పని వచ్చేసిందని కాసర్ల శ్యామ్ పోస్ట్‌తో క్లియర్ అయింది. 'ఆయా షేర్'తో మొదటి పాటను ఒక రూట్‌లో తీసుకెళ్లిన టీమ్, ఇప్పుడు రెండో పాట కోసం ఏం ప్లాన్ చేసిందన్నదే నెక్స్ట్.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965